నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

డిసెంబరు 1959

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

గాంధీనగరం * విజయవాడ-2

విషయసూచిక

నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 2 | విజయవాడ * డిసెంబరు 1959 | సంచిక 3

ఏది మనకు ఆదర్శము?

ఈనాడు మన జీవితమునకు ఆదర్శమున్నదా యను శంక కలుగుచున్నది. మనలో యీ శంక కలుగుటకు కారణమున్నది. మనము చెప్పే తీరుకు, దానిని అనుసరించే తీరుకు వ్యత్యాసము కన్పించుచున్నది. మనము చెప్పునవి లోకములోని వారు అనుసరించిన ప్రతి ఒక్కరికి ఆశాభంగము కలుగుచున్నది ఇందుకు యెన్నియో కారణములు ఆధారపడియున్నవి. మనము అంటరానితనమును రూపుమాపవలయునని ప్రయత్నించి ప్రచారము చేసితిమి. అంటరానితనము అటులనేయుండి తాత్కాలికావసరమునకు కలిసి మెలిసి తిరుగుచుంటిమి. మన ఆదర్శప్రచారమునకు మన ఆచరణవాదమునకు యుక్తివాదము హేతువుగా నిలిచియున్నది.

సాంఘిక దురాచారమను పేరుతో దేవదాసీవృత్తిని నివారింపనెంచితిమి. ఈ దేవదాసీవృత్తిని తలదన్నిన సినిమావృత్తిని ప్రవేశింపజేసితిమి ఇది యే సాంఘిక ప్రయోజనమును సాధించిపెట్టుచున్నదో తెలియనిస్థితిలో మనముంటిమి దేవదాసీవృత్తిని నిరసించిన విజ్ఞులందరూ సర్వజ్ఞులవలె సినిమావృత్తిని ప్రశంసించుచున్నారు.

కులతత్వమును నిర్మూలించవలయునని సంకల్పించిన వారందరూ కులముల ప్రాతిపదికపైననే ప్రాతినిధ్యము నిచ్చుచున్నారు ఏ కులతత్వములు సాంఘిక సామరస్యమునకు తీరని అపచారములని వాదించిరో ఆ కులతత్వములనే ప్రోత్సహించు విధమున ప్రచారము గావించుచున్నారు.

జాతీయవిద్యకే ప్రాధాన్యము నీయవలయునని చెప్పినవారే విజాతీయవిద్యా ప్రచారము చేయుచున్నారు. ఏది జాతీయవిద్యయో, ఏది విజాతీయవిద్యయో తెలియని విధమున ప్రవర్తించుచున్నారు విద్యకు ప్రమాణముగాని, ప్రమాణబుద్ధి గలవారికి ప్రశంసాపత్రములుగాని లభించుటలేదు ఎవరు తమ ఆశ్రితులో,ఎవరు సామాన్యపరిజ్ఞానము కలవారో వారిని యెంచి ప్రశంసాపత్రములు పంచుచున్నారు. ఇవి జాతీయవిధానములా? లేక విజాతీయ విధానములా? లేక మిశ్రమ విధానములా యని పలువురు పలువిధములుగా విమర్శించుచున్నారు.

భారతభూమికి స్వతంత్రత సమకూర్చవలయునని సంకల్పించి, తుదకు భారతభూమినే రెండు ఖండములుగా విభాగించి ఒకటి భారతఖండమని రెండవది పాకిస్థానమని భావించమనుచున్నారు. అఖండ భారతభూమిని విఖండముచేసిన మనకు యేది ఆదర్శమో యేది ఆదర్శము కాదో తెలియవలసిన అవసరమేమున్నది?

సీతారాముల దాంపత్యజీవనమే పరమాదర్శమని ప్రబోధించినవారే సామాన్య జీవన పద్ధతులను ప్రశంసించుచున్నారు. భారతపౌరునకు ఆదర్శములేని జీవితవిధానమును సూచించు రాజ్యాంగచట్టమును యేర్పరచి దీనినే జీవితమునకు పరమార్థముగా భావించమని చెప్పుచున్నారు.

సద్వ్యసనములకు ప్రోత్సాహము, దుర్వ్యసనములకు నిరుత్సాహము కల్పించ సంకల్పించి చట్టములను రూపొందించి ప్రజాజీవనమునకు చట్టవ్యవహారమునకు యెడతెగని పోరాటమును యేర్పరచినారు.

భూవిధానమును, ఆర్థికవిధానమును మూలమట్టముగా సంస్కరించి నూతన విధానములను ప్రవేశపెట్టుచున్నారు అధికోత్పత్తికి దోహదముచేయునని ఆశించుచున్నారు. ఇవి చట్టములుగా రూపొంది యే విధముగా పరిణమించునో దురూహ్యముగా నున్నది. మనమన ఆలోచనలు మనమన వ్యవహారములు, మనమన పద్ధతుల పర్యవసానములు, మనమన నడవడికను తీర్చి దిద్దగలుగునో లేదో సందేహాస్పదముగా నున్నది.

ప్రపంచములోని భిన్నభిన్న విధానములు, వాటివలన మనకు కలుగు అంతరాయములు, మనము వాటినుంచి తప్పించుకొను తీరుతెన్నులు, మన ప్రయోజనమును ఎంతవరకు సాధించుచున్నవో యిదమిద్ధమని తేల్చి చెప్పుటకు అనూహ్యముగా నున్నది.

ఈ యీ కారణముల వలన మన జాతీయాదర్శము మనజాతి భావిభాగ్యోదయమునకు దోహదము చేయగలిగినది లేనిది నిర్ణయించి తీర్పుచెప్పుటకు సాధ్యము కాదనిపించుచున్నది.

స్వతంత్ర భారతదేశములో నివసిస్తున్న ప్రతివానికి యీనాడు యీ జరుగుచున్నదంతయు ఒక సమస్యగా కనిపించుచున్నది. చెప్పేదానికి చేసేదానికి సమన్వయం కుదరనందువలన మానవ జీవితాదర్శమే దెబ్బ తినిపోవుచున్నదని సందేహము కలుగుచున్నది. ఈ సందేహమును తీర్చవలయును. దీనిని తీర్చవలసిన బాధ్యత జాతీయాభిమానులపైనా, ప్రత్యేకముగా భారత జాతీయాదర్శమున్నదను వాదన చేయువారిపైనా హెచ్చుగా నున్నది.

ఈనాటి కర్తవ్యమును గుర్తెరిగి, కార్యకారణ సంబంధములను గ్రహించి, భావిభారత భాగ్యోదయానికి రూపురేఖలు తీర్చిదిద్దగల భారతజాతీయ విద్వాంసులైన మన కళాప్రపూర్ణులందరూ తమతమ విద్యుక్తధర్మములను నిర్వర్తించినచో ప్రయోజనముండునని ఆశించవచ్చునా? ఆదర్శములపై కలుగుచున్న శంక తొలగించగలరని నమ్మవచ్చునా?

శ్రీ సత్యసాయిబాబా

శ్రీ వేలూరి శివరామశాస్త్రి



శ్రీ సత్యసాయిబాబా గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని పలువురు ప్రశ్నిస్తారు; నేను తెల్లపోతాను కాని; అంతలోనే సంబాళించుకొని 'స్వయంగా దర్శనం చేసుకోండి; మీకు మీరే అర్థంచేసుకోండి' అని వారికి విన్నవిస్తాను.

'పరమ హంసవంటివారా? లేక రమణమహర్షి వంటివారా?' అని మరికొంద రడుగుతారు. 'సత్య సాయిబాబా సత్యసాయిబాబా వంటివారు' అని వారికి ప్రత్యుత్తరం చెపుతాను.

పుట్టుపర్తిలో (ఇది అనంతపురం జిల్లా పెనుకొండ తాలూకాలో ఉన్నది.) శ్రీ సత్యనారాయణ అనే బాలుడు అపుడపు డావలించినపుడు యశోదాదులు శ్రీకృష్ణుని వదనకుహరంలో బ్రహ్మాండాలు చూచినటులు కొందరు రామకృష్ణాద్యవతారాలు చూచి 'ఇతడు దేవబాలుడు' అని అనుకొన్నారు. కొంద 'రితడు, పిశాచగ్రస్తుడు' అని అనుకొన్నారు. అపు డితడు తోడిబాలురచేత సంకీర్తనం చేయించడం ఆరంభించాడు. తోడివారికి పుష్పఫల ఖద్యాదులను సృష్టించి ఇస్తూఉండేవాడు. ఇవన్నీ ఎట్లా వస్తున్నవి' అని అడిగితే 'నాలో ఒక వృద్ధుడు ఉన్నాడు; ఆయన

కడనుండి ఇవి పస్తున్నవి' అని చెప్పేవాడు ఈ రీతిగా లీలలు చూపుతూ చూపుతూ బలవంతాన ఉరవకొండలో ఫోర్త్ ఫారమ్ చదువుతూ చదువుతూ సుమారు పద్నాల్గు పండ్లప్పుడు (20 అక్టో-' 40) చల్లకువచ్చి ముంత దాచడం ఎందుకని 'నేను సాయిని, నేను సాయిని, నే వచ్చిన పని కిక నేను పోతాను,'అని బడితోపాటు ఇల్లుకూడా వదలి ఈ సాయి 'మానసభజరే గురుచరణమ్ దుస్తర భవసాగర తరణమ్' అనే సంకీర్త నంతో వెలువడి తన మహిమలు సహస్రముఖాల చూపడం మొదలుపెట్టాడు. ఆ సాయిచరిత్ర బి. నరసింహస్వామి- గుణాజీలు వ్రాసిరి. మరాటీలో పలువురు (విని వ్రాసినది కాబట్టి కొంత ప్రమాణం కాకపోయినా) చదివినవారు, మరి ఎరిగిఉన్న వారు, ఈ సాయిమహిమలు చూస్తే ఈ ఉభయులూ తాపత్రయం పోగొట్టడానికి వచ్చినవారనిన్నీ ఒకే తత్త్వమనిన్నీ గ్రహిస్తున్నారు

అందరకూ అందుబాటులోని దని వీరు భక్తిని బోధిస్తారు పుస్తకాలు చదివి నట్లు అందర హృదయాలూ చదివేస్తారు ఆధివ్యాధులను పోగొట్టుతున్నారు. ఇష్ట దేవతా విగ్రహాలను, వజ్రాదులను, అమృతాది రసాయనాలను, వింతలైన తినుబండా లను దివ్యములైన ఔషధాలను, ఒకటేమిటి- సంకల్పమాత్రాన తాము తలచిన సమస్తాన్ని సృజించి యివ్వడమేకాదు, తిమ్మిని బమ్మిని బమ్మిని తిమ్మినిగాను చేస్తారు, నిర్మాణకాయంతో దేశాంతరం వెళ్ళి ఆర్తులగు భక్తులను అన్నివిధాల ఆద రిస్తారు, కడతేరుస్తారు. దూరశ్రవణజ్ఞానాదులు వీరికి వెన్నతో పెట్టినవి. ఇలా వీరిమహి మలను చెప్పవలసివస్తే వ్యాసులవారి నోరైనా కాసుకుగూడా పనికిరాదు. ఈ తత్త్వము మహిమలకు కుబేరనిధి.

ఇది అందరకూ అందుబాటులో ఉన్నా అందని తత్త్వం. సైన్సుకు ఇదిఅందదు హేతుజ్ఞానం పొందదు. వీను మిగిలిన భక్తుల- జ్ఞానుల పరిపాకం ఇందున్నా ఇది అందరకన్న విజాతీయం. దీనికి సహస్రముఖాలు. నీకు కనబడేది వేరు, నాకు కన బడేది వేరు కావచ్చు. దీనిని కనినంతచాలు, మరి చాలదు. ఇది ఎంత పరమో అంత ఆత్మీయం ప్రపంచంలో తల్లులందర ప్రేమా ఏకత్రపెట్టినా ఈ తత్త్వానికి తూగదు.

ఈ తత్త్వం, ఏ ర్తిలో పుట్టినా పుట్టుక లేనిది. తెలుగు దేవరయైనను ప్రపంచ మునకు వెలుగు చదువనిదయినా చదువు. ఇది శుద్ధభక్తికి సులభం. పాండితికి పరీక్ష. అందరకూ శ్రీరామరక్ష.

[5–10–59 న జరిగిన దశరా కవి సమ్మేళనములో, శతావధాని, శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు బాబావారికి సమర్పించిన ఆశుకవితను ఇందుతో ప్రచురిస్తున్నాము. సంపాదకులు.]

కవీశ్వర హృదీశ్వరో విబుధ పంకజాహస్కరో
మునీశ్వర మనోహర స్సకల హృద్గుహాభాస్కరః
పనీపత దనీశినీ సురధునీ మహామోహినీ
ఫణీశ్వర వచోభరో జయతి సాయివాగీశ్వరః

సాయి మహానుభావుఁ డను సంగతి పల్వు రెఱింగియున్న దా
సాయియె సత్యసాయి యన చల్లని మూర్తిగ పుట్టపర్తిలో
కాయము దాల్చె నన్నదియు ఖాయము కాని, యెఱుంగువారు నా
రాయణుఁడో మహేశుఁడో హిరణ్మయపూరుషుఁడో వచింతురే!

కరుణామూర్తి యటంద్రు కొందఱు నినుఁ, గాలించి లోలో నహం
స్ఫురణామూర్తి యటంచుఁ గొందఱు మదిం బూజింతు రింకొంద ఱం
దరు యోగీశ్వరుఁ డంచు నిందు నిజ మేదో యన్నియు న్నిక్కమో
యెఱుఁగన్నేరము నీవ చెప్పవలె సాయీ! శ్వాసరూపత్రయీ!

ఏ యద్వైత సుఖానుభూతికయి నే నీక్షింతునో దానికిన్
మాయోపాయము లెన్నియో తెలిసియుండంబోలు నోఁగాక, యా
నేయం దారసి విశ్వరూపము నొగి న్నీ భక్తు లొందంగలా
దాయద్వైతము ద్వైతమో మఱి విశిష్టాద్వైతమో తెల్పుదే?

కనులార నిన్నుఁ గాంచం।
గనినంతన శరణు జెంది కనుదోయికినిం
గనరాక నీ వెలుంగొ।
వననిధి మునుఁగుదురు నీదుభక్తశ్రేణుల్

పిలిచినఁ బలికెడి దైవము।
కలదా యని సందియంబు కలిగిన యెడలన్
బిలిచి పరీక్షింపుఁడు! మీ।
పిలుపు హృదంతరమునుండి పెకలఁగవలయున్.

ఉఱిమి మబ్బులు వర్షింప నోలలాడు
చేలు లన్నియుఁ బ్రాయేలు చేరునటులు
కవ్వల మదినుండి పొంగు సత్కావ్యరసము
లల్ల రసరూపుఁడగు సాయియందు కలియు.

చివరకు నాకవిత్వ మది చెల్లరె నాలుగె యక్షరాలుగా
మివితె, రసంబు లన్నిఁటను మేలి రసంబున కాలవాల మ
య్యవి యెవి? 'సత్యసాయి'యను నట్టివి, అయ్యవిగూడ రెండయై
మివితెడి 'సాయి, సాయి'యని, మిక్కిలి వర్ణను లెల్ల చూర్ణముల్.

'రసోవై స' ఇతి బ్రూతే తిత్తిరి శ్ఛందసాం గిరిః
శివరామ స్త్వనుబ్రూతే సాయినం తస్య విగ్రహమ్.

*

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి

సి ద్ధా శ్ర మ క థ

౧

ముల్లోకంబుల వింటికొప్పునను వంపుల్ వంచి వేల్పుల సిరుల్
కొల్లగాఁ దెఱగంటిబంటు సిరినొక్కుల్ వెట్టి సర్వాశలన్
జెల్లన్ రక్కసయెల్లి నీడలకు దార్చెన్ దానివై రోచనుం
డెల్లన్ వేల్పులుఁ గుందగా బలిమహోహిప్రౌఢ ధార్ష్ట్యంబునన్.

అంత మనోవ్యథా విచలితాత్ములు వేగ తనూనపాత్పురో
గంత లధోక్షజుం గనుటకై సురలేగి ప్రభూ! బలిప్రభా
వంతము లెల్లడల్ నిలువవచ్చునె మాకును గుజ్జువర్ణివై
యంతయొ యెంతయో యడిగియిచ్చిన నిల్తుముగాక యచ్చటన్.

అతడును నొక్క యజ్ఞమునయందున దీక్షితుడై మెలంగు నా
క్రతువు మహాఫలప్రదము కాకయమున్న త్రివిక్రమా! త్వదా
శ్రితుల స్వకార్యమున్ సవదరింపవలెన్ బలిదైత్యుఁడిప్డు యా
చితుడనినంతఁ జాలును ద్యజించుఁ ద్రిలోకములైన వామనా!

రామలక్ష్మణులను వెంట తీసికొని విశ్వామిత్రుడు తన యాశ్రమమునకు పోవుచుండెను. వారు విశ్వామిత్రుని యాశ్రమమునొద్దకు వచ్చిరి ఇదే నా యాశ్రమమని విశ్వామిత్రుడు చెప్ప లేదు. ఈయాశ్రమ మెవరిదని శ్రీరామచంద్రుఁ డడిగెను విశ్వామిత్రుఁడది సిద్ధాశ్రమమనియు, విష్ణు వచ్చట బహుయుగములు తపస్సు చేసెననియు, వామనుడై యచటనే యుండెననియు కాశ్యపుఁడచ్చటనే తపస్సు చేసెననియు, దానికి సిద్ధాశ్రమను పేరనియు, అచట తపస్సు చేసినచో అశ్రమముగా సిద్ధించుననియు, చెప్పి వామనునికథ చెప్ప నారంభించెను –

బలి ముల్లోకమ్ములను వింటికొప్పున వంపులువంచి వేల్పుల సిరులుకొల్లగొట్టి తెఱగంటి బంటుల సంపదను నొక్కులువెట్టి, యన్ని దిక్కులను తనయాజ్ఞ చెల్లగా మూడులోకములను తన యెల్లినీడలకు తార్చెను ఎల్లి యనగా గొడుగు. ఈ పద్యమునందు మిక్కిలిగా తెలుగు మాట లేర్చి కూర్చి తెలుగుమాటల కూర్పులో ప్రౌఢి సంతరింపబడినది తెలుగుమాటలను కూర్చుచు ప్రౌఢిని సంతరించుట కష్టమైనపని. వింటికొప్పున వంపులువంచుట, తెరగంటి బంటుసిరి నొక్కులుపెట్టుట, ఇవి రెండును గడుసుమాటలు. ఎల్లి నీడలకు తార్చుటయన్నది రమ్యమైన ప్రయోగము.

రెండవపద్యములో వేల్పులు తనూనపాత్పురోగంతలు అధోక్షజుని చూచుటకు వెళ్ళిరి. తనూనపాత్తనగా నగ్నిహోత్రుఁడు. అగ్నిహోత్రుఁడు పురోగంతగా గలిగినవాఁడు బహువ్రీహి సమాసము. వచ్చి విష్ణువుతో నిట్లనియె అన్నిదిక్కులు బలిచేత నాక్రమింపబడెను. నీవు గుజ్జు వర్ణివై, అనగా వామన బ్రహ్మచారివై (వర్ణియనగా బ్రహ్మచారి) సవర్ణివిజ్ఞీవిదితస్సమాయయా (భారవి). నీవు అంతోయింతో అడిగి యిచ్చినగాని నిలువలేమనిరి. అనగా దేవతలు భగవంతుని వామనావతారము నెత్తుమని యడిగిరి. వామనావతార మెత్తుమని చెప్పుటకు వారెవ్వరు? ఆయన

యే యవతార మెత్తునో తమకెట్లు తెలియును? ఈ యవతార మెత్తుమన్నచో నాతడెత్తునో యెత్తడో? అట్లైందుకు చెప్పిరనగా బహుకల్పములయందు భగవంతు డీ యవతారము నెత్తుచునే యుండెను బలిచక్రవర్తి నణగద్రొక్కుటకు వామనావతారమే యెత్తును. ఇదివరకు మహాయుగములలో నట్లే యెత్తెను అది వారికి తెలియును అతడొక యజ్ఞమునందు దీక్షితుడై యున్నాడు. అది పూర్తియైనచో నతనిని సాధించుట కష్టము ఈ లోపుననే అతనిని సాధించుటకు ప్రయత్నించవలయును. ఏదైన పోయి పోయి యడుగుము, యాచితుడవినంత చాలును, త్రిలోకములనైన త్యజించును నేను యాచితుడను, నన్నితడు వచ్చి యిది యడిగినాడు, అన్న భావమతనికి గలిగినతోడనే అతనియొడ లతనికి దెలియదు. తానెంతో గొప్పవాడననుకొనును అందుచే మూడు లోకములైనను పరిత్యజించును, అని దేవతలు విష్ణువుతో చెప్పిరి ఇదికల్పన. బలియందొక దాతృగర్వ మారోపించుట.విరోధులు గనుక వేల్పులట్లు చెప్పుట న్యాయము. తాను యాచితుఁడు - అనగా నేను యాచితుడను - అని యన్వయము చేసికొనవలయును. ఉత్తమ మధ్యమ పురుషులయందు ప్రథమ పురుషరూపము వాడవచ్చును యాచితుఁడనగా సందర్భమునుబట్టి యాచితుడగు, యాచితుడను అన్న రెండర్థములు కూడవచ్చును. ఇది తెలుగు వ్యాకరణము. ఇచట యాచితుడనిక్తాంతము ప్రయోగించుటచేత బలియొక్క వితరణగర్వము వ్యంగ్యభూతమగుచున్నది త్రిలోకములనైన త్యజించుననుటచేత సూచ్యార్థసూచనము జరుగుచున్నది వామనాయని సంబోధించుటచేత, భగవంతుని నామములలో నది యొకటి యగుటయేకాక, భగవంతుని వామనావతారము సిద్ధమైనట్లు తెలియుచున్నది వారి ప్రార్థనతోసహకాలముననే భగవంతుడు వామనుడైనట్లు, ఆ యధోక్షజాకృతియందు వామనత్వమును వారు చూచుచున్నట్లు భాసించుచున్నది.

అని యనుచుండ వేల్పులపుడచ్చటికిన్ జనుదెంచెఁ గాశ్యపుం
డనలసమప్రభుండును సమాప్త సుదివ్య సహస్రవర్ష యో
గ నిభృతమూర్తి సాదితి, జగత్ప్రభుఁ గాంచి తపోమయున్ దప
స్తనుఁ దపఊర్జితున్ దప ఉదాత్తతమాబ్ధిస్తుతించె నీగతిన్.

గుప్తావెత్ర్యాని నిన్ను నేమియనినన్ గోవింద! యందుఁ దప
స్తప్తుంబై యసితచ్ఛవిం బొలుచుఁగాదా నీతనూవల్లికా
లాప్తుఁ నిన్ను దిశాప్త నీతుది మొదళ్ళఁ గానలేమయ్య నీ
గుప్తింబొందెద నిన్ను నే శరణముం గొందుఁ జిదాకారునిన్.

అదితికి నాకు గర్భమునయందునఁ బుత్రుడవై జనింపవే!
త్రిదశులు నిద్దె కోరెదరు దేవవిభుండును నీవు తమ్ముఁడై
యొదిగిన చెట్టరక్కసల యొత్తిడి తీరి సుఖించు, శోకముల్
గుదుట గుదుల్ సురల్తొలఁచుకొందురు చిక్కులు తీసినట్లుగన్.

ఇట్లు వేల్పులనుచుండగా కాశ్యపు డచటికివచ్చెను. ఆయన సాదితి. అదితితో కలిసియున్నవాడు. ఆకాశ్యపుడు కొన్నివేల దివ్యవర్షములు యోగమునందుండి సమాప్తి చేసివచ్చెను ఆ సమాప్తికి ఫలితము భగవంతుడు తనయందు పుత్రుడై జనించుటయని యర్థము చేసికొనవలయును భగవంతుడు తనకు బిడ్డయై పుట్టవలయునను కోరికచేతనే అదితితో కలసివచ్చెను అన్నివేల యేండ్లుతపస్సు చేసినగాని తనకు భగవంతుడు బిడ్డయై పుట్టుట సంభవించదు. ఎందుచేత

ననగా ఆ భగవంతుడు తపోమయుడు తపస్తనుఁడు, తపఊర్జితుడు తపఉదాత్తమూర్తి కనుక ఇచ్చట నాల్గు విశేషణము లున్నవి. మొదట తపోమయుఁడు.తపస్సునకంటె భిన్నమైన యాకారము లేనివాడు. ఆయనకు తనువులేదు, కాని తనువును స్వీకరించెను, ఎట్టి తనువు? తపస్తనువు. తపస్సే శరీరముగా పరిణమించినదన్నమాట. శరీరమేర్పడినది,ఆశరీరము కర్మఫలముగాదు,తపః ఫలము. మరియు నాయన తపఊర్జితుడు ఈ శరీరమెత్తి మరల తపస్సు చేయకుండ నూరకుండ లేదు మరల తపస్సే చేయుచున్నాడు ఎంతతపస్సు చేసినాడు? తపఉదాత్తమూర్తి కాదగినంత చేసినాడు. అయనయే తపస్సు శరీరము తపోమయము. తపస్సుచేత ఊర్జితుడు. తపస్సముద్రుఁడు, మహర్షియైన కాశ్యపుని భగవద్భావన యిట్టిది తపస్సునకు మించి మరియొకటిలేదు కాని పరమేశ్వరుడు శుద్ధచైతన్యస్వరూపము తపస్సుకూడ ఆయనయొక లక్షణము ఈరెండును విడివిడిగా నున్నవి అందుచేత తపఊర్జిత, తపఉదాత్త అన్న సంధులు వాడబడినవి. విసర్గలోపించి యారెండు శబ్దములు విడివిడిగా నుండిపోవును. అందుచేత శుద్ధచైతన్యమును, తపస్సును, కలిసి యుండియు భిన్నవిషయములని చెప్పుటకు నిచ్చట నీసంధులు వాడబడినవి. అందుకనియే, రెండవ పద్యములో నిన్ను చిదాకారుని నేను శరణము గొందునన్నాడు ప్రధానముగా నాయన చిదాకారుడు. తపోమయత్వాదు లనుసరించి వచ్చినవన్నమాట చిదాకారుడైనప్పుడేమియును లేదు తపస్తనుడైనప్పుడు వచ్చినది, ఏమివచ్చినది? అయనను గుప్తావిత్యుడనుట వచ్చినది ఈ భగవంతుడు శరీరము నెందుకు ధరించినాడు? దేవతలను రక్షించుటకు పూనినాడు మఱల కశ్యపుఁడన్నాడుగదా నీ తనూవల్లి తపస్తప్తంబై అసితచ్ఛవిన్ పొలుచుగాదా, శ్రీమన్నారాయణుఁడు, నీలదేహుడు 'బాలాయ నీలవపుషే'.భగవంతుని శరీరము నీలముగానుండుటకు హేతువు అనంతత్వలక్షణము, ఆకాశమనంతమైనది. అదినీలము. ఈ ప్రసిద్ధమైన లక్షణ మిట్లుండగా కాశ్యపుఁ డింకొకవిధముగా నుత్ప్రేక్షించుచున్నాడు. తపస్సుచేత తప్తమై యాయన శరీరము నల్లనికాంతిని చిమ్ముచున్నదట. నిత్యతపస్వియైన కాశ్యపు డింకెట్లుత్ప్రేక్షించును? ఆభగవంతుడు కాలాప్తుడు, దిశాప్తుడు, తుదిమొదళ్ళు లేనివాడు.

ఈ పద్యములయందు సౌకుమార్యము లేదని, మాధుర్యము లేదని వాదించరాదు ఆ రెండు గుణములీ పద్యములందున్నవి నిగూఢముగా నున్నవి వీనియందు ప్రధానముగా చెప్పబడినవి కొన్నిభావములు. ఆభావముల కాశబ్దములపరిహార్యములు. ఇంకనేవో మెత్తని భావములు చెప్పెడిచోట్ల సంగ్రహించుటకు వీలైన మెత్తని శబ్దము లిచ్చుటలేవనుకొనువాడు భావములయొక్క గాఢత్వము, తదనుకూల శబ్దసంగ్రహణమును గూర్చి విచారణ చేయవలసి యుండును మూడవ పద్యములో నీవు నా కడుపున పుత్రుడవై జనించినచో దేవతలు చిక్కులు తీసినట్లు శోకములం తొలచుకొందురనియున్నది చిక్కులు తీసికొనుటయన్నది తెలుగునుడికారము దేవవిభుడును, నీవు తమ్ముడై యెదిగిన చెట్టరక్కసల యొత్తిడితీరి సుఖించును. ఇవి తెలుగు మాటలు చక్కనిమాటలు. తమ్ముడై యెదుగుట, అనంతపరిణామము గలిగిన భగవంతుఁడు ఇంద్రునకు తమ్ముడగుట ఒదుగుటయేగదా! ఒక మహాసమర్థుడొకనికి తమ్ముడైనచో నాయన్నగా రెటువంటివాడైనను గౌరవమును పొందును దీనిని కాశ్యపుడడుగుటలో మరియు నందమున్నది ఇంద్రుడు తన కొడుకు. ఇబ్బంది పడుచున్నాడు. వాని సామర్థ్య మిదివరకే విదితమైనది. అంతకంటె వాడు చేయునదిలేదు. శ్రీమంతుడైన మహాయోగ జాతకుడు తన కడుపున పుట్టినచో ఇదివఱకున్న బిడ్డలు సుఖపడుదురు తన కుటుంబమునకు మర్యాదవచ్చును తన కుటుంబమునకు కష్టములు తీరిపోవును ఈయాశయుండును గదా! అందుచే నీ మూడవపద్యము వ్రాయబడినది ఆకధ మీదపెట్టి లోకము ననుసంధించుట.

అంతర్వాణి

మహాత్మ గాంధీ

కొన్ని కొన్ని విషయాల్లో బాహ్యాకారణాలతో పనిలేని సందర్భాలు కొన్ని జీవితంలో వస్తాయి మనలోనే ఉన్న అవ్యక్త వాక్కు ఒకటి మనకు చెబుతుంది. "నీవు ఋజుమార్గంలో ఉన్నావు అటూ ఇటూ కదలకు. ఇరుకుగా కన్పించినా ఆ సూటి బాటనే పయనించు" అని

మనకు అత్యంతం ప్రియులైన స్నేహితులు సైతం అనువర్తించకపోయినప్పటికీ, మనంతట మనమే ఒంటిగా పురోగమించవలసిన సంగర్భాలు జీవితంలో కొన్ని ఉన్నాయి మనవిధి 'యేమిటి' అనే విషయంలో సందేహం కలిగినప్పుడెల్లా మనలోనున్న ఆ అవ్యక్త నిశ్చలవాక్కే మనకు మార్గదర్శకం కావాలి.

ఆత్మ పవిత్రీకరణం కొరకు నిరంతరం పరిశ్రమించటం వలన ఆ అవ్యక్తనిశ్చలాంతర్వాణిని స్పష్టంగాను ఖచితంగాను వినగల శక్తిని కొంత కొంత పెంపొందించుకొన్నాను. ఆ 'లోగొంతు'ను ఏ క్షణంలో అణచివేస్తానో నేను ఆ క్షణంలోనే నా సార్థకత్వం కోల్పోతాను

కొంతమందితో మాత్రమే అంతర్వాణి ప్రసంగించటం సాధ్యమా? అని నాకు తెలిసినంతవరకు ఎవ్వరూ ప్రశ్నించలేదు తన అంతర్వాణి చెప్పిన విషయాన్ని చెప్పగలవాడు ఒక్కడున్నప్పటికీ, అది లోకానికి లాభదాయకమే చాలామంది తాము తమ అంతర్వాణిని విన్నట్లు చెప్పవచ్చు కాని అందరూ దాన్ని నిరూపించుకోలేరు. అలా లేనిపోని కల్పనలు చేసేవారిని అరికట్టడం కోసమని, అసలు అంతర్వాణినే అణచివేయటం తగదు, సాధ్యమూకాదు చాలమంది తమ అంతర్వాణిని సత్యస్వరూపంతో సాక్షాత్కరింపజేసినందువలన కలిగే హాని యేమీ లేదు. కాని దురదృష్టవశాత్తు, ఇందులో మోసాన్ని అరికట్టే సాధనంలేదు. సద్గుణంపేరిట చాలామంది మోసంచేస్తారు. అలాగని సద్గుణాన్నే అణచివేయుటానికి వీలులేదు తమ అంతర్వాణి చెప్పినదాన్నే పునరుద్ఘాటిస్తున్నామని చెప్పేవారు లోకంలో ఎల్లప్పుడూ ఉన్నారు. కాని అలాంటివారి అవాంతర కార్యక్రమాలవల్ల ప్రపంచానికేమీ హాని కలుగలేదు మనం ఆ అంతర్వాణిని వినవలెనంటే, దానికిగాను ముందుగా ఒక సుదీర్ఘ కఠోరశిక్షణ పొందవలసివుంటుంది ఆ తర్వాత ఆ మాట్లాడేది అంతర్వాణే అయితే అందులో పొరపాటుకు చోటులేదు ప్రపంచాన్ని సర్వదా మోసగించటం సాధ్యంకాదు. అందుచేత నావంటి అల్పుడొకడు తాను తన అంతర్వాణిని విన్నట్లునమ్మి దాన్ని పునరుద్ఘాటించటంవల్లగానీ అట్టివ్యక్తిని అరికట్టకపోవడం వల్లగానీ, అరాజకంరాగల ప్రమాదంలేదు నా దృష్టిలో దైవవాక్కు, అంతరాత్మవాక్కు సత్యదేవతవాక్కు, లోలోపలి ఆ అవ్యక్త నిశ్చలవాక్కు- ఇవన్నీ ఒక్కటే నేను సగుణబ్రహ్మాన్ని దర్శించలేదు. భగవంతుడు నిర్గుణుడనే విశ్వాసం కలవాణ్ని కాబట్టి సగుణబ్రహ్మ సందర్శనంకోసం నేను ప్రయత్నించనూ లేదు దూరమునుంచి విన్పిస్తూ కూడా అతి సన్నిహితంగా ఉన్న ఒక్క వాక్కునుమాత్రమే నేను విన్నాను నాతో స్పష్టంగా మాట్లాడుతున్న ఒక మానవ వాక్కు ఎలా పొరపడరానిదో ఎలా అనివార్యమో అదికూడా అలాంటిది ఆవాక్కు విన్న సమయంలో నేను కలగనటంలేదు. నాలో కలిగిన భయంకర భావసంఘర్షణం అనంతరంమాత్రమే అలాంటివాక్కు వినటం జరిగింది అది అకస్మాత్తుగా వినవచ్చింది. విన్నాను అదే ఆవాక్కు అని నిశ్చయం చేసుకొన్నాను నాలోని సంఘర్షణ అంతరించింది ప్రశాంతి ఏర్పడింది దాన్నిబట్టే ఒక్క నిశ్చయానికి వచ్చాను. నిరశనవ్రతా

నికి సమయం నిర్ణయింపబడింది...

నేను విన్నది నిజంగా అంతర్వాణే అని చెప్పడానికిగానీ, అది ఉద్రిక్తభావ సంఘర్షణం తాలూకు ప్రతిధ్వనికాదని చెప్పడానికి గానీ ఇంతకంటె ఏమిసాక్ష్యం చూపగలను? నమ్మకం లేనివాణ్ని నమ్మించటానికి ఇంతకంటె నేను చూపగల నిదర్శనమేమీలేదు. అలాంటివాడు ఇదంతా ఆత్మవంచన అనీ భ్రమఅనీ చెప్పవచ్చు అది అంతేకావచ్చు కూడా. కాదని నేను ఋజువు చేయలేను. ఈ ప్రపంచమంతా ముక్తకంఠంతో కాదని చెప్పినా, నేను విన్నది ఆ భగవంతుని యొక్క సత్యవాక్కే అన్న నా విశ్వాసాన్నిమాత్రం మార్చలేదు...

దైవమనేదే మన భావ విభ్రమమని భావించేవాళ్లు కొందరున్నారు. ఆ దృక్పథమే నిలచినట్లయితే, ప్రపంచంలో సత్యమైన వస్తువేలేదు ప్రతిఒక్కటీ మన భావ విభ్రమమే అవుతుంది. ఒకవేళ ఇదే నిజమైనప్పటికీ, అలాంటిభ్రమే నన్ను ఆవరించినప్పుడు నేను దానికిలోబడి మాత్రమే నడుచుకోగలను సత్యతమ పదార్థాలు అనబడేవి తక్కినవాటితో పోల్చి చూచినప్పుడే అలా అనబడుతున్నాయి నా ఉనికికంటె నాలోని అంతర్వాణి నాదృష్టిలో ఎక్కువ సత్యమైనది. అది నన్నెప్పుడూ వంచించలేదు ఆ మాటకు వస్తే, అది ఎవ్వరినీ ఎప్పుడూ వంచించదు. వినదలచుకొన్న ప్రతిఒక్కరూ ఈ లోగొంతు వినవచ్చును అది ప్రతిఒక్కని లోనూ వుంది కాని తక్కిన అన్నింటిపలెనే దానికికూడా విస్పష్టమైన పూర్వరంగ సాధనం కావలసివుంది

నేను అంతర్వాణిని వింటున్నాననేది క్రొత్త విషయంకాదు. ఫలితాలను బట్టికాక అన్యథా దీన్ని ఋజువుపరిచే మార్గంలేదు తాను సృజించిన జనులయెదుట నిరూపింపబడవలసినప్పుడు దేవుడుకూడా దేవుడు కాడు కాని తనభక్తులకు మాత్రం ఆతడు భయంకర పరిస్థితులనుండి దాటగల శక్తిని ప్రసాదిస్తాడు తన భక్తులనుండి అనంతమైన త్యాగాన్ని ఆశించే ఈ మహాప్రభువుకు నేను బుద్ధిపూర్వకంగా అర్ధశతాబ్దిగా దాస్యం చేస్తున్నాను. ఏళ్లు గడచినకొద్దీ ఆ దైవ వాక్కు నాకు మరీమరీ స్ఫుటంగా వినబడుతున్నది అతి క్లిష్టసమయంలోనైనా ఆయన నన్ను ఎన్నడూ విడిచిపుచ్చలేదు ఆయన తఱచుగా నన్ను రక్షిస్తూవచ్చాడు. కాని నాకు స్వాతంత్ర్యమనేది ఛాయామాత్రంగానైనా విడచిపెట్టలేదు నేను ఆయనకు లొంగిపోయిన కొద్దీ, నాఆనందం అతిశయించింది.

ఈ అంతర్వాణి విషయంలో భ్రాంతికి స్థానంలేదు. నేను ఒక శాస్త్రీయమైన సత్యం చెప్పాను తెలుసుకోవలెననే కోరికవుండి, అందుకవసరమైన అర్హతలు సంపాదించే నిగ్రహాంకలవారు దాన్ని పరిశీలించవచ్చు. ఆ అర్హతలను గురించి అర్థంచేసికొనటం తేలిక, వాటిని పొందవలెననే సంకల్పంఉన్నప్పుడు పొందటంకూడా తేలికే. "మనం మనల్నితప్ప మరెవ్వరినీ నమ్మకూడదు. మనం మన అంతర్వాణిని వినటానికి ప్రయత్నించాలి అంతర్వాణి అనేమాట మీకు అంగీకార్యం కాకపోతే మన సహేతుకమైన నిశ్చయం అనే అనండి. కాని మీరు దానికి మాత్రం లోబడివుండాలి, మీరు దేవుణ్ని భజించకపోతే మానె, కాని మీరు దేన్నో ఒకదాన్ని భజించకతీరదు, ఈ విశ్వంలో భగవంతుడు వినా అన్యంలేదు కనుక మీరు దేన్ని భజించినా అదే భగవంతుడై కూర్చుంటుంది అంతర్వాణి చెప్పినప్రకారం నడుస్తున్నామని చెప్పే ప్రతిఒక్కరూ నిజంగా అలా చేస్తున్నారని చెప్పటం సాధ్యంకాదు తక్కిన విద్యలలాగానే ఈ అంతర్వాణిని వినేవిద్య సంపాదించటానికి కూడా పూర్వపరిశ్రమా, శిక్షణా కావాలి తక్కిన ఏ విద్యను పొందేదానికంటే కూడా దీనికే ఎక్కువ పరిశ్రమా, శిక్షణా కావలసివుంటాయి తాము అంతర్వాణిని విన్నట్లు

చెప్పే వేలాదిమంది జనంలో చాలా కొద్ది మంది చెప్పేదే నిజమయినప్పటికీ అదేచాలు. ఆ కొద్దిమందికోసమైనా సంశయాస్పదులైన వేలకొలదిమందిని సహించవచ్చు. దైవ ప్రభావంవల్లగానీ అంతర్వాణి ఆదేశప్రభావం వల్లగానీ నడుస్తున్నామని అబద్ధాలుచెప్పే వాళ్లు, ఒకరాజు ఆదేశంమీద నడుస్తున్నామని వంచించే వాళ్ళకంటె అన్యాయమై పోతారు. రాజుపేరిట వంచించేవాళ్లు శరీరానికి మాత్రమే హాని పొందుతారు. కాని దైవంపేరిట వంచించేవారు శరీరాన్నీ ఆత్మనూ చంపుకొంటారు. ఉదారులైన విమర్శకులు నాకేమీ వంచనను అంటగట్టలేదు. కాని నేనేదో పెద్ద భ్రాంతిలో పడిపోతున్నట్లు సూచించారు నేను అబద్ధం చెబుతున్నానని అనేదానికి దీనికీ అంత భేదం లేదు. నావంటి విధేయపరిశీలకుడు అతి జాగరూకుడై మనస్సు స్థిమితంగా ఉంచుకోవాలి భగవదాదేశం పొందేముందు తన అహంకారాన్ని పూర్తిగా చంపుకోవాలి. ఈ విషయంలో అతిగా సాగదీయరాదు

సత్యాగ్రహినైన నాకురాగల ప్రతిఆపదలోనూ దైవంతప్ప నాకు అన్యమైన సహాయం లేదని ఒప్పుగానో తప్పుగానో నాకు తెలుసు ఇవి ఇలాంటివని నిర్ధరించటానికి వీలులేని-నా పనులన్నీ నిజంగా నా అంతర్వాణి ఆదేశంప్రకారమే నేను చేసానని నమ్మవలసిందిగా కోరుతున్నాను

అది ఉద్రిక్తమైన నాభావవిభ్రమమే కావచ్చు. నాకు పదిహేనేళ్ళు రాకపూర్వం నుంచీ నేను బుద్ధిపూర్వకంగా భగవంతునిపైన ఆధారపడ్డవాణ్ని ఈ ఏబదైదేండ్ల అనిశ్చిత జీవితపథంలోనూ ఆ భావవిభ్రమమే నాకు తోడ్పడింది. కనుక నేను దానినే అభినందిస్తాను

*

యశోధరా పరిదేవనము

శ్రీ శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి. ఎ., బి. ఇడి.

పతి యిల్లు వీడిపోవగ కతంబడిగెడు
నమ్మలక్కలకు నేమనెడు దాన!
నాన్నగారేరి యిన్నాళ్ళయ్యె ననెడి రా
హులున కెట్లూరట నొసగు దాన!
భవనంబు విడనాడి యువరాజుగారెందు
• గలరన్న ప్రజకేమి పలుకు దాన!
బంగారుతండ్రి యే బాధలు పడెనయ్యొ
అను మామనెట్టు లోదార్చు దాన!

లాతి యువతులు ప్రణయ విలాసములను
పతుల యనురాగ సంపద బడయుచుండ
నీగతి యిటేలయంచు ప్రశ్నించు నంత
రాత్మ కెట్టి ప్రత్యుత్తర మరయుదాన!

పతి చెంతలేని యీ పల్యంకికా హంస
తూలి కాతల్ప సందోహ మేల?
వరుడు దగ్గరలేని సురుచిరాలంకృత
భర్మ హర్మ్యాంతర వాసమేల?
విభుడు చెంగటలేని వివిధాంబరామూల్య
నవరత్న మణిభూషణమ్ము లేల?
మగడు పజ్జనులేని మధుర పానీయాది
మృష్టాన్నభోజన తుష్టియేల?

ప్రాణనాధుని ప్రణయానురాగములకు
నుంతయును నోచుకోలేని యింతికింక
దివ్యయౌవన సౌందర్య దీప్తియేల?
చీకటులె యెందు జూచిన జీవితమున!

ధవునిన్ దైవసమానుగా దలచి తత్పాదాబ్జ సంసేవయే
స్తవనీయ వ్రతమంచు నెంచుటలు మోక్షప్రాప్తిమార్గమ్ము హైం
దవ సీమంతిని కంచు చెప్పుదురు, నాధా! అట్టి భాగ్యమ్ములో
లవమేనిన్ గనరాక జీవితము వ్యర్థమ్మయ్యె నీ వేగుటన్.

పతికిన్ కష్టసుఖాల నెల్లయెడలన్ భాగస్థురాలౌచు జీ
విత యాత్రన్ కొనసాగ జేసికొని సంప్రీతాత్మయై యుంట సం
తతమున్ హైందవ సుందరీమణికి నాణ్యంబైన ధర్మమ్ము, నీ
మత మేలాటిదొ! ధర్మమెట్టిదొ! తలంపంజాల ప్రాణేశ్వరా!

నారాచక్షత మానసౌక పరిదీనాక్రంద నార్ద్రీభవత్
కారుణ్యామృతమూర్తి వీవనుచు వక్కాణింపగా విందు, దు
ర్వార త్వద్విరహోద్గతాశ్రుచయ ధారాభిన్న చేతస్కయై
యీ రీతిన్ గృశియించు నీ తరుణిపై నేలా దయాశూన్యతల్ ?

మును నీజాతక చక్రమందలి గ్రహమ్ముల్ చూచి కార్తాంతికుల్
జనలోక స్తుత ధారుణీశ్వరుడవో సంసారబంధమ్ము లె
ల్లను పోనాడి వనాళిసుండెడు పరివ్రాట్సార్వభౌముండవో
అని నిర్ధారణ చేసినారట! ద్వితీయంబే నిజంబౌనొకో?

*

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్

ఆంధ్రభారతి

డాక్టర్, శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్, పిహెచ్. డి.

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

100. విష్ణుక్రాంతము

పురః ప్రసారితః పాదః కుంచితో గ్రగతోన్ముఖః
కరౌచ రేచితౌ యత్ర విష్ణుక్రాంతం తదుచ్యతే. ౧౫౯

కుడిపాదమును ముందుకు సాచి, కుంచించి, ముందుపోవుటను సూచింపవలెను. అప్పుడు హంసపక్షహస్తములను వేగముతో కంపింపజేయగా త్రివిక్రముని పాద విన్యాసమును తెలుపు విష్ణుక్రాంత కరణము రాగలదు, త్రివిక్రముని గమనమును తెలుపుటకీ కరణము నుపయోగించవలెను.

101. సంభ్రాంతము

కర మావర్తితం కృత్వా హ్యూరుపృష్ఠే నికుంచయేత్
ఊరుశ్చైవ తథావిద్ధః సంభ్రాంతం కరణంతు తత్. ౧౬౦

స్వస్తికలోనున్న పాదములలో ముందున్న పాదమును కుంచించి ప్రసారించవలెను. తర్వాత ఆవిద్ధమైన ఈ పాదమును ప్రక్కగా రెండవకాలి మడమవద్ద ముందు మడమ పడునట్లువేయగా వచ్చు ఆవిద్ధాచారీని ప్రయోగించవలెను. ఈ ప్రయోగ కాలముననే వ్యావర్తిత పరివర్తిత కరణములతో అలపల్లవహస్తమును ఊరుపృష్ఠమున ఉంచగా సంభ్రాంతమను కరణము రాగలదు. సంభ్రమ పరిక్రమమున ఈ కరణమును ప్రయోగించవలెను

102. విష్కంభము

అపవిద్ధః కరః సూచ్యా పాదశ్చైవ నికుట్టితః
వక్షఃస్థశ్చ కరో వామో విష్కంభే కరణే భవేత్ ౧౬౧

సూచీహస్తమగు కుడిచేతితో ఎడమచేతిని అపగమపూర్వకముగా విద్ధముచేసి, ఎడమ పాదమును నికుట్టితముగా చేయవలెను. ఇట్లు అంగపర్యాయము ననేక సారులు చేయుచు సూచీచారీలోని పాదమును నికుట్టితముగా నొనర్చవలెను. వక్షమువద్ద ఎడమచేతినుంచి, కుడిచేతితో అలపల్లవము చూపగా విష్కంభకరణము రాగలదు

103. ఉద్ఘట్టితము

పాదా వుద్ఘట్టితౌ కార్యౌ తలసంఘట్టితౌ కరౌ
నతంచపార్శ్వం కర్తవ్యం బుధై రుద్ఘట్టితే సదా. ౧౬౨

పాద తలాగ్రమున నిలచి, భూమిపై మడమను వేయుటయే ఉద్ఘట్టితను. స్వస్తికగా పతాకాహస్తములనుంచి తల సంఘట్టితమను తొంబదిమూడవ కరణమున చెప్పబడినట్లు చేతులను సంశ్లిష్టములుగా చేయవలెను. ఇట్టు అంగపర్యాయము గావించి, వంగిన పార్శ్వమును గావింపగావచ్చు ఉద్ఘట్టితకరణము ప్రమోదవిషయమున ఉపకరించును

104. వృషభక్రీడితము

ప్రయుజ్యా లాతకం పూర్వం హస్తౌ చాపి హి రేచయేత్
కుంచితా వంచితౌ చైవ వృషభక్రీడితే సదా. ౧౬౩

సింహావిక్రీడిత కరణమున చెప్పబడిన అలాతాచారిని ప్రయోగించుచు హంస పక్ష హస్తములను వేగముతో కంపింపజేయవలెను తర్వాత వ్యావర్తితకరణమున వాటిని కుంచితములుగా చేసి బాహుశిరస్సున అలపల్లవములను అంచితములుచేయగా వృషభక్రీడిత కరణమువచ్చును.

105. లోలితము

రేచితా వంచితౌ హస్తౌ లోలితం వర్తితం శిరః
ఉభయోః పార్శ్వయో ర్యత్ర తల్లోలిత ముదాహృతమ్ ౧౬౪

వైష్ణవస్థానమున మొదట హంసపక్షమగు కుడిచేతిని వేగముతో కంపింప జేయవలెను. ఎడమచేతిని అంచితముచేసి అలపల్లవమును వక్షమున నుంచవలెను. శిరస్సును అన్నివైపులకు త్రిప్పుచు, విశ్రమింపజేయగా లోలితకరణము రాగలదు.

106. నాగాపసర్పితము

స్వస్తికాపసృతౌ పాదౌ శిరశ్చపరివాహితమ్
రేచితౌ చ తథాహస్తౌ స్యాతాం నాగాపసర్పితే ౧౬౫

పాదములతో స్వస్తికనుపట్టి, వేరుచేయుచు, తలను ఈ ప్రక్కకు, అప్రక్కకు కుటిలిగతిగా త్రిప్పుచు, హంసపక్షహస్తములను రేచితము కావించిన నాగాపసర్పిత కరణమగును దీనిని యౌవనమద విషయమున చూపవలెను

107. శకటాస్యము

నిషణ్ణాంగస్తు చరణం ప్రసార్యతల సంచరమ్
ఉద్వాహితమురః కృత్వాశకటాస్యం ప్రయోజయేత్ ౧౬౬

కుడికాలిని నిషణ్ణముగా కొంచెమువంచి, మడమను కుంచించి, అగ్రతలము ముందుకు పడునట్లు ఒకటిన్నరతాలముల దూరమున పాదమును చాచి, చేతినికూడ చాచవలెను. రెండవచేతిని వక్షమువద్ద ఖటకాముఖముగా ఉంచవలెను. నిషణ్ణాంగ


100


101


102


103


104


105


106


107


108

మగు పాదమును అగ్రతలసంచరముగా చాచి, వక్షమును ఉద్వాహితముచేసిన శకటాస్యాచారీ వచ్చును. శకటమునకు సంబంధించిన బాలక్రీడాది విషయమున, భాణికాదివిషయమున, ఈ కరణ ముపకరించును.

108. గంగావతరణము

ఊర్ధ్వాంగులితలః పాదస్త్రిపతాకావధో ముఖౌ
హస్తౌ శిరస్సన్నతంచ గంగావతరణం త్వితి. ౧౬౪

కాలిప్రేళ్ళు, అరికాలు పైకివచ్చునట్లు కాళ్ళను వెనుకగా పైకి సాచవలెను. అప్పుడు త్రిపతాకలను అధోముఖములుగా చేసి భూమిపైన పతాకలుగా ఉంచవలెను. హస్తములతోబాటు శిరస్సుకూడ వంగగా గంగావతరణమను కరణము సిద్ధించును. గంగానది భూమికివచ్చుటను ప్రయోగించుటకిది ఉపకరించును

అష్టోత్తరశతం హ్యేతత్కరణానాం మయోదితమ్
అతఃపరం ప్రవక్ష్యామి హ్యంగ హారవికల్పనమ్ ౧౬౫

ఇవి నూటఎనిమిది కరణములు కొన్ని కరణములు కలసిననేగాని నృత్తవిధి సమగ్రముకాదు. అట్టి కలయికలను అంగహారములందురు వీటిలో ప్రధానమైనవి 32. ఇక వీటి లక్షణములను వివరించనున్నాడు.

1. స్థిరహస్తము

ప్రసార్యోత్క్షిప్య చ కరౌ సమపాదం ప్రయోజయేత్
వ్యంసితాఽపసృతం సవ్యం హస్త మూర్ధ్వం ప్రసారయేత్. ౧౬౬
ప్రత్యాలీఢం తతః కృత్వా తథైవచ నికుట్టకమ్
ఊరూద్వృత్తం తతః కుర్యా దాక్షిప్తం స్వస్తికం తతః. ౧౬౭
నితంబం కరిహస్తంచ కటిచ్ఛిన్నంచ యోగతః
స్థిరహస్తో భవే దేష త్వంగహారో హరప్రియః ౧౬౮

త్రిపతాక దండపక్షహస్తకులను ప్రసారించి, ఎత్తుచు మొదట లీనమను కరణమును ప్రయోగించవలెను తర్వాత సమపాదమగు సమనఖ కరణమును యోగించవలెను ఆపై వ్యంసితకరణమున విప్రకీర్ణములైన హస్తములను ఊర్ధ్వస్థాన స్థితియందుంచి, ఆలీఢపరివర్తనముతో ప్రత్యాలీఢ స్థానకమును చూపవలెను. తర్వాత క్రమముగా నికుట్టిత, ఊరూద్వృత్త, స్వస్తిక, ఆక్షిప్తములను నాలుగు కరణములను యోజించవలెను. ఆపై వరుసగా నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నములను మూడు కరణములను చూపవలెను. ఇట్లు పది కరణములను యోగించగా శివునకు ప్రియమైన స్థిరహస్త మనబడు అంగహారము సిద్ధించగలదు

2. పర్యస్తకము

తలపుష్పాఽపవిద్ధే ద్వే వర్తితం స నికుట్టకమ్
ఊరూద్వృత్తం తథాక్షిప్త మురోమండలమేవచ ౧౬౯
నితంబం కరిహస్తంచ కటిచ్ఛిన్నం తథైవచ
ఏష పర్యస్తకోనామ హ్యంగహారో హరోద్భవః ౧౭౦

తల పుష్పపుట, అపవిద్ధ, వర్తిత, నికుట్టక, ఊరూద్వృత్త, ఆక్షిప్త, ఉరోమండల, నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నములను పది కరణములను వరుసగా యోజించగా పర్యస్తకమను అంగహారము వచ్చును. ఇది హారునినుండి జన్మించినది.

3. సూ చీ వి ద్ధ ము

అలపల్లవే సూచీంచ కృత్వా విక్షిప్తమేవచ
ఆవర్తితం తతః కుర్యాత్తథైవ నికుట్టకమ్ ౧౬౪
ఊరూద్వృత్తం తథాక్షిప్త మురోమండలమేవచ
కరిహస్తం కటిచ్ఛిన్నం సూచీవిద్ధో భవే దయమ్. ౧౬౫

అలపల్లవోపలక్షితమగు అర్ధసూచీ, విక్షిప్త, ఆవర్త, నికుట్టక, ఊరూద్వృత్త, ఆక్షిప్త, ఉరోమండల, కరిహస్త, కటిచ్ఛిన్నములను తొమ్మిది కరణములను క్రమముగా యోజించగా సూచీవిద్ధమను అంగహారము రాగలదు

4. అ ప వి ద్ధ ము

అపవిద్ధంతు కరణం సూచీవిద్ధం తథైవచ
ఉద్వేష్టితేన హస్తేన త్రికంతు పరివర్తయేత్. ౧౬౬
ఉరోమండల కౌ హస్తౌ కటిచ్ఛిన్నం తథైవచ
అపవిద్ధోఽంగహారశ్చ విజ్ఞేయోఽయం ప్రయోక్తృభిః ౧౬౭

అపవిద్ధ, సూచీవిద్ధములను రెండు కరణములను ప్రయోగించి, ఉద్వేష్టితకరణమున బద్ధాచారితో త్రికోణాకారమున నున్న ఊరువునకు వలితమును చూపవలెను. తర్వాత ఊరోమండల, కటిచ్ఛిన్నములను కరణములను యోజించగా అపవిద్ధమను అంగహారము వచ్చును

ఇచట నాట్యప్రయోక్తలచే నీ అంగహార స్వరూపము తెలిసికొనబడవలెనని చెప్పబడినది. నాట్యప్రయోగ కుశలులకు సహితము అంగహార విషయమున సమ్యగ్ జ్ఞానము సిద్ధింపకపోవచ్చునని భావము. అంగహారములలో నుపయుక్తములగు కరణములను ఆడుటలో మధ్యవర్తన శిరోభ్రూ నేత్రాదికర్మతో గూడిన యోజనను కరణముల స్వరూపతత్త్వముల నెరిగినవాడు వెంటనే గ్రహించగలడు ఇట్లెరుగని వాడు కరణములను ప్రయోగింపజాలడు, నిరూపింపలేడు. నిరూపణలో గీత, వాద్య, లయ, వాక్యార్థ, భేదములతో సమన్వయమును జూపుచు వర్తించవలసి యుండుటచే సునిశితబుద్ధి గలిగి నాట్యప్రయోగ కుశలుడైననే అంగహారములను ప్రయోగింపగల్గును అందుచే నాట్యప్రయోగ కుశలులే ఈ అంగహారముల స్వరూపములను తెలిసికొనవలసియున్నదని చెప్పబడినది.

5. ఆ క్షి ప్త క ము

కరణం నూపురం కృత్వా విక్షిప్తాలాతకే పునః
పున రాక్షిప్తకం కుర్యా దురోమండలకం తథా ౧౬౮
నితంబం కరిహస్తంచ కటిచ్ఛిన్నం తథైవచ
ఆక్షిప్తకః స విజ్ఞేయో హ్యంగహారః ప్రయోక్తృభిః ౧౬౯

నూపుర, విక్షిప్త, అలాతకములను అంగపర్యాయముతోను ఆక్షిప్త, ఉరోమండల, నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నములను ఎనిమిది కరణములను క్రమముగా యోజించగా ఆక్షిప్తకమను అంగహారము రాగలదని నాట్యప్రయోగజ్ఞులు గ్రహింపవలెను.

6. ఉద్ఘట్టితము

ఉద్వేష్టితాపవిద్ధస్తు కరః పాదో నికుట్టితః
పున స్తేనైవ యోగేన వామపార్శ్వే భవే దథ ౧౮౦
ఉరోమండలకౌ హస్తౌ నితంబం కరిహస్తకమ్
కర్తవ్యం స కటిచ్ఛిన్నం నృత్తే తూ ద్ఘటితే సదా ౧౮౧

ఉద్వేష్టితాపవిద్ధమున అంగపర్యాయ సహితముగా, నికుట్టితకరణము నాడవలెను. ఆ తర్వాత ఉరోమండల, నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నములను కరణములను ప్రయోగించగా ఉద్ఘట్టితమను అంగహారము సిద్ధించును.

7. విష్కంభము

పర్యాయో ద్వేష్టితౌ హస్తౌ పాదౌ చైవ నికుట్టితౌ
కుంచితా వంచితౌ చైవ హ్యూరూద్వృత్తం తథైవచ. ౧౮౨
చతురశ్రం కరం కృత్వా పాదేనచ నికుట్టకమ్
భుజంగత్రాసితం చైవ కరం చోద్వేష్టితం పునః. ౧౮౩
పరిచ్ఛిన్నంచ కర్తవ్యం త్రికం భ్రమరకేణ తు
కరిహస్తం కటిచ్ఛిన్నం విష్కంభః పరికీర్తితః ౧౮౪

పర్యాయోద్వేష్టిత హస్తపాదములతో నికుట్టితకరణమును మొదట ఆడవలెను. తర్వాత నికుంచితము, అర్ధస్వస్తికముతో గూడిన అంచితము, ఊరూద్వృత్తము అను కరణములను ప్రయోగించవలెను. ఆ పై అర్ధనికుట్టక, భుజంగత్రాసితము లనువానిని యోజించవలెను. అప్పుడు ఉద్వేష్టితహస్తముతో ఛిన్న భ్రమరక కరణములను అంగపర్యాయముగా నాడవలెను, చివరకు కరిహస్త, కటిచ్ఛిన్నములను యోజించవలెను ఇట్లు పదికరణములతో గూడిన విష్కంభమను అంగహారము వచ్చును.

8. అపరాజితము

దండపాద కరం చైవ విక్షిప్యాక్షిప్య చైవహి
వ్యంసితం వామహస్తంచ సహపాదేన సర్పయేత్ ౧౮౫
నికుట్టకద్వయం కార్య మాక్షిప్తం మండలోరసి
కరిహస్తం కటిచ్ఛిన్నం కర్తవ్య మపరాజితే. ౧౮౬

విక్షేపాక్షేపములతో గూడిన దండపాదకరణము నాడి, వ్యంసిత, ప్రసర్పితములను ప్రయోగించవలెను. తర్వాత నికుట్టక, అర్ధనికుట్టక, ఆక్షిప్త, ఉరోమండల కరిహస్త, కటిచ్ఛిన్నము లను కరణములను యోజించగా తొమ్మిది కరణములతో అపరాజితమను అంగహారము రాగలదు.

9. విష్కంభాపసృతము

కుట్టితం కరణం కృత్వా భుజంగత్రాసితం తథా
రేచితేనతు హస్తేన పతాకం హస్తమాదిశేత్. ౧౮౭

ఆక్షిప్తకం ప్రయుంజీత హ్యూరోమండలకం తథా
లతాఖ్యం స కటిచ్ఛిన్నం విష్కంభాపసృతే భవేత్ ౧౮౮

నికుట్టక, అర్ధనికుట్టక కరణములనాడి భుజంగత్రాసిత కరణమును ప్రయోగించవలెను తర్వాత భుజంగత్రస్త రేచితకరణమును అంగపర్యాయముగా ప్రయోగించి పతాకాహస్తమును పట్టవలెను. ఆపై ఆక్షిప్తక, ఉరోమండల, కటిచ్ఛిన్నములను మూటిని యోజించుచు పర్యాయేణ ఒకచేతిని లతాహస్తముగా చూపవలెను ఇట్లు కరణసప్తకముతో విష్కంభాపసృతము సిద్ధించును.

10. మత్తాక్రీడము

త్రికం సువలితం కృత్వా నూపురం కరణం తథా
భుజంగత్రాసితం సవ్యం తథా వైశాఖరేచితమ్ ౧౮౯

ఆక్షిప్తకం తతః కృత్వా పరిచ్ఛిన్నం తథైవచ
బాహ్యభ్రమరకం కుర్యా దురోమండలమేవచ ౧౯౦

నితంబం కరిహస్తంచ కటిచ్ఛేదం తథైవచ
మత్తాక్రీడో భవే దేష హ్యంగహారో హరప్రియః ౧౯౧

భ్రమరకము, నూపురము, దక్షిణాంగముతో భుజంగత్రాసిత, వైశాఖరేచిత, ఆక్షిప్త, ఛిన్నములను వామాంగముతోను, భ్రమరక వ్యంసిత, నితంబ,కరిహస్త, కటిచ్ఛిన్నము లను పన్నెండు కరణములను వరుసగా యోజించగా శివునకు ప్రియమైన మత్తాక్రీడ అను అంగహారము రాగలదు

11. స్వస్తికరేచితము

రేచితం హస్తపాదంతు కృత్వా వృశ్చికమేవచ
పున స్తేనైవ యోగేన వృశ్చికం సంప్రయోజయేత్ ౧౯౨

నికుట్టకం తథాచైవ సవ్యాసవ్య కృతం క్రమాత్
లతాఖ్యః స కటిచ్ఛేదో భవే త్స్వస్తికరేచితే ౧౯౩

వైశాఖరేచితము, వృశ్చికము అను కరణములను అంగపర్యాయముగా ప్రయోగించవలెను తర్వాత లతాహస్తముల జూపుచు, అంగపర్యాయమున నికుట్టకమును యోజించవలెను. చివరకు కటిచ్ఛిన్నమును ప్రయోగించగా ఆరు కరణములతో గూడిన స్వస్తికరేచితమను అంగహారము రాగలదు.

12. పార్శ్వస్వస్తికము

పార్శ్వేతు స్వస్తికం బద్ధ్వాకార్యంత్వథ నికుట్టకమ్
ద్వితీయస్యచ పార్శ్వస్య విధిః స్యా దయమేవహి ౧౯౪

తతశ్చ కరమావర్త్య హ్యూరుపృష్ఠే నిపాతయేత్
ఊరూద్వృత్తం తతః కుర్యా దాక్షిప్తం పునరేవహి. ౧౯౫

నితంబం కరిహస్తంచ కటిచ్ఛిన్నం తథైవచ
పార్శ్వస్వస్తిక ఇత్యేష హ్యంగహారః ప్రకీర్తితః. ౧౯౬

దిక్స్వస్తికము, ఏకాంగముతో అర్ధనికుట్టకము, మరల దిక్స్వస్తికము, ద్వితీయ పార్శ్వముతో అర్ధనికుట్టకము అను నాల్గు కరణములను వరుసగా ప్రయోగించవలెను. తర్వాత అపవిద్ధ, ఊరూద్వృత్తములను అంగపర్యాయముతో ఆక్షిప్త, నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నము లను నారుకరణములను క్రమముగా యోజించగా పార్శ్వ స్వస్తికమను అంగహారము వచ్చును.

13. వృశ్చికాపసృతము

వృశ్చికం కరణం కృత్వా లతాఖ్యం హస్తమేవచ
తమేవచ కరం భూయో నాసాగ్రే సన్నికుంచయేత్. ౧౯౭
తమేవోద్వేష్టితం కృత్వా నితంబం పరివర్తయేత్
కరిహస్తం కటిచ్ఛిన్నం వృశ్చికాపసృతే భవేత్. ౧౯౮

లతావృశ్చిక, నికుంచిత, మత్తల్లి, నితంబ, కరిహస్త, కటిచ్ఛిన్నములను నారు కరణములను వరుసగా యోజించగా వృశ్చికాపసృతమను అంగహారను రాగలదు. ఇచట నితంబమును పరివర్తింపజేయవలెను.

14. భ్రమరము

కృత్వా నూపురపాదంతు తథాక్షిప్తక మేవచ
పరిచ్ఛిన్నంచ కర్తవ్యం సూచీవిద్ధం తథైవచ ౧౯౯
నితంబం కరిహస్తం చాప్యూరోమండలకం తథా
కటిచ్ఛిన్నం తతశ్చైవ భ్రమరః స తు సంజ్ఞితః. ౨౦౦

నూపుర, ఆక్షిప్త, ఛిన్న, సూచీవిద్ధ, నితంబ, కరిహస్త, ఊరోమండల, కటిచ్ఛిన్నములను ఎనిమిది కరణములను వరుసగా ప్రయోగించినచో భ్రమరమను అంగహారము వచ్చును.

15. మత్తస్ఖలితకము

మత్తల్లికరణం కృత్వా కర మావర్త్య దక్షిణమ్
కపోలస్య ప్రదేశేతు కర్తవ్యంచ నికుంచితమ్. ౨౦౧
అపవిద్ధం ద్రుతం చైవ తలసంస్ఫోట సంయుతమ్
కరిహస్తం కటిచ్ఛిన్నం మత్తస్ఖలితకే భవేత్. ౨౦౨

మత్తల్లికరణము నాడి, కుడిచేతిని ఆవర్తింపజేసి, గండసూచీ, లీనము అను కరణములను ప్రయోగించవలెను. తర్వాత అపవిద్ధకరణమును వేగముగా నాడుచు తల సంస్ఫోటకరణము నభినయించవలెను. ఆపై కరిహస్త, కటిచ్ఛిన్నముల నాడినచో మత్తస్ఖలితకమను అంగహారము రాగలదు.

16. మదవిలసితము

దోలైః కరైః ప్రచలితైః స్వస్తికాపసృతైః పదైః
అంచితై ర్వలితై ర్హస్తై స్తల సంఘట్టితై స్తథా ౨౦౩
నికుట్టితంచ కర్తవ్య మూరూద్వృత్తం తథైవచ
కరిహస్తం కటిచ్ఛిన్నం మదాద్విలసితే భవేత్. ౨౦౪

మదస్ఖలితకము, మత్తల్లి, తలసంస్ఫోటితము, అను మూడు కరణములను క్రమముగా బహువిధ చిత్రగుంఫములుగా ప్రయోగించవలెను. ఆపై నికుట్టిక, ఊరూద్వృత్త, కరిహస్త, కటిచ్ఛిన్నము అను నాలుగు కరణములను వరుసగా యోజించగా మదవిలసితమను అంగహారము సిద్ధించును.

మదస్ఖలితక, మత్తల్లి, తలసంస్ఫోటిత కరణములను ఒక్కొక్కదానిని మూడు సారులు చేయవలెనని కొందరభిప్రాయపడినారు. ఏడుకరణములను మూడేసి మూడు పర్యాయములు చేయవలెనని మరికొందరన్నారు. కాని మొదటి మూడు కరణములను బహువిధ చిత్రగుంఫములుగా జేయవలెనని సంప్రదాయము.

17. గతిమండలము

మండలస్థానకం కృత్వా తథా హస్తౌచ రేచితౌ
ఉద్ఘట్టితేన పాదేన మత్తల్లికరణం భవేత్. ౨౦౫
ఆక్షిప్తం కరణంచైవ హ్యురోమండల మేవచ
కటిచ్ఛిన్నం తథాచైవ భవేత్తు గతిమండలే ౨౦౬

మండలస్వస్తికము, నివేశము అను కరణములనాడి, ఉన్మత్త, రేచిత, ఉద్ఘట్టితము, మత్తల్లి, ఆక్షిప్త, ఉరోమండల, కటిచ్ఛిన్నములను కరణములను వరుసగా యోజించగా గతిమండలమను అంగహారము రాగలదు.

18. పరిచ్ఛిన్నము

సమపాదం ప్రయుజ్యాథ పరిచ్ఛిన్నం త్వనంతరమ్
ఆవిద్ధేనతు పాదేన బాహ్యభ్రమరకం తథా ౨౦౭
వామసూచ్యా త్వతిక్రాంతం భుజంగత్రాసితం తథా
కరిహస్తం కటిచ్ఛిన్నం పరిచ్ఛిన్నే విధేయతే. ౨౦౮

సమనఖము, ఛిన్నము అను రెండు కరణములనాడి ఆవిద్ధచారీతో సంభ్రాంత కరణమును ప్రయోగించవలెను. తర్వాత భ్రమరకము, ఎడమపాదముతో అర్ధసూచీ, అతిక్రాంత, భుజంగత్రాసిత, కరిహస్త, కటిచ్ఛిన్నములను కరణములను క్రమముగా ఆడవలెను. ఇట్లు తొమ్మిది కరణములతో పరిచ్ఛిన్నమను అంగహారము సిద్ధించును.

శ్రీమదాంధ్రవేదాంతపంచదశి

[ద్వైత వివేక ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౭

బాహ్య వస్తుస్థితిన బౌద్ధ వాదు లొప్పు
కొనరు, అద్వైతులము నొప్పుకొందు మేము;
వస్తువుల ప్రయోజనము కన్పడని కతన
వస్తువే లేదనంగ నొప్పంగరాదు,
వస్తుసిద్ధి ప్రమాణాల వాంఛసేయుఁ,
గాని యే ప్రయోజనమును గాని వాంఛ
సేయదంచును శాస్త్రము చెప్పుసుగద!

తన్మనోమయ జగము బంధమగు నేని
అట్టి బంధ నివృత్తి యోగాప్తివలనఁ
గలుగు నమ్మనో నిగ్రహమ్మునను గలుగ
నింక బ్రహ్మపు జ్ఞాన మదేల చెపుమ!

దాన ద్వైత భావంబు తాత్కాలికముగ
శాంతిఁ జెందిన రాఁబోవు జన్మము లవి
నాశ మా పరమాత్మ జ్ఞానంబు లేక
కలుగదనుచు వేదాంతము తెలుపుచుండు.

ఈశుచే సృష్టమైనట్టి యీ జగంబు
నఱఁగ కున్నను, దాని మిథ్యాత్వ నిశ్చ
యంబు కల్గిన, నద్వితీయమగు బ్రహ్మ
మును నెఱుఁగనగు, బ్రహ్మైక్యమనఁగ నిదియె.

ప్రళయమందున బాహ్యప్రపంచ మణఁగు
చుండినను గురుశాస్త్రాదు లుండకున్న
అద్వయ బ్రహ్మమెఱుఁగ సాధ్యంబుగాదు
జగము నశియించినను బ్రయోజనము లేదు.

ఈశుచే నిర్మితంబగు నీ జగంబు
జ్ఞానమునకు బంధముగాక సాధక మగు;
శక్యమా కాదు జగము నాశముగఁజేయ
ఈ జగంబుండినను ద్వేషమేమి మనకు?

మానస జగంబు శాస్త్ర సమ్మతమటంచుఁ
గాదనుచు రెండు విధములు గాగ నుండు
శాస్త్ర విహితమున్ బ్రహ్మ సాక్షాత్కృతి యగు
నంతవఱకు గ్రహింపఁగా నగు నరుండు.

శాస్త్ర విహితమయిన మానసప్రపంచ
మనఁగ జీవాత్మ పరమాత్మలను గుఱించి
శ్రవణ మననములగు. దానబ్రహ్మమును నె
ఱింగి వీడుమని శ్రుతి యెఱుంగఁజేసె.

బుద్ధిమంతుడు వేదాంతమును గురుముఖ
మున బఠించికొని మననమును బొనర్చి
బ్రహ్మ మెఱిఁగి శాస్త్రము విడువంగ వచ్చు
వంటకాఁ గొఱవిని బాఱవైచినట్లు.

ధాన్యమును గోరుమనుజుండు దనకునేమి
పనికిరాని గడ్డిని పారవైచినట్లు,
బ్రహ్మ విజ్ఞాన మొదవ శాస్త్రముఁ బఠించి
అది లభించిన శాస్త్రమున్ వదలవలయు.

ఆత్మయొక్క సాక్షాత్కారమైన పిదపఁ
జిత్తమును దదేకాగ్రతం జేయవలయు
ఆత్మ విషయంబు గాకుండునట్టి యితర
విషయముల కేగగా నవి వెతలెయగును.

ఏకమగు పరమాత్మనే యెఱిఁగికొనుఁడు
అన్యములను వదలు డింద్రియముల మనము
నందుఁ బ్రాజ్ఞుండు నియమింప నగునటంచు
నెల్లవేదముల్ ఘోషించు నెల్లయపుడు.

అయ్యశాస్త్రీయము మనోమయమగు జగము
తీవ్రమనియు మందమనియు ద్వివిధమగును,
రాగ కోపాదికంబు తీవ్రంబు, వనిత
చందన విషయ జ్ఞానంబు మందమగును.

అయ్యశాస్త్రీయము మనోమయ ప్రపంచ
ములను రెంటిని బోధకు ముందె విడువు;
వాని విడువకుండినను దత్త్వముఁ గ్రహింప
ననువయిన సాధన చతుష్టయంబు కలుగ,
దదియు లేక శాంతియును నేకాగ్రతయును
నలవడఁగఁ బోదు, వైరాగ్య మవి కలుగక
యుంచుకేని బోధ కలుగ దిది నిజమ్ము.

బ్రతికియుండి యె ముక్తిని బడయుకొఱకు
జ్ఞాన మొదవు పిదపఁగూడ మానవలయుఁ
దీవ్రమందముల, విషయాదికములందుఁ
జిక్కుకొనువాఁడు మోక్షముఁ జెందఁబోఁడు.

ముక్తి బ్రతికియుండఁగ లేకపోవుఁగాక
జన్మరాహిత్య మొదవినఁ జాలునాకు,
అందువేని, జన్మములు నీకల్లెయుండు
శ్రవణమాత్రమునను స్వర్గసౌఖ్య మొదవు.

స్వర్గ మస్థిరమనెడి దోషంబుచేత
ఏ పగిది విడువఁదగునో యా పగిదిగ
అధిక దోషంబులకు మూలమైన కామ
క్రోధములనేల విడువఁగాఁ గూడదొక్కొ?

తత్త్వ మెఱిఁగియుఁ గామ క్రోధములఁబూర్తి
గా విడువకుంటి వేనియుఁ, గర్మశాస్త్ర
ములను నుల్లంఘనము చేయఁ బూను నీకు
స్వేచ్ఛయగు వర్తనము లభియించు మిగుల.

బ్రహ్మవేత్తకు స్వేచ్ఛా ప్రవర్తనంబు
కలిగెనేని, వానికి శునకంబునకును
అశుచి భక్షణమందు నావంతమైన
భేదముండునె? విడుము కామాదికమును

జ్ఞానమొదవుటకును మున్ను కామకోప
ములఁ గలుగు దుఃఖములు, జ్ఞానమును కలిగిన
పిదపఁగూడ రెండంతల నొదవెనేని
అహహ! నీ జ్ఞానమహిమ నేమనఁగవలయు.

ఆత్మ విదుఁడవు నీవు కామాదికమును
విడక శునక వరాహతుల్యుడవు కాకు,
మఖిల ధీ దోష సంత్యాగ మాచరించి
దైవముగ సర్వలోక వంద్యత వహింపు.

కామ్యముల నుండు దోషాలఁ గాంతువేని
వానియందుండు కాంక్షయు వదలిపోవు,
తత్త్వ శాస్త్రాదులందు నుక్తంబులైన
కామ్యములను త్యజించి సౌఖ్యమును గనుము

ప్రబలకామాదులు విడువఁబడెడుఁగాక,
విషయచింతనమున దోస మెసఁగునేమి?
అందువే, నట్టి చింతన మఖిలములగు
పాపముల మూలమని భగవానుఁడనియె.

సంతతము విషయమ్ములఁ జింతసేయ
వానియందు నాసక్తి యుద్భవము నెందు,
అట్టి యాసక్తిచేఁ గామ మావహిల్లు
కామమువలనఁ గ్రోధమ్ము కలుగుచుండు.

నిర్వికల్ప సమాధి చెందియును నుండ
తన్మనోరాజ్యమెల్ల సాధ్యమగుఁగెల్వ,
మానవుఁడు సవికల్ప సమాధివలన
నిర్వికల్పమైన సమాధిని గొనఁగలఁడు.

ఒంటరిగ నెల్లప్పుడు నుంట చేత
బుద్ధి దోష రాహిత్యముంబూన్కి చేత
ప్రణవమును సంతతంబు జపంబుచేత
తన్మనోరాజ్య జయ మందఁదగును జ్ఞాని.

ఇవ్విషయ చింతనంబు జయింపఁబడఁగ
మనసు మూగవానివలె వృత్తిని త్యజించి
నిశ్చలంబగు; నీ స్థితినే వసిష్ఠ
మౌని శ్రీరామునకుఁ బలుమార్లు చెప్పె.

అద్వితీయ బ్రహ్మముకంటె నన్యమయిన
దేదియును లేదనెడు తత్త్వబోధచేత
దృశ్యమును మదినుండి వారించె నేని
శ్రేష్ఠమైన మోక్షంబద్దు నెందు నరుఁడు.

తత్త్వ మత్యంతము విచారితంబు నయ్యు
గురువు కడ నఖిలమెఱిఁగి కొనఁగఁబడియు
వాసనా శూన్యమౌ మనో నాశనంబు
లేక పరమపదం బెందు లేదు లేదు.

భోగమొసఁగెడి ప్రారబ్ధమునకు జేసి
యొక్క యెడబుద్ధి చలియించుచుండవచ్చు,
అట్టి బుద్ధిని నభ్యాస మాచరించి
చేయఁదగు నిశ్చలత్వము చెందునట్లు.

ఎవ్వనికిఁ జిత్త విక్షేపమేమి లేదొ
అతని బ్రహ్మ విదుండనియనఁగ రాదు,
అతడు సాక్షాత్పరబ్రహ్మమే యటంచు
పారదర్శనులగు మునుల్ పలుకుచుంద్రు

ఎవ్వఁడీ బ్రహ్మమెఱుఁగుదు నెఱుఁగ ననెడు
నెట్టి వ్యవహారమును లేక యెల్ల యపుడు
నద్వితీయ చైతన్య మైనట్టి వాఁడొ
వాఁడు బ్రహ్మవిదుఁడెకాడు, బ్రహ్మమెయగు.

ఇట్లు జీవసృష్ట జగము కీశ సృష్ట
జగమునకును భేదము వచించంగఁ బడియె,
అట్లు జీవసృష్ట మనోమయమగు జగము
వదలునేని జీవన్ముక్తిఁ బడయువాఁడు
పరమమైన బ్రహ్మైక్యముం బడయువాఁడు

మహావాక్య వివేక ప్రకరణము

ఎట్టి చైతన్యము వలన నీ సమస్త
మును గనుంగొనుచును, శబ్దములను వినుచు,
పలుకుచును, వాసన గొనుచుఁ, దెలిసికొనునో
అయ్యదియె ప్రజ్ఞానము ననఁగఁ బరగు

బ్రహ్మ మందింద్రునందు దేవతలయందు
గుఱ్ఱములయందు నరులందు గోవులందు
అలరు చైతన్యమే బ్రహ్మమగును, నాదు
నెడఁగలుగు జ్ఞానమే బ్రహ్మమె యయియుండు.

అఖిలమునునిండు నప్పరమాత్మ, జగము
నందు మనుజాది సకల దేహములయందు
బుద్ధికిని సాక్షి భూతమై పొలుచుచుండి
'అహ' మను పదంబుచేఁ జెప్పనగుచునుండు.

అఖిలమును నైజముగ నింపు నా పరాత్మ
బ్రహ్మ శబ్దముచేతను వర్ణితంబు
'అస్మి' యని జీవ బ్రహ్మైక్య మగుటచేత
నేనె బ్రహ్మంబటంచును నెంచఁబడెడు

సృష్టిముందు నామము రూపమేమి లేక
అద్వితీయమై, ఏకమైనట్టి బ్రహ్మ
మిప్పటికిని విచారింప నప్పగిదిగ
నొప్పు నాత్మ తత్పదముచేఁ జెప్పబడియె

ఇంద్రియముల కతీతమై యెసఁగు నట్టి
వస్తువా 'త్వం' పదమునఁ జెప్పంగఁబడియె
'అసి' యనఁగ జీవ బ్రహ్మైక్య మ్మగును జూవె
ఆ ముముక్షువులు తదైక్య మనుభవింత్రు.

'అయ' మను పదంబు స్వయముగా నలరుచుంట
అయ్యదియె యపరోక్షము ననఁగఁ బరగు,
అహము మొదలు దేహాంతము కన్యమగుచు
తనువు నందుండునదె యాత్మయనఁగఁ బరగు.

కానఁబడు నీ సమస్త జగంబు వాస్త
వమున కా బ్రహ్మ శబ్దానఁ బలుకఁబడెడు,
ఆ పరబ్రహ్మ స్వప్రకాశాత్మక మగు
ప్రత్యగాత్మ రూపమని చెప్పంగబడెమె.

స మా ప్తి

ఏది వివేకము?

శ్రీ "కౌటిల్యుడు"

ప్రకృతి అంతయు పరమరమణీయమైనది. ఈ ప్రకృతిలోని రామణీయకత అనిర్వచనీయమైనది. దీనిని తార్కికబుద్ధితో నిర్వచన చేయగలమా? లేదా? అన్న సమస్య వివాదాంశమై తర్కవితర్కములతో కూడి యిదమిద్ధమని తేల్చి నిర్ధారణ చేయబడకనే యున్నది

ఈ ప్రకృతి తత్వము అతి విచిత్రమైనది. అస్పష్టమైనది. ఇది యిది అని నిర్వచించదగినది మాత్రము కాదు మనము చూచునది మనము వినునది మనము స్పర్శించునది మనము చవిచూచునది మనము ఆఘ్రాణించునది యిది అని వస్తుభావనలో నిర్ధారణ చేయశక్యము గానిదై యున్నది ఇది యేదోయొక అననుభవైక వేద్యమైన నిర్వచనమా? అనుభవైక వేద్యమైన నిర్వచనమా? అనుదానికి సమాధానము చెప్పుట సాధ్యముకాదని యనిపించుచున్నది.

ఈ ప్రకృతి అనంతమైనది ఈ ప్రకృతి పదార్థ స్వరూపస్వభావ నిర్ణయము సనాతనమని కొందరు, అధునాతనమని మరికొందరు వాద ప్రతివాదములు చేయుచున్నారు. ఏది సనాతనమో ఏది అధునాతనమో ఎవరు తేల్చగలరు? ఈ తేల్చబడని వివాదాంశములపై వాద ప్రతివాదములు చేయుట అపహాస్యము గాదా?

సృష్టిని ప్రకృతి యనుకొనవలయునా? ప్రతిసృష్టిని ప్రకృతి యనుకొనవలయునా? సృష్టిని, ప్రతిసృష్టిని ప్రకృతి యనుకొనవలయునా? లేక ప్రకృతినే సృష్టి, ప్రతి సృష్టలనుకొనవలయునా? వీనిలో వేనిని దేనిగా భావించవలయును? ఇవి యన్నియు ఒకేభావన అనుకొనవలయునా? వీనిలో దేనిని యేమనుకొనవలయును? ఇవి తర్కవితర్కములకు తేల్చబడనివియై యున్నవా? కాక మరేమనుకొనవలయును? దైవభావన అనుకొనవలయునా? లేక దైవమే యీ సృష్టి, స్థితి, లయ కారణములకు ఆదిభూతమని చెప్పిన వాదములున్నవిగదా, అని సంతృప్తిపడవలయునా? అవి యన్నియు అనంతకాల ప్రవాహ ప్రభావ విలసితమై నిలచి యున్నవనుకొనవలయునా? కాని యివి అస్పష్టమైనవిగను, అసందిగ్ధమైనవిగను, అసమంజసమైనవిగను భావించి తార్కికబుద్ధితో త్రోసిరాజనిన వాదములున్నవి గదాయని అనుకొనవలయునా? వీటన్నింటిని గురించి యోచించిన వారు ఏది ప్రకృతి, ఏది సృష్టి, ఏది ప్రతిసృష్టి, ఏది దైవము అన్న భావనిర్ధారణ చేయబడకనేయున్నదని భావించుచున్నారు. వీరి యీ భావనకు ప్రకృతి స్వభావము కారణమా? సృష్టిస్వభావము కారణమా? ప్రతిసృష్టి స్వభావము కారణమా? దైవస్వభావము కారణమా? ఏది వీటికి కారణమో నిరూపించు నేర్పరులున్నచో మనము వారికి నమస్కరించవచ్చును వారు నిర్ధారణచేసిన మార్గమున నడువవచ్చును. కాని మనలను నియమిత మార్గములో నిర్ధారణచేసి నడిపించువారు ఒకరే ఉండియుండుదురని నిరూపించగలమా? లేమా? అన్న ప్రశ్న భావము అప్పటికీ యిప్పటికీ సమాధానము చెప్పబడకనే యున్నది

ప్రకృతి ధర్మము శ్రేష్ఠమైనదా? సృష్టి ధర్మము శ్రేష్ఠమైనదా? ప్రతిసృష్టి ధర్మము శ్రేష్ఠమైనదా? వీనిలో యేది శ్రేష్ఠమైనది? కొందరు అసాధారణమైన వ్యక్తుల జన్మకారణముగా యేది శ్రేష్ఠమో నిరూపించవలసిన స్థితి యేర్పరచబడి వాదోపవాదములతో తర్కించుకొని నిశ్చయబుద్ధికి, నిరూపితము కాక అనేక చిక్కులకు ఆలవాలమై జీవిత వికాసమును కాలగర్భములో కలుపుకొనుచుంటిమా? అన్న సందేహము పొడ సూపుచున్నది

ఒకొక్క కాలములో ఒకొక్క విధమున వస్తుపరిశీలన చేయబడినది. తత్వపరిశీలన చేయబడినది స్వభావపరిశీలన చేయబడినది. గుణపరిశీలన చేయబడినది ఈయీ పరిశీలనలలోని సారాంశమును రసనిష్పత్తిలో విభా

గించి, వివిధములైన విలువలను యేర్పరచు కొని వ్యవహారపద్ధతిలోనిరూపణచేసుకొనుచూ ప్రయాణము సాగించిన తీరుతెన్నులు కనిపించుచున్నవి ఈకనుపించిన కథాకల్పనల లోని చమత్కృతియే వస్తువై చిత్రికి, రూపవై చిత్రికి, భావవైచిత్రికి కారణభూతమై కను పించు చున్నది దీనిని పలువిధములుగా పరి ష్కరించుటకు ప్రయత్నించినవారిని యుగ పురుషులని, కాలపురుషులని పేర్కొనుట జరిగినది శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు, శంకరుడు, మహాత్మాగాంధీ మొదలైన వారిని మనముదాహరణగా తీసికొనవచ్చును. వీరిలో ప్రతిఒక్కరూ ఒకొక్కతరహా జీవిత మును ప్రాదిపతిక చేసుకొని జీవితధర్మమును నిర్వర్తించవలయునని ప్రబోధించినారు. వీరి ప్రబోధములు మానవజీవిత నిర్మాణము నకు తోడ్పడెనో, తోడ్పడలేదో వివరించి విపు లీకరించడం అసాధ్యమని చెప్పనచ్చును వీరి జీవితాచరణమానవుల జీవితాచరణము నకు దోహదము చేసెనో, చేయబడలేదో సమగ్రముగా చర్చించి స్పష్టీకరించడము అసాధ్యము. ఇవి అసాధారణమైన జీవితాలు. వీరి జీవితఆశయ ఆదర్శములు మానవుల భావావేశమున ఉపకరించి యుండవచ్చును భావావేశముపొందిన మానవులు బహుదూరము ప్రయాణము చేయలేకపోవచ్చును. ఈ భావా వేశము సర్వసాధారణముగా వివేకమునకు దూరమై, విజ్ఞానవ్యాప్తికి ప్రతిబంధకమై మాన వుని చిత్త సంస్కారమును కోల్పోవునట్లు చేయును ఒకొక్కకాలములో ఒకొక్క భావా వేశము మానవుని ప్రవర్తనను తీర్చిదిద్దెనని మనకొనుచుందుము. మానవుని ప్రవర్తన తీర్చబడినదీ లేనిదీ యోచనచేసి నిర్ధారణ చేయ గలమా? అవునని కొందరందురు కాదని మరి కొందరందురు. ఇది యెలా తేల్చవలయును? తత్తత్కాలములలో జన్మించిన అసాధా రణజీవిత లక్ష్యప్రభావావేశమును పొందిన మానవులు అవునందురు. తత్తత్కాలములలో భావావేశము పొందని మానవులు కాదందురు ఒకరికి ఒకరు నచ్చెదరు. మరియొకరికి మరి యొకరు నచ్చెదరు. ఎవరికి యేది నచ్చిన అదియే ఉత్తమమని వాదోపవాదములు చేయు దురు. ఈ నచ్చినది, నచ్చనిది మానవుని భావా వేశమే. ఇందులో ఏది మనకు యోగ్యమైనది? ఏది అయోగ్యమైనది? అన్న మీమాంసచేసి చిక్కులను కల్పించుకొనుచుందుము. ఇది తెలివిడికి లక్షణమో కాదో? తెలుసుకొన వలయును.

ప్రకృతికి యిది ధర్మము, ఇది అధర్మము అనునవి ఉన్నవా? ఇది మంచిది, యిది చెడ్డది అను విభాగమున్నదా? ఇది సద్వ్యసనము, యిది దుర్వ్యసనము అను భావవిభాగ మున్నదా? ఇది సౌందర్యము, యిది అసౌం దర్యము అను పరస్పర అవిభాజ్యమున్నదా? లేక, యిది పరస్పరాశ్రయమా? ఇందులో వేనిని వేనిగా భావించవలయును? ఏది జీవిత పరమావధికి పరమరమణీయము? ఒక్కభారత జాతికి మాత్రమే పరిమితమైయున్న యీభావ మీమాంసను క్లుప్తముగా చెప్పినచో యింత చరిత్ర అంతర్గర్భితమైయున్నది ప్రపంచ ములోని మానవులలో పలువిధములైన మతము లున్నవి పలురకములైన దైవారాధనలున్నవి ఒకటేమిటి? మనకు ఎన్నెన్నివిద్యలు తర్క వితర్కములతో కూడియున్నవో అవి అన్నియు ప్రపంచములోని మానవులకందరకు ఉండియున్నవి. వారిలోను యుగపురుషు లున్నారు కాలపురుషులున్నారు. వారి భావా వేశమును పొందిన మానవులున్నారు ఇది అంతయు తర్కవితర్కములతో తేల్చి సరిచేసి పరిష్కరించవచ్చునని భ్రాంతిపడుట వివేక వంతమైన పనియేనా? ఇందులోని సాధ్యా సాధ్యములను గమనించవలసిన పనిలేదా? ఇవి యేవీ యోచించనివారు యోచించి వివే చన చేయలేనివారు అందుకు తగిన నిగ్రహ శక్తి లోపించినవారు శరీరమునకు మనస్సుకు ఉన్న శక్తులకు అంచనా వేయలేనివారు యేమైనను వ్రాయవచ్చును ఏమైనను మాట్లాడ వచ్చును ఏ ప్రవర్తననైనను నిర్ధారణచేయ

వచ్చును. ఏ మార్గమునసైననూ ప్రయాణించ వచ్చునని చెప్పవచ్చును యోచనాశక్తినీ, నడ వడికనూ సమభావముచేసి మానవులు పర స్పరము సహకరించుకొని మెలగవచ్చునన్న భావార్థమేమనశంకలన్నిటికికారణమైయున్నది జనన, మరణములన్నియు సృష్టికార్యమునకు సమభావములే జననమెంత రమణీయమో మరణమూ అంతే రమణీయము. జనన మరణ ములలోని రామణీయకత యేదో మనము గ్రహించినచో అదియే ప్రకృతి భావమని తెలి యనగును లాభనష్టములు ప్రకృతి జన్యములే లాభము పరమరమణీయమని నష్టముమాత్రమే రమణీయకముకాదని వాదముచేయుట అవి వేకము సర్వసాధారముగా మానవులందరు అవివేకులే అయితే వ్యవహారధర్మములో అందరినీ వివేకవంతులు కావచ్చునని వివేక వంతులని చెప్పుకొనుచుందుము అంతమాత్ర మున అందరము వివేకవంతులముకాము వివే కమునకు, అవివేకమునకు హద్దును ఏర్పరచి యిది మా అంతిమ నిర్ణయమని చెప్పగలిగిన వారెవ్వరైనా యున్నారా? ఇది అసాధ్యమని తెలిసినంతనే యిందుకుమూలకారణమైనశక్తిని ప్రశంసించి ప్రాపేయపడి నమస్కరించి ఇలా ప్రార్థించిరని మన కధలలో ఒకచోట యిలా చెప్పబడియున్నది.

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల
నుండు లీనమై
ఎవ్వని యందుడిందు పరమేశ్వరు డెవ్వడు
మూలకారణం
బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు
సర్వము తానయైనవా
డెవ్వడు వానినాత్మభవు నీశ్వరునే
శరణంబు వేడెదన్.-

ఈ పద్యభావమును యెవ్వరు మనసా, వాచా, కర్మణా అనుభవైకవేద్యము చేసుకొన గలరో అట్టివారికి మన మన అంతస్థులలోని వ్యత్యాసములు తెలియబడి వినమ్రులై అంజలి ఘటించి ప్రకృతిశక్తిలోని అనంతమైన యీ విభిన్నమైన రామణీయకతను ప్రశంసించి దానితో పరస్పరము సహకరించి స్వారస్యాన్ని అనుభవించి ఆనందించి వేనోళ్ళ కొనియాడు తనతన హద్దులలోని పరిమితులను గమనించి ప్రవర్తించి జీవించగల శక్తివంతుడు కాగల డని అనిపించుచున్నది.

*

*   *

గోవిందరామాయణము

విశ్వామిత్ర శరణాగతి

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు

నేనేజాలను దుష్టరావణునితో నిల్వంగఁ గయ్యంబునన్
మౌనీ నాబలగంబు లెల్లమడియున్ మార్కొన్నచో రావణున్
వానిన్ఢీ కొనువాఁడె బాలకుఁడు దేవానీకమే డుల్లు న
వ్వాని న్దార్కొని నేను నాబలము నాబాలుండు నోడింతుమే.

సుందుఁడు వాని తమ్ముడుపసుందుని పుత్రులు యజ్ఞవాటికన్
జిందులు ద్రొక్కుచుండఁగ, నజేయులవారల డీకొనంగ నా
బొందె తరింపఁజేయఁగల పుత్రకు బాలకుఁ గోరుదేల యే
మందు నొసంగఁజాలను మదాత్మజు బాలకు నీకుఁ గౌశికా.

కరుణ వహింపుమయ్య, కసిగందుని గోరకుమయ్య, నీవకా
గురుఁడవు, దైవతంబవును గోపము సేయకుమయ్య, వీఁడ సం
గర మొనరించుటయ్య కలకాలము భాగ్యుడ నైతినయ్య నా
చిరుతని వీఁడుమయ్య మది చెడ్డఁదలంపకుమయ్య కౌశికా.

అనతితో నిటుల్ దశరథావని నాథుఁడు పుత్రమైత్రికిన్
లోనయి విన్నవించు నుడిలోఁ దలపోయుచు నా మహర్షి తే
జోనయనాగ్ని ప్రజ్వరిలు చూడ్కులఁ బల్కఁగ సాగెనిట్లహో
మానవనాథ నీకె తగుమాటలముందుగఁ జెప్పవైతివే.

కేవల కర్మరుండవు ప్రకీర్ణతపస్స్థిత యోగమగ్నుఁడన్
నీవన క్రోధభారమున నిండినవాఁడవు నే జటాభరం
బే వహియింతు రాజసుఁడ వీవు మదీయము సాత్వికంబె యిం
కీవు సుతాభిమానుఁడవె, ఏను జగజ్జనకాభిమానుఁడన్.

నీవొకొ భోగమేకనుదు, నేనొకొ యోగము నభ్యసించితిన్,
నీవు సుతేష్టిసల్పితివి, నేనొ తదిష్టిని బూర్తిచేసితిన్
నీ విల ధర్మకామముల నెంతువు నా కగు ధర్మ మోక్షముల్
నీవ యథార్థమున్ గనఁగ నేర్చినవాఁడవు రామునీయవా.

ఆడినమాట తప్పితే మహాయశమందిన కోసలేశ! యె
వ్వాఁడును లేఁడు మీ కులమువాడిటు లిత్తును గోర్కెయంచు మా
టాఁడినవాఁడు నేఁడు మొదలన్వయమెల్ల గళంకమొందు నీ
వేఁడ యసత్యమేఁడ సుఖయించుటయేఁడ సబాంధవంబుగన్.

గురుఁడు వసిష్ఠుఁ డంత మునికుంజరు రోషపరీతబుద్ధి, భూ
వరు మమకారముం, గనుచువారికిఁ దారణఁజూప నెంచి లో
నరసియె యుంట సర్వము మహర్షియుఁ దానయి యుంట ధర్మ త
త్పరుఁడయి ఊనితో హితము పల్కఁగ సాఁగె విన౯ సభాసదుల్.

నీకులమందుఁ బుట్టిరి పునీతులు సంతత సత్యసంధు లి
క్ష్వాకుని వంశసంభవులు వారలు ధర్మపరాయణుల్ సదా
శ్రీకర దివ్యసువ్రతులు చేసి రనూన సమస్తదానముల్
నీకిది యర్హమౌనె ధరణీశ స్వధర్మము వీడనెంతువే.

మూడులోకంబులను ఖ్యాతిఁబొందినావు
ధర్మమూర్తి వధర్మంబు తగదు తగదు
ప్రతిన నెరవేర్పుమీ రఘువంశజాత!
వీడుమీ రాము, రాముని వీడుమిపుడె.

దానఫలమును సప్తసంతాన ఫలము సత్యసంధత తొలఁగిన సమసిపోవు
యజ్ఞయాగాది కర్మలనాచరించి యిపుడు వీడెదో? ప్రతిన పుత్రేషణమున.

అతఁడు భాగ్యభోగ్యముల నంతముగాఁ గలవాఁడె యయ్యు వి
ఖ్యాత నృపాలుఁడయ్యు వివిధాస్త్రచయాన్వితుఁడయ్యు మౌనియై
వీతభయానురాగముల విప్రమహర్షియు నయ్యు రాము సం
ప్రీతి వరింప నీవిడక వేఱువిధంబు దలంపధర్మమౌ

అతడొక కుఱ్ఱవాఁడును కృతాస్త్రచయుండును గాని బాలుఁ డా
యతి బలులైన రాక్షసుల నాహవ మందెదిరింపఁ గల్గునే?
సుతుఁడను మాటవీడి పరిశుద్ధమనంబునఁ బంపు రాము మీ
హితుఁడయి వచ్చెఁ గౌశికుఁ డహీనబలుం డరిఁ జంపఁ గల్గియున్.

శతదివ్యాస్త్ర మహాబలాన్వితుఁడు విశ్వామిత్రుఁడో రాజ యీ
యతమ్ముం జేయఁగలండతం డెపుడు నూతాన్నాస్త్రంబులంగూడ సం
తత ధర్మాత్ముఁడు సర్వశాస్త్ర విదుఁడున్ దా సర్వమర్పింప నీ
సుతుకున్ వచ్చినవాఁడు రాము నిడుమీ శుద్ధాంత రంగమ్ముతోన్.

కులగురు వాక్యమున్వినుచుఁ గోసలనేత ప్రసన్న చిత్తుఁడై
కలతను వీడి రామునిడఁ గౌశికమౌనికి లోఁ దలంచుచున్
బిలిచెను రామలక్ష్మణుల, వేచనుదెంచిరి వారు దివ్యమం
గళకరులౌచుఁ దండ్రిసముఖంబున నిల్చిరి బద్ధహస్తులై.

దరహాసితాననుండు వసుధాపతి యంతట రాముఁబిల్చి యీ
దరమున మంగళంబను నితాంతశుభంబగుఁగాత నీ కనున్
బరమమునీంద్రు సన్నిధి విభాసుర సత్యపరాక్రముండవై
వరలెదుగాత నీవను సు బాలుని మూర్కొను నిండు ప్రేముడిన్.

రాజ్ఞి యానందబాష్పముల్ రాలఁ బుత్రు
నల్ల నొడిఁజేర్చి యక్షతల్ చల్లె నతఁడో
మాటిమాటికి మూర్కొను, మాతకపుడు
నంజిలి ఘటించె మంగళంబనెను దల్లి

లోకబాంధవాంశ వహించి లోకమెల్ల
రక్షణము సేయఁ బుట్టిన రామచంద్ర
సముఁడు ధర్మార్థ కామమోక్షముల నెఱుఁగుఁ
గౌశికుఁడితండు వచ్చె నీ కాంక్షనిటకు.

అని వసిష్ఠుండు మంగళమనుచుఁ బలికి
రాము నభిమంత్రితునిఁ జేసె రాజరాజు
కౌశికున కిచ్చె రాము లోకంబు మెచ్చ
శంఖ దుందుభి నినదంబు చదలనిండ.

మునులున్ విప్రులు దల్లిదండ్రులును సమ్మోదంబుతో మంగళం
బని యాశీస్సులొసంగు చుండ సురలాహ్లాదంబునన్ బుష్పవృ
ష్టిని వర్షింపఁ, గడంగ నక్షతలబూజించెన్ జనంబెల్ల; ద్రో
వను బట్టించెను రామలక్ష్మణుల విశ్వామిత్రుఁ డాత్మార్థమై.

దొరకరానిదేదొ దొరకిన చందాన సద్దివిడువరాని దైనయట్లు
తనువు పొంగ మనసు తత్పరమైయుండ గాధిసుతుఁడు నడువఁగడగె ముందు.

జటలున్ వల్కలముల్ పొసంగ చను నాసన్మౌనివెన్వెంట, బా
సటయై రాముఁడు నీరజాక్షుఁడు ఘనశ్యాముండు బాలుండు దు
ర్ఘట మార్గంబులఁబోపు విల్లుఁగొని, ఖడ్గంబూని సౌమిత్రి రాఁ
బటు బాహాబల ఖడ్గధర్మముల శోభన్ దన్ను వెంటాడుచున్.

ఈ మునిమాన్యుఁ డెవ్వఁడని యెంచడు దుర్గ మనన్యభూములన్
భూమిధవుండు పుత్రు ననుఁ బొమ్మనెనాయని ప్రశ్న సేయఁ డా
రాముఁడు తండ్రియాన యిది రామయటంచు వసిష్ఠుఁడాడు లే
నీమము మానఁజాలె మునినేతకు మ్రొక్కుచు వెంబడించఁగన్.

అన్న రాముండు పయనమై యరుగనుంట
వింటయే చాలు సౌమిత్రి వెంటనంట
సవతి కౌసల్య సరియనియంట చాలు
మేలుమేలని పంపె సుమిత్రయు సుతు.

ఉడుము చర్మంబు కవచంబు నూనియుండె
వారి పల్లవకోమల పాణియుగము
స్కంధములుగాని వారి భుజమ్ములందు
నలరుచున్నవి రెండేసి యంప పొదులు.

రాజసుతుఁడు రాముండు దుర్వారబలుఁడు
కౌశికునివెంటఁ జనుచుండఁ గాంతినొందె
దశదిశలుగూడఁ బరుఁడు సద్భక్తునెపుడు
వెంటనంటెడి గతి వారి విధముదోఁచె.

ఉరుకునబోయి వారు సరయూనది దక్షిణ తీరమందు ని
ల్చిరి మునిపల్కె నిట్లపుడు శ్రీఘన రామ జలంబుదీయుమీ
వరుల జయింపఁగల్గెడి బలాతిబలల్ గ్రహియింపవయ్య నీ
సరిమటియేరు లేరు బహుసాంద్రతపఃఫలవిద్య నీయఁగా.

ఎవఁడనురక్తి వీని జపియించునొ వాఁడు సదాప్రసిద్ధుఁడై
భువనము లన్నిటన్జయముఁ బొందుఁ బ్రమత్తుఁడు సుప్తుఁడైననున్
జవమును వీడఁబోఁడు నిజశత్రు భయంకరుఁడప్పుగూడ వా
స్తవమిది పొందఁడెప్డు శ్రమ దప్పియు నాఁకలి మాఱురూపమున్.

దేశభాషలలో శాస్త్రపఠనము

కీ॥ శే॥ శ్రీ కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు పంతులు

తల్లిపాలు త్రావి పెరిగిన బాలునకును, దాదిపాలు త్రావి పెరిగిన బాలునకు నెట్టి భేద ముండునో స్వభాషయందు శాస్త్రాభ్యాసము చేసినవారికిని బరభాషయందు జ్ఞానార్జనము చేసినవారికి నట్టి భేదమే యుండును. అన్యభాష మొదట నేర్చుకొని పిదప నాభాషయందు శాస్త్రములఁ గళలఁ జదువుకొనుట ద్రావిడ ప్రాణాయామము వంటిది కాని యిట్టి ప్రాణాయామమే మన దేశమునందుఁ బ్రస్తుతము జరుగుచున్నది. తర్క వేదాంతాది పూర్వశాస్త్రముల నేర్చుకొనవలయు నన్న సంస్కృతము నేర్చుకొనవలెను. రసాయనపదార్థవిజ్ఞానాది శాస్త్రముల నభ్యసింపవలెనన్న నింగ్లీషు నేర్చుకొనవలయును. ఈ భాషల నభ్యసించుటకుఁ గొంతకాలము వ్యయపఱుపవలెను ఇవి మన మాతృభాషలు కానందున వీనినిఁ జక్కఁగ నభ్యసించుటకు విశేషముగాఁ బరిశ్రమము, కాలవ్యయమును, ధనవ్యయంబును గలుగుననుటకు సందేహములేదు. స్వభాషయందే యన్నివిద్యల నేర్చుకొను మార్గము లుండినయెడల నీ వ్యయప్రయాసములన్నియు దప్పిపోవునుగదా! ఉగ్గుపాలతో నేర్పఁబడిన స్వభాష సహజముగఁ బ్రతి మనుష్యునకు వచ్చును కొద్ది పరిశ్రమతో దానినిఁ బ్రతిమనుజుఁడు నభ్యసించి యందుఁ బండితుఁడు కావచ్చును. ఎట్టి కరినమైన గ్రంథమునైనను, విద్యనైనను, గళనైనను, దనభాషలో నుండెనేని మానవుఁడు సులభముగ దెలిసికొనఁగలడు. అంతియె కాదు ఆ భాష నెఱింగిన వారియందఱలో నాయా విద్యలుసులభముగను ద్వరితముగనుబ్రసరించి జనులయున్నతస్థితికిఁ గారణభూతములగును.

స్వభాషయందు విద్యలులేక పరభాష నభ్యసించి విద్యల సాధింపవలసినవాడింట నన్నములేక పొరుగిండ్లు తిరిగి యన్నమును సంపాదించినవానితో సమానుఁడు మనదేశములో మనకు, అనగా బ్రాహ్మణులకు మొదటినుండియు బరాన్నమును గోరుట విహితమైన ధర్మముగ నున్నందున మనవారిది యెకగొప్ప తప్పుగ నెంచకపోవచ్చును. కాని ప్రాణముతోనున్న పాశ్చాత్యదేశముల వంకఁ జూడుఁడి. విద్యావిషయమున నితర దేశములకంటె వెనుకఁబడకుండుటకై వారు చేయు ప్రయత్నములు చూచిన నెవ్వరిమానస మాశ్చర్యానందముల మునుంగకమానును? విద్యావిషయమై వారి కింతకక్ష యేల! కారణముస్పష్టము. నేఁడు వలసిన విద్యలన్నియు నేర్పు విద్యాపీఠములును, గ్రంథరాజములును ఇంగ్లండుదేశమునం దున్నందున వేఱు దేశమునకుఁ బోకయ వేఱుభాష నేర్చుకొనకయ, వారికన్ని విద్యలును, గళలును, వృత్తులును నేర్చుకొనుటకు వీళ్లున్నవి. దైవముయొక్క యద్భుతఘటనచే శాస్త్ర సంబంధమయిన ఇంగ్లీషు గ్రంథములన్నియు నేఁడొక్కపెట్టున నశించిన వనుకొనుఁడు. పాప మిట్టిదురవస్థ యేదేశమునకు నెప్పుడును రాకయుండునుగాక! వచ్చినయెడల నింగ్లీషువారి విద్యాభ్యాసస్థితి యేమగును? ఏవిద్య నేర్చుకొనవలయునన్నను బరభాషయైన జర్మనీభాషనో ఫ్రెంచిభాషనో మొదలభ్యసించి తద్ద్వారమున నిష్టవిద్యనుగాని, కళలనుగాని, వృత్తులనుగాని నేర్చుకొనవలెను అప్పుడు వారిసాంపత్తికస్థితి యిప్పుడున్నట్లుండఁగలదా? పొగబండి నడుపువిధముఁ దెలిసికొనుటకు జర్మనీదేశమునకు, నావికశాస్త్ర మెఱుంగుటకు ఫ్రాంసుదేశమునకు నాకాశయానము నభ్యసించుటకు 'ఇటలి' దేశమునకు 'దేహి' యనిపోవలసిన యింగ్లీషువారు తమదేశాభివృద్ధి యెట్లు చేయఁగలరు? కావున స్వస్వమాతృభాషలలో సకలవిద్యాసాధనము లుండుట నాగరకరాష్ట్రములయొక్క మొదటిలక్షణము

అట్లన నెవ్వరును సంస్కృతమునుగాని యింగ్లీషునుగాని నేర్చుకొనఁగూడదా యనియు, నాయాభాషల నేర్చుకొని విద్య

లను సాధించుటకు వీలున్నప్పుడు మాతృభాషలో లేవన్న చింత మనకేలయనియుఁ గొంద ఱడుగవచ్చును సంస్కృతభాషను గాని, యింగ్లీషు భాషనుగాని, ఫ్రెంచి మొదలయిన తదితర భాషలనుగాని చేతనైనవారు, ధనమున్నవారు, వీలుగలవారు నేర్చుకొనవలయుననియే నా తాత్పర్యము. వానిలోను, రాజభాష యయినందునను, లోకమందలి యితరభాషలకంటె నన్నివిధములను గ్రంథభాండారమునం దత్యధికమైనదని ప్రఖ్యాతిచెందినదియు, నగుటచే నింగ్లీషుభాషను నేర్చుకొనుట మన నాగరకతాభివృద్ధికిని దేశోన్నతికి నత్యంతావశ్యకమని నాయభిప్రాయము. కాని యది యెంతవఱకు సాధ్యమో! జనసామాన్యమునకంతకు నింగ్లీషుభాష చక్కఁగ వచ్చుటయు, నందు వారు సకలవిద్యలను సాధింపగలుగుటయు నిఁక వేయి సంవత్సరముల కయినను హిందూదేశమునందు సంభవించునా? ఎప్పటికిని సంభవింపనేరదు. అట్లే సంస్కృతము. ఇది దేవభాషయని మనకు భక్తి యున్నను దేశమునం దెందఱు సంస్కృత పండితులు కలరు? సంస్కృతము దేశభాషాభివృద్ధికి సాయముగా నుండవలసినదే కాని మరల నది దేశభాషయగు నన్నమాట కలలోనివార్త. సంస్కృతముగాని యింగ్లీషుగాని హిందూదేశములోని దేశభాషాస్థానము నాక్రమించుకొననేరవు. దేశభాషలలో విద్య నేర్పుటకంటె ఈ భాషలలో విద్య నేర్పుట యెప్పుడును నేర్చుకొనువారికిని, నేర్పువారికిని నెక్కుడు కష్టముగా నుండఁగలదు కావున నాయాభాషలవారికి నాయా భాషలలోనే విద్యాదానము చేయు మార్గముల నిర్మించుట యావశ్యకము

ఇప్పుడు మన దేశస్థులు వేలువేలువిద్యల సాధింపనెంచి కొంద ఱింగ్లండునకును, గొందఱు జపానుకును, గొంద ఱమెరికాకును పోవుచున్నారు. దేశముయొక్క భావిపురోభివృద్ధికిది మంచిచిహ్నమే. కాని యాలాగున నెందఱు పోఁగలరు? లక్ష కొక్కఁడు గాని వేయి కొక్కఁడుగాని వెళ్లగలఁడా? వేలకొలఁదిధనము వెచ్చించి యితరబాధల కోర్చి లక్ష కొక్కఁడు వెళ్లివచ్చిన నేమి ప్రయోజనము? మిగిలిన తొంబదితొమ్మిది వేల తొమ్మిదివందల తొంబదితొమ్మిది మందికి వివిధవిద్యలబ్బుట యెట్లు? వీరిలోఁ గొందఱు కొంచె మింగ్లీషు నభ్యసించెద రనుకొందము మిగిలినవారిగతి? వారికి జ్ఞానార్జనము చేయుదమన్న కోర్కె పొడమినను జ్ఞానము లభించు మార్గము లేదా? అట్టి సాధనముల నిర్మించుట దొరతనమువారి యొక్కయు, విద్యాధికుల యొక్కయు, ధనాధికులయొక్కయు నవశ్యకృత్యము కాదా? ప్రజలందఱకును విద్య నేర్చుకొనుటకు వీలయిన సాధనములను నిర్మించుట రాజధర్మము మనము కేవలము రాజసాహాయ్యము నమ్మియే యుండఁగూడదు వారు చేయుసాయమునకై కృతజ్ఞులమగుచుమనము స్వతంత్రప్రయత్నములను జేయుచుండవలెను ఈ మార్గమునఁ బోయిన బాగుగ నుండునని ముందంజ వేయుటకు విద్యావంతులును, విద్యావంతులచే నారంభింపఁబడిన కార్యములు శాశ్వతములుగ నుండునట్లు చేయుటకు ధనవంతులును సంసిద్ధులై యుండవలెను శాస్త్రజ్ఞానాభివృద్ధికై మనదేశము నందు జరుగవలసిన పనినిగూర్చియు, జరుగనున్న పనినిగూర్చియు విచారించెదము

దేశమందంతట శాస్త్రజ్ఞానాభివృద్ధికావలయునన్న దేశభాషయందు గ్రంథములు, నానాశాస్త్రములను బోధించు పాఠశాలలు నుండవలయును. కేవలము విద్యాపీఠములుండి గ్రంథములు లేకపోయినను ప్రయోజనములేదు. కేవలము శాస్త్రము లుండియుఁ జెప్పువారు లేకపోయిన నుపయోగము లేదు! ఇందుకు దృష్టాంతముగ నొక చిన్న యుదాహరణ మిచ్చెదను చెన్నపట్టణమునందు నాయుర్వేదపాఠశాల యున్నదని మీరెఱిఁగినవిషయమే. అందు నింగ్లీషుపద్ధతి

ప్రకారము శారీరశాస్త్రము (Physiology and Anotomy) అను విషయమొకటి విద్యార్థులకు బోధించెదరు. పాశ్చాత్యవైద్య శాస్త్రమునం దారితేరిన డాక్టర్లే యావిషయమును బోధించెదరు కాని యీ విషయమును బోధించు గ్రంథము దేశభాషలందు లేనందున, విషయార్థ బోధ చేయుటలో నుపాధ్యాయులకును, విషయమును బోధచేసికొనుటలో విద్యార్థులకును మితిలేని పరిశ్రమ కలుగుచున్నది తెలుఁగునందు శ్రీ వీరేశలింగము పంతులుగారిచే రచింపఁబడిన చిన్న శారీరకశాస్త్రము కలదు కాని యది యీ తరగతికిఁ జాలదు ఇంతకంటె నెన్నియో మడుంగులు విపులముగ వ్రాయఁబడినగ్రంథము కావలయును. అట్లే శస్త్రవైద్యమును గురించిన గ్రంథము తెలుఁగులో లేనేలేదు. ఇతర దేశభాషలందునులేదు కావున నది నేర్పుటయే యసంభవమైనది ఆవిషయము నాయుర్వేద వైద్యశాలలో నేర్పు విషయములలోనుండి తీసివేసిరి అట్లె యాయుర్వేదసంబంధమైన యుగ్గ్రంథములు సంస్కృతమునందే కలవు తెలుఁగునఁగాని యితర భాషలందుఁగానిలేవు కావున సంస్కృతము చక్కఁగ రానివారికి నాగ్రంథములవలన విశేషలాభము కలుగదు. ఈయిక్కట్లు నాలోచించియే శ్రీభిషఙ్మణి పండిత గోపాలాచార్యులవా రాయుర్వేద గ్రంథమాల నొకదానిని స్థాపించి గీర్వాణగ్రంథములను దెలుఁగుచేసి యాంధ్రులకృతజ్ఞతకుఁ బాత్రులైరి మచిలీపట్టణములో స్థాపింపఁబడిన జాతీయ కళాశాలాధికారులుకూడ భిన్న భిన్న కళాకౌశల్యములు నేర్పుటకుఁదగిన గ్రంథములు లేనందున నేగ్రంథములు పరనీయములుగా నేర్పరుపవలయునాయని త్రొక్కులాటపడుచున్నారు! ఇది చదువుచెప్పువారుండి చదువుకొను గ్రంథములు లేనందునఁ గలుగు నిబ్బంది ఇట్లే కొన్నియెడల గ్రంథములున్నను వానినిఁ జదువువారుగాని, చెప్పువారుగాని యుండరు ఉపయోగము లేక పుస్తకములు చెదలుపట్టిపోవును. తెలుఁగులో బీజగణితము (Algebra) ఉన్నది. క్షేత్రగణితము (mensuration) ఉన్నది. అట్టి గ్రంథములకు విశేషప్రచారము లేకయవి ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునందు మూలఁబాగి యేలయుండవలయును? వాని నుపయోగించు గురువులు, నభ్యసించు విద్యార్థులునులేక అట్లగుటచేఁ దెలుఁగులో గూడ 'నాల్జెబ్రా' చెప్పవచ్చునా? తెలుఁగులో 'జ్యామెట్రి' నేర్పఁగలమా? Progressions చెప్పిన ఇంగ్లీషులోఁ జెప్పవలయునేగాని తెలుఁగులో నేర్పుటకు వీలులేదు అని మనవారే వాదింపఁజొచ్చిరి! ఇంగ్లీషు గణితమునకుమాఁటుగా లీలావతి గణితమునే మన పాఠశాలలోఁ జెప్పుచుండినచో నిట్టి సంశయములు మనవారి కేలపుట్టును? ఇప్పుడు మనపిల్లవాండ్రు ఎఫ్,ఎ. తరగతిలో నేర్చుకొనుచున్న ప్రోగ్రెషనులు, 'ఫరముటేషన్', 'కాంబినేషనులు' మన పిల్లలు నాలుగవ యయిదవతరగతులలో, "శ్రేఢీవ్యవహారము, అంకపాశవ్యవహారము" అనుపేళ్లతో నేర్చుకొని యుందురు. నాతాత్పర్యము పాశ్చాత్యగణితశాస్త్రము మన గణితశాస్త్రమునకంటెఁ దక్కువయభివృద్ధిలో నున్నది యని చెప్పుటకాదు ఇటీవలిగణితజ్ఞుల బుద్ధిసూక్ష్మతచేఁ బాశ్చాత్యగణితశాస్త్రముయొక్క క్షేత్ర మత్యద్భుతముగ వైశాల్యముఁ జెందినదియని నేనెఱుంగుదును. కాని యావిద్యయంతయుఁ దెనుఁగునఁ జెప్పరాదా? జ్ఞాన మొకభాషయొక్క యబ్బసొమ్ముకాదు ఏభాషమూలముననైనను దానిని సాధింపవచ్చును ఎవరి మాతృభాషలో వారు సులభముగను కొలఁదికాలము లోను, గొలఁది శ్రమలోపలను దెలిసికొనవచ్చును. పరభాషలో నభ్యసించినయెడల నెక్కుడు కాలము, నెక్కుడు శ్రమయు, నెక్కుడు ధనవ్యయమును బట్టును. ఈ భేదము కనిపెట్టి యింగ్లీషు విద్యలన్నియు మన భాషలోనికిఁ దెచ్చి లోకులకు బోధించుట సమంజసము అట్లు చేయక పరభాషలలోఁ జెప్పుట స్వభావవిరుద్ధము.

ఛందోవాణి

శ్రీ శనగన నరసింహస్వామి, ఎం. ఏ.

తమసా తీరము వెంట శిష్యుడు భరద్వాజుండు వెన్నంట సం
యమి సమ్రాట్టు చనందొడంగెను భవిష్యద్భారతీ భార సం
భ్రమణోత్ఫుల్ల విలోచన ద్వితయుడై, మాధ్యాహ్నిక స్నాన సం
భ్రముడై, ప్రావృడనంత వేషగహనోన్మత్తైక చేతస్కుడై.

కలశ మొకకేల వల్కలకాండ మొక్క చేత గ్రహియించి వెన్నాడు శిష్యవరుడు;
గురువునకు ముందఱెవ్వరో కొసరికొసరి పోవుచున్నట్టు లెడద నపోహపడెను.

కొలకులో కెరటాలకొసలు ముద్దులువెట్టు
  వాయువర్ధన గంధ వైభవమ్ము
సెలయేట నెదురీత సింగారములు సేయు
  కలహంస దాంపత్య గౌరవమ్ము
తెలితమ్మి తొలిరేక మెలపు వంపులదేలు
  షట్పదప్రభుగాన సౌమనసము
మబ్బుతున్కల మ్రోతమంపులో చెలరేగు
  బర్హిదేశిక నాట్య పాటవమ్ము

నవనవమ్ముగ దోచెను, నయనయుగళ
పేయమయ్యెను, పదసదధ్యేయమయ్యె;
చిత్తముప్పొంగి పోయి విచిత్రభావ
మత్తుడై పోవసాగెను మౌనవార్ధి.

దూరమునందు తే వెలుగు దోచుధునీ కమనీయవాలుకా
తీరమునందు సన్మిథున దివ్యతపఃఫలమౌళి దఘ్న శృం
గార పరీతవిస్మృతజగమ్మగు క్రౌంచయుగమ్ము ధర్మ సం
సార పరీక్షలో నడకసాగెను మౌనికి మందమందమై.

మార శిలీముఖోపహతి మైకము గ్రమ్మిన క్రౌంచరాజు భా
ర్యా రసికాగరుత్తట శయానుడు భావికనందు, ప్రాణ శం
కారవ కాలపాశమనగా రివ్వురివ్వునవచ్చి డొక్కలో
దూరి యయశ్శరమ్మొకటి దూసెను మెత్తనిగుండె లోతుగా.

కుత్తుక యెండి కూలె నెలుగుల్, పుప్పురెక్కల జంట తోగె క్రొ
న్నెత్తుట, చీకటుల్ గనులనిండెను, చోటిడె ఛిన్న భిన్నమై

మి త్తికి వెన్నముద్ద పసమించిన గుండె, క్షణక్షణమ్ముగా
మ త్తిలిపోయె దేహము క్రమమ్ముగ తూలెను ఫేనిలాస్యమై.

పురుషఖగ మ్మకాల శరభు క్త తనూదయనీ య వేదనా
పరవశమైన జూచి కులభామిని నిశ్చల శూన్యశుష్క దృ
గ్భరమున భర్తపై నొఱగె, పక్షికుటుంబ నిమేషదారుణాం
తరదశగాంచి మౌని కరుణామయుడై, అరుణాబ్జనేత్రుడై.

ఆగెను, తత్పదా త్త వినతాకుడు శిష్యుడు కొంత వెన్కగా
నాగెను, వాగుదాటి విహగాతురుడై చను బోయ భీతుడై
యాగెను, తన్నివేళ చకితాంచలమై తమసా ప్రవాహమే
యాగెను, మందవాయు దరహాసములాగె నదేమి చిత్రమో!

"మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః।
యత్ క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్"॥

ఆర్ద్ర గంభీర నిర్ఘోష మాలకించి చెదరిపోయిన మబ్బుల చేరదీసి
దిగ్విదిక్కులు పగిలి ప్రతిధ్వనించి పోటు పాటులలో పొగ్గిపోయె తమస.

అక్షరసమమ్ము, పాదబద్ధాఽక్షయమ్ము,
మధురతంత్రీ లయోపేత మార్దవమ్ము,
గాఢశోకార్త కంఠ గాద్గద్యవృత్త
మన్యమే కాదు శ్లోకమై మాన్యమయ్యె.

దారుణ శాపబాణము యథాతథమై యెదచీల్చినట్లు తూ
ణీరము జారిపోయిన గణింపని బోయకరమ్మునుండి దు
ర్వారముగా శరాసనము వ్రాలెను నేల చిరానుతాపమే
దోరగిలించి బాష్పజలధుల్ స్రవియించెను నేత్రగోళముల్.

ఛందోబద్ధముగా, చతుష్పదముగా, సామ్యాక్షర శ్లోకమై
స్పందించె న్నిజకంఠశోకభవ నై షాదక్రుధావేగ వా
క్ష్నిందా వృత్తము, తన్ముహుఃస్మరణ మందీభూతబాధా మహా
నంద స్నానముజేసె మౌని రసపానః పున్య ధన్యాపగన్.

పాణిని కవిత

మూలం : ప్రొఫెసర్, ఎస్. కె. రామచంద్రరావు

అనువాదం : శ్రీ యం. సుధాకరరావు.

వైయాకరణులు సాధారణంగా తీవ్రాలోచనాపరులుగనూ, ఆర్ద్రహీనులుగనూ ఉంటారు శృంగారంకాని, కవిత్వంకాని, వారితో ముడిపెట్టడం కష్టం అయితే సార్వకాలికోత్కృష్టుడూ, వ్యుత్పన్నుడూ అయిన వైయాకరణుడు పాణిని, ఈ విషయంలో తప్పపుట్టాడు. పాణిని సంస్కృతభాషా వ్యాకరణమునకు మూలపురుషుడుగా అభివర్ణించబడినాడు

అతని వ్యాకరణగ్రంథం 'అష్టాధ్యాయి' ఉత్తమమైనది కాని కష్టగ్రాహ్యం అష్టాధ్యాయి, దాని శాస్త్రీయ ప్రయోగరీతికి సంబంధించిన (Methodological) నిష్ఠురతకూ, సమగ్రతకూ ప్రసిద్ధికెక్కినది. పాణిని కవితాఖండాలు చెప్పుకోదగినవై యున్నప్పటికీ అవి అజ్ఞాతంగా ఉండిపోయినవి. ఇప్పుడవి పూర్తిగా విస్మరించాముకూడా. నిజానికి, వ్యాకరణసూత్రాలు తక్క అతని ఇతర రచనలు తిరిగీ లభ్యమయ్యే అవకాశంకూడా లేకుండా పోయినది. ఎటుగచ్చి, కొలది పురాతన వాఙ్మయ సేకరణలలో, అతని రచనలనుంచి ఎత్తి తీసుకొనిన భాగములుమాత్రమే భద్రంగా వున్నవి

పాణిని, ఈనాటి పాకిస్తాన్‌లోని వాయువ్య సరిహద్దు రాష్ట్రానికి చెందినవాడు. అటక్ సమీపంలోని 'యూసఫ్‌జై' లోయలోని, ఇప్పటి "లాహౌర్"గా రూపొందిన 'సాలతుర' లో జన్మించినాడు తల్లిపేరు "దాక్షీ". కథాసరిత్సాగరము నాల్గవతరంగములోని ఒకానొక కథలో, పాణిని ఉపవర్షునిదగ్గర విద్యాభ్యాసం చేసినట్టు చెప్పబడిఉన్నది. అక్కడ 'వ్యాడి' 'వరరుచి' అతని సహపాఠులు. పంచతంత్రము (2)లో పాణిని ఒక సింహముచేతిలో చనిపోయినట్టు ఒక సంఘటన వున్నది అంతకుమించి అతని జీవితవివరాలేమీ తెలియరావు

'గోల్డ్‌స్టకర్' "బెల్వాల్కర్"లు అతని కాలం క్రీ॥ పూ॥ ఏడవశతాబ్దిగా నిర్ణయించినారు. పాణిని యాస్కుని తరువాతివాడూ, పతంజలికి పూర్వీకుడూ అన్నది స్పష్టము. నిజానికి పతంజలి పాణిని వ్యాఖ్యాత పాణిని ప్రఖ్యాతి అతని వ్యాకరణ సూత్రాలలోనే నిలిచివున్నది అవి సంస్కృతభాషకు ఆధారభూతమైనవేకాక ఇతర భాషలలో తీవ్రమైన సంచలనముకూడా కలిగించినవి

రాజశేఖరుని పేర 'సూక్తిముక్తావళి'లో నున్న ఒక శ్లోకము పాణిని విరచితమైన 'జాంబవతీ విజయము'నుగురించి వక్కాణిస్తున్నది. దీనికే 'పాతాళవిజయము' అనికూడా పేరుఉన్నది 'నమిసాధుడు' దీనిని ఒక మహాకావ్యంగా వర్ణించినాడు. అయితే ఈ కావ్యము ఇప్పుడు కనబడదు బహుశః ఇది మహాభారతములోని, శ్రీకృష్ణుడు పాతాళానికి పోవడము, జాంబవతిని వివాహమాడడము, గురించిన కథ అయియుంటుందని ఊహించుకొనవచ్చును

'సదుక్తికర్ణామృతము'లోనూ, "పాణినికి ఉపజాతి ఛందస్సులమీద ప్రీతి" అని చెప్పిన క్షేమేంద్రునిచేతనూకూడ పాణిని సుప్రసిద్ధుడైన కవిఅన్న విషయముసూచించబడివున్నది పాణిని శ్లోకములు, పూర్తిశ్లోకములుగనో లేక ఖండములుగనో, ఆనందవర్ధనునిచేత ఉదాహృతములైనవి కృష్ణకర్ణామృతము రచించిన లీలాశుకుడు, భోజుని "సరస్వతీ కంఠాభరణము"నకు తను వ్రాసిన వ్యాఖ్యానములోనూ, 'రాయముకుటుడు' తాను అమరకోశమునకు వ్రాసిన భాష్యములోనూ, పాణిని కవితాఖండములు ఉదాహరించినారు 'సదుక్తికర్ణామృతము' లోనూ, వల్లభదేవుని 'సుభాషితావళి'లోనూ పాణిని శ్లోకాలు సూత్రప్రాయముగా పొందుపరచబడినాయి

ఈవిధముగా, మొత్తముమీద పాణినివి పదునారు శ్లోకములు లభ్యమైయున్నవి

ఇట్లు లభ్యమైఉన్న ఈశ్లోకాలు అసలుమూలములో ఏ సందర్భములలో చెప్పబడినవో గ్రహించుటకు సాధ్యముకాదు ఒక్కొక్కదాని విషయములో సరియైన భావనిర్ణయమే కష్టము

ఏమయినప్పంటికీ, లభ్యమైన శ్లోకములలో అధికభాగము ప్రకృతినే కావ్యవస్తువుగా కలిగియున్నవి. వర్షఋతువు, శీతాకాలము, చంద్రోదయము, సూర్యాస్తమయము, రాత్రి- ఇత్యాదులు.వీటిలోని కవితాసారము నిస్సందేహముగా ఉన్నతస్థాయికి చెందినది, వీటిలో కవి, శైలిమీద తనకుగల స్వచ్ఛందాధికారమునే గాక, అతని వికసిత భావనాశక్తినికూడ ప్రదర్శించినాడు కొన్ని శ్లోకములలో సున్నితముగా వ్యక్తపరచిన శృంగారరేఖలున్నవి. కొన్ని తన వ్యాకరణసూత్రములు చిత్రీకరించటముకొఱకు అల్లినట్టుగా కన్పట్టును.

రుద్రతుని కావ్యాలంకారమునకు వ్యాఖ్యానము వ్రాసిన నమిషాధుడు ఈక్రింది శ్లోకమును భద్రపరిచినాడు.

గతేఽర్ధరాత్రే పరిమన్దమన్దమ్
గర్జంతి యత్ప్రావృషి కాలమేఘాః
అపశ్యతీ వత్సమివేందు బింబం
తచ్ఛర్వరీ గౌరివ హుంకరోతి.

ఈ శ్లోకములో చటుక్కున తట్టే ప్రత్యేక లక్షణము, దానిలోని శబ్దనిరాడంబరత.పాణిని ఒక అశాంతనిశిని వర్ణిస్తున్నాడు. అర్ధరాత్రి గడచిన సమయము. తప్పిపోయిన చంద్రుని వెదుకుతున్నాయా అన్నట్లు కాలమేఘములు, చుట్టూ మెల్లమెల్లగా గర్జనలు చేయుచున్నవి తప్పిపోయిన తన ప్రియమైన దూడకొఱకు ఆతురతచెంది, అరచుచున్న ఆవు కవికి స్ఫురణకు వచ్చినది, లలితములైన పదములు నేర్పుగా కూర్చబడి, చక్కటి ధారతో నీ శ్లోకము సాగిపోయినది దీనిలో నొక యసాధారణమైన యూహ కలదు. ఎక్కడనో యున్న మేఘములు, తన ఎదుటనున్న ఆవుతో ఉపమించబడినవి

వెన్నెలరాత్రి కవికి శృంగారోద్రేకమును ప్రేరేపించుచున్నది.

ఉపోఢ రాగేణ విలోలతారకం
తథాగృహీతం శశినా నిశాముఖం
యథాసమస్తం తిమిరాంశుకం తథా
పురోఽపి రాగాద్గలితం నలక్షితం

నిశాకాంతయొక్క చలితతారకమై.. .... మును కాంచి,రే రాజు కామోద్రిక్తుడై ఆవేశముతో ఆమె ముఖమును చేజిక్కించుకొనినాడు. ఆ నిశాంగనకూడ, కామాతురతలో చీకటి యను తన నల్లనిముసుగు జారిపోవుచున్నదనే విషయమును గ్రహించలేకపోయెను.

ప్రశాంతమైన మానసికౌన్నత్యపు వాతావరణము పై శ్లోకపాదములందు పాదుకొనియున్నది సున్నితమైన శృంగారమునకు, గంభీరమైన భావప్రకటనారీతి యమరినది శబ్దచాతుర్యముకూడా పొసగినది.

కొండగుహలో నున్న కపోతదంపతులను చూచినపుడు, కవి భావనకొలదిగా మరలి మరియొకదారి త్రొక్కినది

అసౌగిరేః శీతల కన్దరస్థః
పారావతో మన్మథ చాటు దక్షః
ఘర్మాలసాంగీం మధురాణి కూజన్
సంవీజతే పక్షపుటేన కాన్తాం.

ఆ కనపడే చల్లని కొండగుహలో విరహతప్తలైన కపోతదంపతుల కాపురము. ప్రియురాలు చలికి కొయ్యబారివున్నది కాని, ప్రేమవచనాపారంగతుడైన ప్రియుడు మధురకూజితాలతోడను తరచు రెక్కలాడించుచును ప్రియురాలిని సేదదీర్చుచున్నాడు ఇక్కడ కవి ప్రయోగించిన పదములలో ప్రేమ తొణికిసలాడుచున్నది ఆ పదముల ఎన్నిక అతని భావౌన్నత్యమును సూచించుచున్నది

సూర్యాస్తమయముతో ముకుళితమైన పద్మినిని చూచినపుడు కవి పొందిన అనుభూతి యీ విధముగా వర్ణితమైనది,

సరోరుహాక్షిణి నిమీలయన్త్యా
రవౌగతే సాధుకృతం నలిన్యా
అజ్ఞాంహి దృష్ట్వాఽపి జగత్సమగ్రం
ఫలం ప్రియాలోకన మాత్రమేవ.

ఓపద్మినీ! నీ ప్రభువైన సూర్యభగవానుడు వెళ్లిపోయిన వెనుక నీవు కనులు మూసుకోవడము బహుచక్కని ఊహ ఎందుచేతననగా, ఇంతటి విశాలప్రపంచమును చూచు నేత్రములు తాము ప్రేమించినవారిని చూస్తున్నపుడు మాత్రమే హాయిని పొందుతాయి. సంధ్యాపాతాన్ని వర్ణిస్తున్న సంస్కారాతిశయంతో కూడిన ఆత్మ కనపడుతుందిక్కడ. సున్నితంగా వీస్తున్న శృంగార మందమారుతంతో కూడిన లలితమైన పదజాలం - సుకుమారమైన అనుభవం గోచరిస్తాయి.

మరో సాయంసమయవర్ణన వస్తుందిక్కడ

విలోక్య సఙ్గమే రాగం
పశ్చిమాయా వివస్వతః
కృతం కృష్ణం ముఖంప్రాచ్యా
నహి నార్యోవినేర్ష్యయా.

ఆ దిశనున్న ప్రియురాలిని కలుసుకున్న కామంతో ఉప్పొంగిన మనస్సుతో, పడమట సూర్యుడు ఎర్రబారిపోయినాడు. ఆమె సోదరి ప్రాగ్దిశ అసూయతో నిండిపోయినది ఆమె ముఖం నల్లబారిపోయినది. అతిసామాన్యంగానే వుంటుంది కాని, కవి ఇక్కడ, "స్త్రీలు అసూయలేకుండా ఉండరు" అనే నీతిని ఎత్తి చూపుతాడు.

మరో సాయంత్రం వైదాంతిక మనస్థితిలో మునిగిపోతాడు కవి

అథాఽ ససాదాస్త మనిన్ద్య తేజా
జనస్య దూరో జ్ఝిత మృత్యుభీతేః
ఉత్పత్తి మద్వస్తు వినాశ్య పశ్యం
యథా హి మిత్యే వమి వోపదేష్టుం.

"నన్ను అవలోకించండి - ఉదయించేది ప్రతీదీ అస్తమించి తీరవలసినదే" అని, మృత్యుభయంతో కృంగిపోయే మానవులకు చెపుతున్నాడా అన్నట్టు, నిర్దుష్ట జ్యోతిర్విభుడైన సూర్యుడు అస్తమించినాడు!

వర్షఋతువు కవికి దైవశక్తులయొక్క క్రీడలను స్ఫురింపజేస్తుంది!

క్షపాఃక్షమీ కృత్య ప్రసభ మపహృత్యామ్బు సరితాం
ప్రతాపోర్వీ కృత్స్నాం తరుగహనముచ్ఛోష్యసకలం
క్వ సంప్రత్యుష్ణాంశు ర్గత ఇతి సమాలోకనపరా
స్త డిద్దీపాలోకా దిశిదిశి చరన్తీ హ జలదాః.

రాత్రుల ఆయుర్దాయము తగ్గించేసినాడు-నదులలోని నీరు బయటకు తరిమివేసినాడు-భూమిని ఉష్ణమయం చేసినాడు! దట్టమయిన వృక్షాలనూ మొక్కలనూ దహించినాడు. ఆ ఉష్ణకిరణుడు సూర్యుడు!అయితే, అతనెక్కడికి పోయినాడు? విద్యుల్లతాజ్యోతులను చేతబుచ్చుకుని, మేఘాలు అతనిని వెదుకుకుంటూ దిశదిశలా సంచరిస్తున్నవి.

ఎంత మనోరంజకమైన కల్పన! పాణిని కవిత నూతనవాయువులు పీలుస్తుంది. అతని ఉద్రేకాలూ, చిత్రణలూ, సంకేత సంకెలల నుంచి విముక్తమైనవి ఇది పురాతనకాలములోని సౌలభ్యము. మూసకట్టు సాహిత్యము అమలులోనికి రాని కాలంలోనివాడు, ఈ కవి

చందమామ

(ఒక ఆంగ్లకథకు అనుకృతి)

శ్రీ బెల్లంకొండ రామదాసు

ఒకడు చంద్రమండలాన్ని చేరుకునే సాధనం కనిపెట్టాడు కాని, తీరా చేరుకున్న తరువాత ఎప్పుడెప్పుడు భూగోళానికి తిరిగి పోదామా అని తహతహపడ్డాడు ఆ తొందరలో వెంటనే మిషన్ వెనక్కుతిప్పి భూలోకానికి ప్రయాణమైనాడు.

ఇల్లుచేరిన తరువాత చంద్రబింబాన్ని చూస్తూ కిటికీ దగ్గర కూచునేవాడు నగరాన్నంతా తన దేదీప్యశోభతో వెలిగిస్తూ చంద్రబింబం ప్రయాణం చేస్తూ ఉండేది.

అతనికెప్పుడూ ఆలోచనగా ఉండేది. ఇంతా శ్రమపడి అక్కడికి వెళ్లాం కాని ఒక్క నిమిషమైనా ఉన్నట్టుకాని, ఒక్క విషయమైనా చూచినట్టుకాని లేదు సంవత్సరాల తరబడి శ్రమపడి అక్కడికి వెళ్లే దోవ కనిపెట్టాను సరిగా విజయంప్రాప్తించే క్షణంలో పలాయనం చిత్తగించాను. ఇందుకోసం ఎన్నెన్నిపాట్లు పడ్డాను! నాకూ ఆ బ్రహ్మకే తెలియాలి అన్ని అవకాశాలూ వదులుకున్నాను ఇతరులపట్ల, నాపట్ల నేను నిర్వర్తించవలసిన బాధ్యతలన్నీ విస్మరించాను అందరితో తగాదాపడ్డాను ప్రపంచానికి దూరమయ్యాను. అందరూ నన్ను ఒక పిచ్చివాడికింద జమకట్టారు. ప్రపంచంలో బ్రతుకే దుర్భరమైపోయింది చివరకు ఈ కష్టాలగట్లన్నీ ఎక్కి, ఇంత దూరమూ నిర్విఘ్నంగా యాత్రచేసి. విజయం అల్లంత దూరాన ఉన్నదనగా ఈ పలాయనంఏమిటి? ఏమిటీ విచిత్రం?'- ఇలా తలపోసేవాడు

అతను ఒక్కమాటు తన యాత్రనంతా నెమరుకు తెచ్చుకున్నాడు.

'నేను చంద్రమండలాన్ని స్పర్శించేసరికి, ఇంకా నాలో ఉత్సాహమూ శక్తీ నిండుగా ఉన్నాయి. ఆ ఊపులో సూర్యుని వరకు కూడా ప్రయాణం సాగించేవాణ్ణి. ఒక్కపిసరంతయినా అలుపులేదు. నవ్వాను పాడాను. పిచ్చివాడిలా ఏడ్చాను. అదివరకు ఎంతో బాధ భరించిఉంటాను. అంతా ఒక్కసారి ఆనందంగా వెలువడింది. కాని అసలు విషయం- మిషన్‌లోనుంచి దిగగానే నా ఉత్సాహం అంతా ఎక్కడపోయిందో- ఆవిరిలా ఇగిరిపోయింది. నాలో ప్రేరేపణంతా చచ్చిపోయింది మళ్లీ నాలో శక్తులన్నీ కూడగట్టుకోడానికి శాయశక్తులా ప్రయత్నించాను చెదిరిన నాభావాలన్నీ మళ్ళీ సమకూర్చుకుందామనుకున్నాను. కాని లాభం ఉంటేగా? ఒక్కక్షణంలో నా మనస్సులో భావాలన్నీ గాలికి మబ్బులుచెదిరినట్టు చెదిరిపోయాయి ఏవేవో అర్థంలేని ఆందోళనలు నా అంతరాత్మపైకి దండయాత్ర చేశాయి ఇవి అప్పటి నాదృష్టికి చాలా విచిత్రంగానూ విపరీతంగానూ కనుపించాయి నా లెక్కల్లో, పరిశోధనలో పడి ప్రపంచ విషయాలకు తక్కువప్రాధాన్యం ఇచ్చిఉంటాను. ఇందుకనే అందరూ నన్ను 'మేఘసంచారి', అని వెక్కిరిస్తుండేవారు— నా బుర్ర ఎప్పుడూ మేఘాల్లోనే విహరిస్తూ ఉంటుందని.

చంద్రమండలం చేరగానే నన్ను కలతపెట్టిన మొట్టమొదటి విషయం ఇంటికి బైట వాకిలి సరిగా వేశానా లేదా అని వంటింటి పొయ్యి ఆర్పేశానో లేదో కూడా జ్ఞాపకం లేదు ఇంట్లో పనిమనిషికి దమ్మిడీకూడా ఇచ్చిరాలేదు. పాపం! వాడెలా గడుపుతున్నాడో నేను బయలుదేరడానికి క్రితం రోజు సాయంత్రం ఒక ఉత్తరం పోస్టు చేశాను బిళ్ళలు తక్కువ అంటించినట్టు జ్ఞాపకం ఆరోజే నేను కట్టాల్సిన ఒకపన్నుకు చివరరోజు. చంద్రమండలంలో అడుగు పెట్టగానే ఈ జ్ఞాపకాలన్నీ దొంతర్లగావచ్చాయి.

ఇహా నేనుఒక్క నిమిషంనిలబడలేకపోయాను ఒళ్లంతా జెర్రులు పాకుతున్నట్టయింది నా ఇల్లు, వాకిలి, ఇల్లాలు, ఇంటిముందు తోట, సేవకుడు అన్నీ సాక్షాత్తుగా చూచినట్టు కళ్ళముందు కట్టడం మొదలెట్టాయి నిజంగా వాటిని చూస్తున్నప్పుడు కూడా ఇంత భ్రాంతి కలగలా ఇంకా బజార్లోవిశేషాలూ, నగరంలో విశేషాలూ, ఎన్నో జ్ఞాపకం వచ్చాయి. గోడలమీద బొమ్మలు, దుకాణాల అద్దాలకిటికీలు, సగంమూసిన కిటికీలోంచి ఓరగాచూస్తున్న ఒక లావుపాటి స్త్రీ, నిమ్మకాయలు, మిఠాయి, ఉల్లిపాయకూర వాసన- అబ్బో! నన్ను అన్నీ కమ్మేశాయి ఇహ చుట్టూ ఏముందో చూడాలనే కుతూహలం ఎవరికుంటుంది? నాకప్పుడు ఏమీకనుపించలేదు కూడా ఒక కొండలోయమాత్రం కాస్త జ్ఞాపకం చెట్లుకాని, ఇళ్లుకాని కనుపించలేదు ఆ దృశ్యం నాకు ఏమాత్రం ఆనందం ఇవ్వలేదు సంవత్సరాలకొద్దీ ఎంతో అందంగా ఉంటాయని చూడాలని తపించిన చంద్రలోకదృశ్యాలు- అసహ్యంగా కూడా ఉన్నట్టు తోచాయి. ఉల్లిపాయకూర వాసన ముక్కుల్ని మహాచెడ్డగా వేధిస్తోంది. అక్కడ వాసనలు కూడా విచిత్రంగా ఉన్నాయి అప్పుడే ప్రెస్ నుంచి విడుదలయిన న్యూస్‌పేపర్ల వాసన, వండి దించిన రొట్టెలవాసన, అప్పుడే పక్కమీది నుంచి లేచిన స్త్రీ వెచ్చని పరిమళం, ఎండలో కాచుకుని ఉన్న మనుష్యుల మందవాసన, —ఇలా ఎన్నెన్నో రకరకాల పరిమళాలు అక్కడఉన్నాయి. నాకుపూర్వం సహజంగా స్త్రీలన్నా, పురుషులన్నా అసహ్యం కాని ఈమాటు మాత్రం మనుష్యులమధ్య ఉండాలనే కోరిక నాలోవిపరీతంగా వ్యాపించింది. అక్కడున్న ఆ అరగంటలో ఆ కోరిక మరీ తీవ్రమైంది ఒక క్రిక్కిరిసినహోటల్లో ఒక మూల బల్లమీద కూచునే ఆనందంకోసం ఆ క్షణంలో పాలపుంతలోని గోళాలన్నిటినీ త్యజించేవాణ్ణి ఎలాగోఒకలా మనస్సు చిక్కబట్టుకుని ఒకపర్వతం వైపుకు నడక సాగించాను 'ఆగు' అన్నది ఒక గొంతుక అది నా గొంతుకే నా గొంతుకే విని నేను హడలిపోయాను. పెద్ద సింహగర్జనలా వినిపించింది చంద్రమండలంలో ఎవరి గొంతుక వారు వింటే రక్తం గడ్డ కట్టుకపోతుంది రెండోసారి ప్రయత్నించాను మళ్ళీ నా గొంతుకే 'ఆగు!' ఎన్నిసార్లు చెప్పాలి? ఇక ఇంటికి పద!' ఈమాటు ఇక ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేకపోయాను ఇక చేసేదేమీలేదు ఇంటికి వెళ్లాలనే వాంఛతో సుళ్లు తిరిగిపోయాను వెంటనే తిరిగి రాకపోతే అక్కడ దిక్కుమాలిన చావు చచ్చి ఉండేవాణ్ణి

తనకుతాను సమాధానం చెప్పుకోలేని ఆ వ్యక్తి కాసేపు అలా తిరిగి వద్దామని వీధిలోకి వెళ్ళాడు రాత్రి చలిగా ఉంది నగరవీధులు నిర్జనంగా ఉన్నాయి. దార్లో 'కేఫ్' కనిపించింది ఒకగుక్క వెచ్చని పానీయం నోట్లో పోసుకుందామని లోపలికి వెళ్ళాడు. ఆరోజు సంతరోజు. జనం క్రిక్కిరిసి ఉన్నారు. కొందరు పేకాటలో,కొందరు కబుర్లలో, కొందరు చర్చలలో నిమగ్నులై ఉన్నారు మనుష్యులవాసన, తాగుడువాసన గుప్పెత్తిపోతోంది.గ్రామఫోనుపాట రొదగా వినిపిస్తోంది. 'ఈ వెచ్చదనంకోసమేకదా నీవు కలవరించావు కానీ. అనుభవించు. ఆనందించు', అనుకున్నాడతను. అక్కడ ఒక్క నిమిషంకూడా నిలవలేక బైటికి వెళ్ళిపోయాడు. నడివీధిలోకి వచ్చాడు గగనమధ్యంలో చక్రవర్తిలా ఉన్న చంద్రుడు వెన్నెల ధారాపాతంగా కురిపిస్తున్నాడు అతను చంద్రబింబంవంక చూచాడు అతని చెక్కిళ్ళు కన్నీళ్ళతో తడిశాయి అతని హృదయంలో చల్లదనంప్రవేశించింది వెన్నెలలో తళతళలాడుతున్న వీధులలో తడబడుతున్న అడుగులతో నడుస్తూ వెళ్ళాడు. ఆకాశంవంక చూస్తూనే నడుస్తూ వెళ్ళాడు.

చంద్రుణ్ణి చూస్తోంటే అతనికి వింతగా కనుపించింది తన ఇళ్ళలో ఒక ఇంటిని చూస్తున్నట్టు అనిపించింది

గలగలలాడుతున్న కాలవదాటి నగర ప్రాకారం వెలుపలికి వచ్చాడు. ఒకకుక్క చంద్రుణ్ణి చూచి మొరిగింది. పిచ్చికుక్క! ఎందుకలా అరుస్తుంది? చంద్రబింబం హాయిగా ప్రయాణం చేస్తోంది. తను ఎక్కడ దిగాడో ఆ ప్రదేశం కనుపిస్తోంది 'పోయిన శుక్రవారమేగా అక్కడికి వెళ్ళింది'', అనుకున్నాడు. అతని చెక్కిళ్లు ఎర్రపడ్డాయి ఒక నిమిషం అలాగే ఏదో ఆలోచిస్తూ నిలిచిపోయాడు తరువాత ఒక్కమాటు నిశ్వసించి తాళపుచేతులకోసం జేబులు వెదుక్కున్నాడు అక్కడా, ఇక్కడా అంతా వెదికాడు ఎక్కడా లేవు. ఇంట్లోకూడా ఎవరూ లేరు ఇప్పుడేం చేయాలి' ఏంచేయాలి? ఒక తాగుబోతు పిచ్చిపాటవిధి చివర వినిపిస్తోంది. వాడు దగ్గరికి వస్తున్నాడు

'నేను చెప్పలా? నీ విక్కడే ఉంటేఎంత బావుండేది? ఇప్పుడు తాళపుచెవి లేకుండా ఏంచేస్తావు? నామాట విను తిరిగిరా,' అని చంద్రబింబం తనతో అంటున్నట్టుంది.

STATEMENT ABOUT OWNERSHIP & OTHER PARTICULARS ABOUT

NAVA-BHARATHI

A Literary & Cultural Telugu Monthly

FormIV (See Rule 8) The Registration of News-Papers(Central)Rules,1956

1 Place of publication	Gandhinagar, Vijayawada-2
2 Periodicity of its Publication	First week of Every month
3 Printer's Name	Sri J Radhakrishna Reddy
Nationality Indian	Address Vijayawada
4. Publisher's name	Sri J Radhakrishna Reddy
Nationality . Indian.	Address Vijayawada
5 Editor's Name	Sri J Radhakrishna Reddy
Nationality : Indian	Address Vijayawada

6 Names and Addresses of Individuals who own the News-Paper and Partners or Share - holders, holding more than one per-cent of the total capital

Names	*Addresses* ·
SRI CHADALAVADA PITCHAYYA.	VIJAYAWADA.
SRI J. RADHAKRISHNA REDDY.	VIJAYAWADA.

I, J Radhakrishna Reddy, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief

J. RADHAKRISHNA REDDY
Signature of publisher

1—11—'59

ఉపనిషద్వాక్యములు

శ్రీ ధూళిపాళ రామచంద్రశాస్త్రి

"ఓం శీక్షాంవ్యాఖ్యాస్యామః। వర్ణస్స్వరః। మాత్రాబలమ్। సామసంతానః। ఇత్యుక్త శ్శీక్షాధ్యాయః॥"

శిక్ష్యంతే వేదనీయత్వేన ఉపదిశ్యంతే స్వర వర్ణాదయః యాత్రాఽసౌశిక్షా. శిక్షైవశీక్షా. అను వ్యుత్పత్తిగల శీక్షాశబ్దమునకు స్వరవర్ణాద్యుప దేశకమగు పదకదంబక మర్థము ఈ విధ మగు శిక్షను "వ్యాఖ్యాస్యామః" సమగ్రముగ చెప్పగలము అని యర్థము. ఈపదకదంబ కము. వర్ణః, స్వరః ఇత్యాదికము వర్ణః-అకా రాదివర్ణసమూహము. స్వరః-ఉదాత్తానుదాత్తాది స్వరములు. మాత్రా-హ్రస్వదీర్ఘాదికము బలమ్, స్పృష్టము ఈషత్స్పృష్టముమొదలగు ప్రయ త్నములు. సామ-అధితమగు ద్రుతభావమును, అధికమగు విలంబనమును వదలి నియతమగు కాలమున వర్ణముల ఉచ్చారణము సంతానః- పూర్వోత్తర వర్ణములకు పరసన్నికర్షరూప మగు సంహిత. ఈ విధముగ వర్ణము, మొద లగు సంతానాంతములగు ఆరును శాస్త్రనియ మితలక్షణములతో గూడిన రీతిని పఠించదగిన వని భావము.

ఇత్యుక్తశ్శీక్షాధ్యాయః - శిక్షారూపమగు అధ్యాయ మీవిధముగ జెప్పబడినదని భావము

ఈ యధ్యాయమునకు ప్రకరణము-శిక్షావల్లి యందు మొదటి యనువాకముచే నుపదిష్టమగు మంత్రజపముచే విఘ్నోపశాంతి నొందిన పురుషునికి ఉపాసన, బ్రహ్మావబోధముకొరకు తత్ప్రతిపాదకమగు గ్రంధము చెప్పదగి యున్నది. ఆ గ్రంధము అర్థజ్ఞానప్రధానమగు టచే పారమందు యథాశాస్త్రమగు అర్థావ బోధము నపేక్షించి స్వరవర్ణాదులు శాస్త్రీయ విధానమున శిక్షింపదగియున్నవి. అందు నిమి త్తము శీక్షాధ్యాయము ప్రవర్తించినది. స్వరా దుల వ్యత్యాసముచే మంత్రములు విపరీతార్థ మును బోధించి ప్రకృతమున కనుపయుక్త ములై అనర్థావహములగును. ఈవిషయమును ఈ న్యాయము స్పష్టముగ నిరూపించినది

"శ్లో॥ మంత్రో హీనస్స్వరతో వర్ణతోవామిథ్యా ప్రయుక్తోనతమర్థమాహ। సవాగ్వజ్రోయజ మానం హినస్తియథేంద్రశత్రుస్స్వరతోఽప రాధాత్"

గనుక విద్యాకాండమున వాక్యములు శాస్త్రవిరుద్ధమగు యర్థమును బోధించినయడల ప్రసక్తమగు వైకల్యము అపరిహార్యము- గనుక విద్యయందు వైకల్యపరిహారముకొరకు యధాశాస్త్రమగు జ్ఞానమును ఉపనిషద్వాక్య ములవలన బొందుటకొరకు. ఆ వాక్యప్రవచన మున పూర్వోక్తమగు ప్రయత్నాతిశయము నభ్యసించవలయును. ఈ విషయమే శీక్షాధ్యా యమునకు పరమతాత్పర్యము-

*

అత్యధికవేగాలు - కాలభావం

శ్రీ వసంతరావు వేంకటరావు

భూమి తన అక్షంపై తిరుగుచుండడం చేతనే రాత్రింబవళ్లు కలుగుతున్నాయని పాఠశాలలో కూడా నేర్పుతారు సౌరమండల మధ్యమందున్న సూర్యుడు స్థావరంగా నున్నట్లు భావించవచ్చును, సూర్యోదయాస్తమయాలు భూభ్రమణం(Rotation) యొక్క ఫలితాలు మాత్రమే సూర్యుడుదయించే స్థానాన్ని ప్రతి ఉదయం జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆ స్థానం ఉత్తర దక్షిణాలకు మారుతుందని సులభంగా గమనింపవచ్చు దానినే 'ఉత్తరాయణం' 'దక్షిణాయనం' అంటారు. సూర్యుని చుట్టూ సంవత్సరాని కొకసారి భూమిచేసే ప్రదక్షిణ ఫలితమది. అంటే, భూమియొక్క ద్వివిధగమనాలవల్ల మనకు 'దినం' 'సంవత్సరం' అనే కాలప్రమాణా లేర్పడ్డాయని తెలిసికోగలం తనలో తను భూమి ఒకసారితిరగడానికయ్యే కాలం దినం, సూర్యునిచుట్టూ ఒక ప్రదక్షిణం చెయ్యడానికి పట్టేకాలం సంవత్సరం.

భూమిచుట్టూ నిరంతరం తిరిగే ఉపగ్రహమైన చంద్రునిమూలంగా మరొక కాలప్రమాణమైన 'మాసం' మనకు ఏర్పడింది. అమావాస్యనుండి అమావాస్యకు— అంటే భూమిచుట్టూ ఒకసారితిరగడానికి-చంద్రుడు తీసికొనే కాలమే 'మాసం.' అందుచేత, మన చాంద్రమాన ప్రకారంగా మాసంయొక్క ప్రమాణం 29 1/2 రోజులు ఈ భావంపై నేర్పడిన మాసాలు చైత్రంనుండి ఫాల్గుణం వరకు పన్నెండు ఉన్నాయి ఇవికాక, సూర్య గమనాన్ని అనుసరించి ఏర్పడిన మాసాలు పన్నెండుకూడా ఉన్నాయి భూపరిభ్రమణం వల్ల సూర్యుడు అశ్విన్యాది నక్షత్రాలలో సంచరిస్తూన్నట్లు కనిపిస్తుంది. మేషలగ్నంలో ఉదయిస్తూన్నంతకాలం మేషమాసమని ఒక నిర్ణయం ఈ విధంగా సంవత్సరాని కొకసారి ఒకచుట్టు తిరిగిన సూర్యుడు మేషం నుండి మీనంవరకు గల 12 రాశులలో చరిస్తాడు. దానిమూలంగా రాశికి సంబంధించిన మేషాది మాసాలు ఏర్పడ్డాయి ఈ విధంగా భూచంద్రుల గమనంచేత ముఖ్య కాలవిభాగాలైన రోజు, మాసం, సంవత్సరం ఏర్పడ్డాయి.

మన భూలోకంలో వలె ఇతర గ్రహాలైన శుక్ర కుజ గురాది లోకాలలో సైతం వారి వారి కనువైన కాలమానా లుంటాయని ఊహించుకోగలం. కుజలోకంలో గాని శుక్రలోకంలో గాని జీవులుంటే వారి కాలమానాన్ని వారు పాటించక తప్పదు కుజలోకంలో దినం మన రోజుతో, రమారమి, సరిపోయినప్పటికీ కుజుని సంవత్సరం మన 22 నెలలంత దీర్ఘమైంది ఈ విషయాలకి అంతర్గ్రహయాన దినాలలో చాలా ప్రాముఖ్యముంది భూమిని విడిచిపెట్టి గ్రహాంతరాళంలో జొరబడడం నేడు సాధ్యమౌతూంది రష్యనులు ప్రయోగించిన రెండవ లూనిక్ నేరుగా చంద్రుని ఢీకొంది. తదనంతరం ప్రయోగింపబడిన మూడవలూనిక్ చంద్రుని చుట్టూ తిరిగి, మనకి కనిపించని చంద్రుని వెనుకభాగం యొక్క ఫొటోల్లను తీసి భూమికి వాటినందించింది కొద్దిమాసాలలోనే చంద్రుని చేరుకోగల రాకెట్లను మనుష్యులతో పంపడానికి యోచిస్తున్నట్లు వార్తలువస్తున్నాయి అందుచేత చంద్రునిలో కాలమాన విషయం యోచిస్తే, భూమితో సూర్యప్రదక్షిణాలు చేస్తూన్న చంద్రునిలో సంవత్సరప్రమాణం మన సంవత్సరప్రమాణమంత ఉంటుందని గమనించగలం. చంద్రుని దినం మాత్రం మననెలకు సమానం భూలోకంలో నున్న జీవులందరూ చంద్రుని చూడగలరు కాని, చంద్రలోకానికంతటికీ భూమి కనిపించదు ఇదొక విశేషం

దానికి కారణముంది చంద్రుడు తనలో

తను ఒకసారి తిరగడానికి పట్టేకాలంలోనే భూమిచుట్టూకూడా ఒక ప్రదక్షిణంచేస్తాడు. అందుచేత, చంద్రగోళంలో, రిమారమి, ఒక అర్ధభాగమే మనవైపు శాశ్వతంగాతిరిగి ఉంటుంది. మిగిలిన గోళార్ధంలో - నిజానికి మనకు కనిపించని భాగం ఐదింట రెండు వంతులు మాత్రమే- ఏముందో మొన్నటి వరకు మనకు తెలియదు. మూడవ లూనిక్ తీసిన ఫొటోగ్రాఫులను చూచి దానిస్వరూప స్వభావాలను ఊహించవలసిందే. అయితే, దీనివల్ల చంద్రలోకంలో నున్న జీవులందరూ జీవులుంటే- భూమిని చూడలేరు. మనవైపు తిరిగిన భాగంలోనున్న వారికి భూమి కని పిస్తుండగా మిగిలినవారికి భూగోళం కనిపించదు చక్కటి కాంతివలయంతో భాసించు భూమిని చూడాలంటే చంద్రవాసులలో కొందరు ప్రత్యేకంగా ఒక అర్ధభాగంలోనికి రావాలి అట్టి పరిస్థితి మనలోకంలోసైతం, కొన్ని నక్షత్రాల సందర్భంలో లేకపోలేదు భూగోళపు దక్షిణార్ధమందు నివసించువారికి అందులో దక్షిణ ధ్రువప్రాంతంలో నివసించు వారికి, ధ్రువనక్షత్రంగాని, సప్తమహర్షి మండలంగాని కనిపించవు. వాటిని చూడా లంటే ఉత్తరార్ధం లోనికి ప్రయాణం చేయ వలసిందే.

భూమియొక్క ఆత్మభ్రమణంవల్ల కలుగు తూన్న సూర్యోదయం వివిధప్రదేశాలలో వివిధ కాలాలందు సంభవిస్తుందని ఊహించడం కష్టంగాదు. గోళంవలె నున్న భూమి మీద ఉత్తరధ్రువాన్ని దక్షిణధ్రువంతో కలుపుతూ 360 రేఖాంశలను గీయవచ్చును ఒకసారి తనలో తను తిరగడానికి భూమి 24 గంటలు తీసికొంటుంది, అంటే, ఒక రోజులో 360 రేఖాంశలూ సూర్యరశ్మిలో ఒకసారి తిరుగుతాయి. దీని పర్యవసానంగా ఒక రేఖాంశమీద నున్న గ్రామంలో సూర్యోదయమైన 4 నిమిషాలకి దానికి పడమట నున్న రేఖాంశపైనున్న గ్రామంలో సూర్యోదయమౌతుంది అంటే, ఏ గ్రామంలో నైనా, రేఖాంశపరంగా నున్న స్థానాన్ని బట్టి, సూర్యోదయసమయం నిర్ణయింపబడుతుంది దీనిమూలంగా వివిధకాలభావాలు జనించేయి యావత్ ప్రపంచానికి ప్రమాణమైనది గ్రీన్విచ్ మీన్ టైమ్ (G. M. T) ప్రతిదేశానికిఒక్కొక్క ప్రమాణకాలముంది మన దేశానికి ఇండియన్ స్టాండర్డ్ టైమ్ (I. S. T.) ప్రమాణమైంది మన దేశానికి గ్రీన్విచ్ పడమటగా నుండబట్టి G. M. T కంటె I. S. T. అయిదున్నర గంటలు ముందుంటుంది. మాస్కో కాలమానానికి మన ప్రమాణకాలం రెండున్నర గంటలు ముందుంటుంది. ఇట్టి ప్రమాణకాలం కాక ప్రతి స్థలానికీ స్థానికకాలం (Local time) ఉంటుంది

ఏక్షణమందైనా కొన్ని స్థలాలలో సూర్యోదయమౌతూంటే, కొన్ని స్థలాలలో సూర్యాస్తమయమౌతూంటుందని, మరికొన్ని స్థలాలలో మిట్టమధ్యాహ్నం, కొన్ని ఇతరస్థలాలలో నడిరేయి అవుతూంటుందని స్పష్టమే. సామాన్యంగా ఈ విషయాని కంత ప్రాధాన్యంలేదు మనకు మధ్యాహ్న మైనప్పుడు మధ్య అమెరికావాసులకు అర్ధరాత్రి అవుతుందని ఊహించుకొనడం కంటె విశేషం లేదు మన ప్రయాణసౌకర్యాలు మందంగా నున్నంతవరకు ఎక్కడ ఎప్పుడు ఏ విధంగా నున్నా మనకి ఇబ్బందిలేదు. కాని గంటకు వెయ్యిమైళ్లూ, రెండువేలమైళ్లూ వేగంతో విమానాలు ప్రయాణం చేసినప్పుడు మన కాలభావం కొంతవరకు అస్తవ్యస్తమౌతుంది అమెరికన్ జెట్ విమానాలు గంటకి 1400 మైళ్ళ వేగాన్ని సాధించేయని ప్రకటించేరు అట్టి సందర్భంలో గంటకి 2000 మైళ్ల వేగంతో ప్రయాణించగల విమానాలు మునుముందు రావచ్చు స్వయంచోదిత రాకెట్లు గంటకు 18,000 మైళ్ళను అందుకొన్నాయి, అవి స్పుత్నిక్‌లు, ఎక్స్ప్లోరర్లూ భూమిని త్రెంచికొనిపోయిన లూనిక్‌లు, పయనీయర్లు గంటకు 25,000 మైళ్లవేగాన్ని

అందుకొన్నాయి. ఈ విపరీతవేగాలు మన కాలభావంపై ఎట్టిప్రభావాన్ని వహిస్తాయో గమనించాలి

గంటకు వెయ్యిమైళ్ళ వేగంతోపోతూన్న జెట్ విమానంలోనున్న యాత్రికుడు బయలుదేరుతున్న సమయాన వాచీ చూచుకొన్నాడు 6 గంటలైంది అప్పుడు అరుణకిరణాలతో భానుడుదయిస్తున్నాడు. ఆ విమానం పడమట ముఖంగా పోతూంది, భూమధ్యరేఖకు కొద్దిగా ఉత్తరాన సమాంతరంగా ప్రయాణంచేస్తూంది ఒకగంట తరువాత తూర్పునచూస్తే సూర్యుడుదయిస్తూంటాడు, యాత్రికు డాశ్చర్యపోతాడు తన వాచీప్రకారం మరొకగంట గడచిన తరువాత ఆకాశాన్ని చూచినా ఉదయిస్తూన్న సూర్యబింబాన్నే చూపు ఎదుర్కొంటుంది తరువాత మరెప్పుడు చూచినా వానికి బాలభాస్కరుడే కనిపిస్తాడు పదకొండున్నర గంటలయేసరికి తనకి ప్రక్కగా లండన్ పట్టణం కనిపిస్తుంది. కాని సూర్యుడు ఆకాశయానం చేస్తూన్నట్లేలేదు, అప్పుడుకూడా ఎర్రగానున్న రవిబింబమే కనిపిస్తుంది. మధ్యాహ్న మార్తాండుడు ఏమైనట్లు? ఈ పరిస్థితి చాల విపరీతంగా స్ఫురిస్తుంది కాని, కొద్దిపాటి యోచనతో నిజస్థితిని గ్రహిస్తాడు తను అనూరుడు? ఉదయభానునితో నిత్యముండడమేకాని తనకు సూర్యాస్తమయం లేదు, సూర్యగమనమే లేదు' ఏపతివ్రతాతిలకమైనా సూర్యగమనాన్ని స్తంభింపజేసిందా అనిపించవచ్చు. దానికి కారణం తన గమనమే భూమి ఎంతవేగంతో తూర్పువైపు తిరుగుతూందో అంతవేగంతోనే తను కూడా పడమటవైపు గమిస్తున్నాడు. అందుచేత, తనకి సూర్యునికి మధ్య సాపేక్షచలనం లేదు పడమటకు గమిస్తూన్నట్లు ద్యోతించు సూర్యవేగంతో తనవేగం సమానం ఈవిషమస్థితిలో సూర్యస్థానాన్నిబట్టి వేళను నిర్ణయించే అవకాశంలేదు.

తనవాచీ సరిగ్గా పనిచేస్తూన్న మేరకు కొంత నయమే. కాని, దురదృష్టవశాత్తు వాచీ ఆగిపోయింది ఇంట్లో ఉంటే ఏ పొరుగింటి గడియారాన్ని చూచికాని, ఆకాశవాణి ప్రసారంచేయు టైమ్ సిగ్నల్స్ బట్టి కాని తన వాచీని దిద్దుకోవచ్చు రాకెట్లో రేడియోకూడా పనిచేయడం మానివేసింది. అప్పుడు 'కిం కర్తవ్యం?' అని ప్రశ్న వైమానికునికి వాచీలేదు విద్యుదయస్కాంతతరంగాలను అర్థిద్దామంటే రేడియో మూగపోయింది సూర్యస్థానాన్ని ఆకాశంలో గమనించి వేళ నిర్ణయిద్దామంటే సూర్యుడు గమించడమే మానివేసేడు అలవాటైన పద్ధతులలో వాచీని దిద్దుకోలేడు, వేరొకమార్గాన్ని కనిపెట్టాలి. భూమిచుట్టూ తిరుగుతూంటే వేర్వేరు ప్రదేశాలను వేర్వేరు కాలాలలో రాకెట్ దాటుతుంది సూర్యోదయంతో కలకత్తాలో బయలుదేరిన యాత్రికుడు బొంబాయి, మస్కట్, మక్కా, ఆఫ్రికాలోని టార్సోపర్వతాలు, ఫ్యూర్టోరికో, హవానా, మెక్సికో, హొనులొలు, కెరొలిన్ ద్వీపాలు, కాంటన్, రంగూన్ లను దాటి ఒక్కరోజులో తిరిగి కలకత్తా చేరుకొంటాడు **I. S. T.** ని ఆధారంగా చేసికొని ఏప్రదేశాన్ని దాటినప్పుడు ఎంత వేళ ఔతుందో గమనించి, ప్రదేశానికీ—వేళకీ సంబంధం ఏర్పరుచుకోవచ్చు ఆకాశంలో తన స్థానానికీ, ఆ క్షణాన్న కలకత్తాలో అయేవేళకి గల సంబంధాన్ని రేఖాచిత్రంగా నిరూపించుకోవచ్చు కాని, ఎన్నిరోజులు గడిచేయో చెప్పుకొనడానికి మరొకవిధానం కనిపెట్టాలి అదొక విచిత్రావస్థ

మరొక యాత్రికుడు గంటకు రెండువేల మైళ్ళ వేగంతో గమించు రాకెట్లో, మొదటి యాత్రికుని విధంగానే, ప్రయాణం చేస్తున్నాడనుకొందాం అతని గమ్యస్థానం లండన్. మనదేశంలో ప్రొద్దుట భోజనంచేసి మధ్యాహ్నం ఫలాహారం చేసి మన కాల

మానం ప్రకారం రెండు గంటలకి బయలు దేరేడు మూడుగంటల కాలం ప్రయాణంచేసి లండన్ చేరుకొన్నాడు అప్పటికి లండన్ కాలమానం ప్రకారంగా ఉదయం 11 1/2 గంటలయింది. వెళ్లగానే ఫలహారంచేసి మరి కొంత సేపటికి భోజనం చేసేడు ప్రయాణ సమయంలో ఒక విచిత్రాన్ని గమనించేడు. తను బయలుదేరు సరికి పడమటవైపు నున్న సూర్యబింబం తను ప్రయాణం చేస్తూన్న కొద్దీ తూర్పువైపు గమిస్తూ, గమ్యస్థానాన్ని చేరేసరికి నడిమధ్యకి తూర్పుగానే ఉంది జీవితంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని పరిస్థితి, సూర్యుడు పడమటనుండి తూర్పుకి గమించడం! ఆశ్చర్యం!

అంతేకాదు. అతను దేశంలో చేసిన ప్రయాణం, అతనిని కాలంలో వెనుకకు తీసికొని పోయింది ఒకేరోజున మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరిన తను, ఆరోజే ఉదయం 11 1/2 గంటల కాలాన్ని చేరుకొన్నాడు సామాన్యంగా మన అనుభవంలో కాలం ఎల్లప్పుడూ ముందుకిపోతుంది. మధ్యాహ్నం రెండుగంటల తరువాత నాలుగు గంటలలో సూర్యుడస్తమించాలి కాని, దానికి వ్యతిరేకంగా మధ్యాహ్నం రెండు గంటలనుండి రెండున్నర గంటలు కాల వాహినిలో తిరోగమించి, ఆ యాత్రికుడు ఆరోజు మట్టుకు పగటిపూట 17 1/2 గంటల కాలం గడిపేడు ఎట్లంటే, సూర్యోదయమైన 8 గంటల తరువాత బయలుదేరి, మూడు గంటలు ప్రయాణంచేసి, లండన్‌లో సూర్యాస్తమయంవరకు 6 1/2 గంటల ప్రొద్దు గడిపేడు అంటే, పన్నెండుగంటల పొడవుగల పగటివేళను 17 1/2 గంటలవరకూ పెంపొందించుకొన్నాడు అంతేకాక, లండన్‌లో ఒక భోజనం, ఒక ఫలహారం అదనంగా చేసేడు దినాన్ని పొడిగించుకొనడం,ఎక్కువ ఆహారాన్ని భుజించడం రెండూ లాభదాయకాలే.

ఈ విధంగా, అధిక వేగాలకు మన జీవితాలపైని, కాలభావం పైని ఎట్టి ప్రభావం గలదో విమర్శిస్తే ఆశ్చర్యకరమైన నవీన విషయాలు ఎన్నెన్నో బయల్పడతాయి.

*

విశ్వనాథ మధ్యాక్కఱలు

నందమూరు శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౨

విషయమ్ములం గూర్చి సృష్టిఁగరణ ప్రవృత్తి ఘటిల్లు
విషయమ్ము లేకుండ నాకుఁ గరణప్రవృత్తి ఘటిల్లు
విషయమ్ముగా నున్న దిద్ది సంతాన వేణు గోపాల
విషయినై నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

తెలివినాఁ జను వస్తువునకు రూప మేతీరునఁ గలుగు
తెలివికిఁ దన్నుఁదాఁ దెలిసికొనియెడి తీరును గలదె
తెలివికిఁ ద్వైతంబులేని కాఁగడా తీరగు కాంతి
వెలయునే నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

ఇది యింక నాకు నున్నదట గ్రహబల మిట్లు చేయించు
వదలవచ్చును నేను దీని నేటికి వదలగా వలయు
వదలుదు వదలి పైనేమి చేయఁగావలె నినుగుండె
వెదనాటి నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

నను నేన రక్షించుకోను జాలను నా తనూజులను
వనితను రక్షింపనెంచెదను భాగ్యవంతుఁడ వీవు
నినుఁగూడ రక్షింపనెంచఁ జేతకానితనంబు నెపుడు
వినినావొ నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

మును వశిష్ఠమహర్షి సూర్యమండలమున కేగినాడు
తనర నేడెవ్వాడొ చంద్రమండలాంతము పోవగలడు
కనుకని నాకబ్బురమ్ము లేదు నిఁగాంచెదు కోర్కె
వెనవడి నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

సర్వథా చచ్చెడివారు సర్వదా చచ్చుచునున్నారు
ఉర్వియు మిగిలిన వారిదన్నట్లున్నది స్వామి!
గర్గాది ముఖ్యమ్ముగాని మృత్యువుకాదు గర్వములు
వేర్వేలు నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

ఈ పేరుతోనున్న ఈ శరీరము నిదియొక వ్యక్తి
ఆపదయో సౌఖ్యమో ప్రతిష్ఠయో యప్రతిష్ఠయొ దు
రాపమో భోగమో శత్రువులో నాకివన్ని యేలాగ
వీపాల నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

ఒగినా శరీరమ్ము కట్టవలె పోవుచున్నది గాని
సెగలేని యూహలుమాత్ర మెప్పుడు చేయుచున్నదియ
సెగ చంపితిని దీనియందు నితరమో సెగ తాకకుండ
బిగియింపు నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

ఈ మనస్సూరకో దూరకోక పోనిమ్ము నాకేమి
ఈ మేను చలియించుచుండెఁ జలియింపనిమ్ము నాకేమి
ఈ మనోదేహముల్ జంటగాఁ బోవు నివి శుకబుషిగ
వీమేయ నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

నన్నిందుకా స్వామి! యిందులో దించినావు పెఁదవ్వ
చన్నంతమాత్రాన నిన్ను విడిచెడు జాడ్యంబులేదు
మున్నెట్లొ అట్టులే నొసఁటి ముంగిటి ముగ్గువై నిలుము
వెన్నుదా! నందమూర్నిలయ! సంతాన వేణు గోపాల!

*

సామాన్యములు

బెర్ట్రండ్ రసెల్

అనువాదం · జి. ఎస్. ఎన్.

౯

వెనుకటి యధ్యాయము చివర, సంబంధములని వ్యవహరింపబడు వానికొక ప్రత్యేకమైన యునికి గలదనియును, నది భౌతికవస్తువుల యునికికిని, మనస్సుల యునికికిని, యింద్రియార్థముల యునికికిని ఒక విధముగా విభిన్నమైనదనియును, మన కవగతమైనది ఈ యధ్యాయమున, నిట్టి యునికి యెట్టిదో, యిట్టి యునికిగల వస్తువులేవో యను విషయములను- మనము పర్యాలోచింపవలసి యుండును. ఈ తరువాత సమస్యతో మన చర్చను ప్రారంభింతము.

మనకు ప్రస్తుతము చర్చనీయముగు నంశము చాల పురాతనమైనది. ఏలన ప్లేటో యీవిషయ చర్చను తొలిసారిగా తత్త్వశాస్త్రమున ప్రవేశపెట్టెను ప్లేటో భావవాద మీ సమస్యను పరిష్కరించు విషయమున చేసిన ప్రథమ ప్రయత్నము నా యభిప్రాయము ననుసరించి యీ ప్రయత్నము చాలవఱకు సఫలమైనదనియే చెప్పవలయును. ఈ క్రింద ప్రతిపాదితముగు సిద్ధాంతము చాల భాగము ప్లేటోదే కాని దేశకాలానుగుణముగ నందు కొన్ని మార్పులు ప్రవేశపెట్టబడినవి.

ప్లేటోకి సమస్య యిట్లు బయలుదేరినది ధర్మమనగా నేమో పర్యాలోచన చేయుదము ధర్మమనునది కర్మాశ్రయమైనట్లు తోచును. ఇది ధర్మకార్యము; అది ధర్మకార్యము అట్లే వేఱొకటి ధర్మకార్యము. వీని యన్నింటికిని సర్వసాధారణమై యొప్పులక్షణమే ధర్మమని చెప్పవచ్చును అట్లే తెలుపు అను వేరొక శబ్దమును తీసికొందము తెల్లని వస్తువులన్నింటిలోను నీ తెలుపు అను సామాన్య లక్షణమొకటి గలదు. కావున సర్వవస్తువులకును సాధారణమై యెప్పు నీ ప్రధాన తత్త్వమునకే ప్లేటో భావమని పేర్వెట్టెను. ఆతని దృష్టిలో నీభావములు మనోగ్రాహ్యములైనను, మనోగతములని యనుకొనుటకు వీలులేదు. ప్రధాన తత్త్వమగు ధర్మమును, ధర్మకార్యమును నెన్నడు నొక్కటి కానేరవు. ప్రపంచమున కన్పించు ననేక ధర్మకార్యములకు సాధారణమై, తదతీతమై యొప్పునదే ధర్మము. అదియొక ప్రత్యేకమైన వస్తువుకాకపోవుటచే, నింద్రియ గోచరమగు ప్రపంచమున దానికి స్థానములేదు. అంతియకాక యది యింద్రియ గోచరములగు వస్తువులవలె క్షణికమై, యెప్పటికప్పుడు మారునది కాదు. అది చిరంతనము. పరివర్తనాసహము. అవినాశి.

కావున ప్లేటోయింద్రియాతీతమగు ప్రపంచము నొకదాని నంగీకరింపవలసి వచ్చినది. అదియొక మార్పులేని భావజగత్తు అదియే యింద్రియ గోచరమగు నీ ప్రపంచమునకు తనకు లభించిన సత్యము నాభాసమాత్రముగనైనను అందించును ఏలన, ఇంద్రియగ్రాహ్యమగు ప్రపంచమునకు సంబంధించిన విషయములను గూర్చి చెప్ప ప్రయత్నించునపుడు, భావములద్వారానే వానిని వ్యక్తముచేయ వీలుపడును ఇట్టి వ్యాఖ్యానమే అతీంద్రియ వాదమునకు త్రోవదీయును. అతీంద్రియమగు సమాధిస్థితిలో నాభావములను యింద్రియగోచరములగు వస్తువులవలెనే దర్శింపవచ్చును ఆ భావములు మారవాతీతమగు ప్రపంచమునకు సంబంధించినవిగా మనమూహింపవచ్చును. అతీంద్రియవాదమునకు సంబంధించిన యీపరిణామములు చాల సహజమైనవి ఆ వాదమునకు ప్రాతిపదికతర్కములో గలదు. కావున నీ భావములకు ప్రాతిపదికగా నుండు హేతుపద్ధతినే మనము పర్యాలోచింపవలసి యుండును.

భావమను పదమునకు కాలక్రమమున ననేకములైన యర్థములేర్పడినవి. కాని ప్లేటో 'భావములు' కన్వయించునపు డవి తప్పుత్రోవల బట్టించును ప్లేటో యుద్దేశ్యమును సరిగా వ్యక్తము చేయవలెనన్న భావమన్న పదమునకు బదులు సామాన్యమని మనము ప్రయోగించుట మంచిది. ప్లేటో యుద్దేశ్యము ననుసరించి సర్వసామాన్య లక్షణమగు నీ ప్రధానతత్త్వము, ఇంద్రియ గ్రహణముచే గోచరమగు ప్రత్యేకవస్తువుల కతిరిక్తమై యొప్పుచున్నది ఇంద్రియ గ్రహణమున గోచరించుదేనినైనను, లేక అట్టి మరిదేనినైనను విశేషమను (Particular) పదమున వ్యవహరింతము దీనికి ప్రతిగ ననేక విశేషములకు సర్వసాధారణములైన వానిని సామాన్యములని

వ్యవహరింతుము దీనిని, ధర్మము, తెలుపు అను సామాన్య సంబంధసూచకములగు పదములను ధర్మకార్యము, తెల్లని వస్తువులనుండి వేఱుచేసి చూచినపుడే మన మవగతము చేసికొనగల్గితిమి.

మనము కొన్ని సామాన్య శబ్దములను పరిశీలించునపుడు, స్థూలముగా చెప్పవలెనన్న, సంజ్ఞావాచకశబ్దములు విశేషములను సూచించును విశేష్య విశేషణ ప్రత్యయా క్రియాపదములు సామాన్యములను సూచించును. సర్వనామములు విశేషములను సూచించును. కాని వానిలో కొంత యస్పష్టతగలదు. అవి యెట్టి విశేషములను సూచించునో సందర్భమును బట్టి గాని పరిస్థితులను బట్టిగాని మనకు నవగతమగును 'ఇప్పుడు' అనుపదము విశేషమును- అనగా ప్రస్తుతకాలమును సూచించును. కాని సర్వనామములవలె, నదియొక యస్పష్టమైన విశేషమును సూచించును. ఏలన ప్రస్తుతకాల మెల్లప్పుడును మారుచుండును.

సామాన్యమును, సూచించు పదము కనీస మొక్కటియైనను లేనిదే వాక్యనిర్మాణము కష్టమగును 'నాకు ఇదియనిన ఇష్టము' అన్న వాక్యము ఇట్టి వాక్యమునకు చాల దగ్గఱగా నుండును కాని ఇచ్చట నిష్టమనుపద మొక సామాన్య సంబంధమును సూచించును. నాకితర వస్తువులనిన ఇష్టముండవచ్చును. ఇతరులకు కొన్నివస్తువు లిష్టముండవచ్చును. కావున ప్రత్యయములన్నింటిలో సామాన్యములుండును. సత్యములకు సంబంధించిన జ్ఞానమునకు సామాన్యములను గూర్చిన జ్ఞానమవసరము.

కోశములో కన్పించు పదములన్నియును సామాన్యమును సూచించునని తెలిసియు, కొందరు తత్త్వశాస్త్ర జిజ్ఞాసువులను తప్పించి యెల్లఱును సామాన్యములనునవి యున్నవని గూడ గుర్తింపకుండుట విస్మయకరముగా నున్నది. సామాన్యముగా నొకవాక్యములో విశేషములను సూచింపని పదములను మనమంత పట్టించుకొనము. సామాన్యమును సూచించు పదమును మనము తప్పక గుర్తింపవలసివచ్చినచో నా సామాన్యము క్రిందకు వచ్చు విశేషములలో నొకదానిని సూచించుపదముగా దానిని భావింపవచ్చును. ఉదాహరణమునకు ఒకటవ ఛార్లెస్ శిరస్సు ఖండింపబడెనను, మాటను విన్నప్పుడు మనకు వెంటనే ఆలోచనలో మెదలునవి ఒకటవ ఛార్లెస్, అతని తల, అతని శిరస్సును ఖండించుటయను వ్యాపారము అనునవి.ఇవియన్నియు

విశేషములు. కాని సామాన్యములగు శిరస్సు, ఖండించుట యనువాని విషయమై మనమంతగా చర్చింపము. అట్టి పదములు మనకసమగ్రములుగను, నర్థరహితముగను కన్పించును. వానిని గురించి యిదమిద్ధమని చెప్పగల్గుటకుపూర్వము, అవి యేసందర్భమున ప్రయోగించినది తెలిసికొనవలసిన యవసరమున్నట్లు కన్పట్టును కావున నీ సామాన్యములను గూర్చిన చర్చను, తత్త్వశాస్త్రమట్టి చర్చావసరము నుద్ఘాటించు ఓఱకును మనము విరమింపవచ్చును

తత్త్వవేత్తలలోగూడ, స్థూలముగా జూచినచో, విశేష్యవిశేషణములచే సూచింపబడిన సామాన్యములు గుర్తింపబడినవి కాని క్రియా ప్రత్యయములచే సూచింపబడిన సామాన్యములను తత్త్వచింతకులలో నెవ్వరును పట్టించుకొనరైరి ఇది తత్త్వశాస్త్రాభివృద్ధికి తీరని నష్టమును గల్గించెను. స్పినోజా కాలమునుండియు తత్త్వశాస్త్రము ప్రధానముగ దానిచేతనే(విశేష్య విశేషణములచే సూచింపబడు సామాన్యములనే) రూపొందింపబడుచున్నది ఇది యెట్లు జరిగినదో యీ దిగువ గమనింపవచ్చును. మొత్తము మీద చెప్పవలెనన్న, విశేషణములును, జాతి వాచక శబ్దములును, వస్తువుల గుణధర్మములను సూచించును క్రియాప్రత్యయములట్లు కాక రెండుగాని యంతకంటె నెక్కువ వస్తువుల నడుమగాని యున్న సంబంధమును సూచించును. కావున వాక్యములోని ప్రతి ప్రత్యయమును ఒక వస్తువునకు గల ప్రత్యేకధర్మముగా గురుతింపబడినదేగాని రెండుగాని యంతకన్న నెక్కువ వస్తువుల నడుమగాని యున్న సంబంధమును సూచించునవిగ భావింపబడలేదు దీనిని బట్టి వస్తువుల నడుమగల సంబంధమును సూచించునవేవియును లేవనియే నలువురిలో నలిగిన యభిప్రాయము కాబట్టి ప్రపంచమున నున్న వస్తువొకటియే యైయుండవలెను లేదా ప్రపంచమున ననేక వస్తువులున్నను వాని నడుమ పరస్పర సంబంధముండక పోవలయును ఏలన వస్తువులనడుమ సంబంధమును అంగీకరించినచో, సంబంధములను ప్రత్యేకముగా గురుతింపవలసిన యావశ్యకత యేర్పడును మరి వారి దృష్టిలో సంబంధములనునవి యుండనే యుండవుగదా.

ఇందులో మొదటి యభిప్రాయమును ఏక పదార్థ వాదమందురు దీనినే స్పినోజా, బ్రాడ్లీ తదితర తత్త్వచింతకులు బలపరతురు. రెండవది

ప్రత్యేక వస్తువాదము దీనిప్రకారము విడివిడిగా నున్న వస్తువులలో ప్రతిదియును ఛేదించుటకు గాని ఛేదించుటకుగాని వీలులేని వస్తువు కాని నేటి తాత్త్వికవిధానమునకు ప్రసిద్ధి తగ్గిపోయి నది ఈ రెండు తాత్త్విక సంప్రదాయములును విశేష్య విశేషణముల వలన సూచింపబడిన సామాన్యము లకే విశేషప్రాధాన్యమిచ్చినవి. కాని క్రియాప్రత్యయములచే సూచింపబడు సామాన్యములకు ప్రాధాన్యమీయలేదు

సామాన్యము లనువాని యస్తిత్వము నంగీక రింపకున్నచో, విశేష్య విశేషణములచే సూచింప బడు గుణములు కలవని గట్టిగా నిరూపించు టకు వీలులేకపోవచ్చును కాని క్రియాప్రత్యయ ములచే సూచింపబడిన సామాన్యములను-సంబం ధములను కాదనుటకు వీలులేదు ఉదాహరణ మునకు, 'తెలుపు' అను సామాన్యసంబంధ సూచకమగు పదమును గూర్చి విచారింతము. విశేష్య విశేషణములచే సూచింపబడిన సామా న్యములను మన మంగీకరించినచో- వస్తువులు తెల్లగానున్నవి ఏలన వానికితెలుపు అనుగుణము కలదని వాదింతుము దీనిని హ్యూమ్, బెర్క్లీ, తదితరులగు ననుభవవాదులు, చాల కష్టపడి, ఖండించిరి చివఱకు నిర్దేశ్యభావము లనునవి గూడ లేవని వాదించువరకును వారి ఖండనము సాగినది.

మనము 'తెలుపు'ను గూర్చి విచారించు నపు డొకానొక తెల్లనివస్తువు రూపమొకటి మన స్సుకు గోచరమగును. తెల్లనైన మరి యేయితర వస్తువునను లేనట్లు కన్పించు లక్షణముగల దేనినిగూర్చియు నిర్ణయమును చేయడమే యీ ప్రత్యేకోదాహరణమును బట్టి 'తెలుపు' ను ఊహింతుము. మన స్తత్త్వమును పరిశీలించినచో, నిది చాలవఱకు నిజమే యనిపించును క్షేత్రగణి తములో, త్రిభుజములను గూర్చిన యొక లక్షణ మును మనము నిరూపింపగోరునపుడు, మన మొక త్రిభుజమును గీసి, దానినిబట్టి, తదితర త్రిభుజములలో లేని లక్షణము, అందు కన్పింప కుండునట్లు తగు జాగ్రత్తపడుచు, నిరూపణ చేయుదుము. గణితశాస్త్రమును క్రొత్తగా నధ్య యనము చేయువాడు, పొరపాటుపడకుండ నుండవలెనన్న, వేర్వేరు త్రిభుజములను గీయ వలయును అట్లు చేసినచో తాను ప్రతిపాదించు హేతువు తదితర త్రిభుజములన్నింటికి నన్వ యించునో లేదో సరిచూచుటకు వీలగును కాని ప్రత్యేకమగు వస్తువును చూడగనే ఇది త్రిభుజ మని గాని ఇది తెల్లనివస్తువని గాని తెలిసికొనుట యెట్లని ప్రశ్న రానేవచ్చును ఈ 'తెలుపును' త్రిభుజత్వమును అంగీకరించుట మనకభిమతము కాకున్నచో, ఏదోయొక తెల్లని వస్తువునుగాని ఒక త్రిభుజమునుగాని తీసికొని యింకొకవస్తు వుకు దాని పోలికయున్నచో నప్పుడది త్రిభుజ మనియో తెల్లని వస్తువనియో యంగీకరింపవలసి యుండును కాని అప్పుడు రెండింటికి నడుమ గల పోలికయే సామాన్యము కావలసివచ్చును. ప్రపంచమున తెల్లనివస్తువు లనేకముండుటచే, ప్రత్యేకముగా ననేక తెల్లనివస్తువుల జంటల మధ్య పోలిక యుండవలయును ఇదియే సామా న్యము లక్షణము ప్రతి జంటకును ఒక ప్రత్యేక మైన పోలికగలదని వాదించి యుపయోగము లేదు. అప్పుడీ పోలికలనడుమ గూడ పోలిక యున్నట్లంగీకరింపవలసి వచ్చును. చివఱకెట్లు యినను పోలికనే సామాన్యముగా గుర్తింపవలసి వచ్చును. ఇట్టి సామాన్యము నంగీకరించుటకు చాలినంత కారణమున్నను, కొందఱు అనేక యసందర్భములగు హేతువులను ప్రతిపాదించి వాని నెదుర్కొనచూచుట యవివేకము.

ఈ సామాన్యములకు వ్యతిరేకముగా బెర్క్లీ- హ్యూమ్ బయలుదేరదీసిన వాదమునకిట్టి ఖండన ముండునని చాలమంది గ్రహింపరైరి ఏలన వారి ప్రత్యర్థులవలెనే వారు గుణములనుగూర్చి చర్చించిరి గాని సంబంధములను బొత్తుగా నుపేక్షచేసిరి కావున నిచ్చట హేతువాదులు అనుభవవాదులమీద కొంత విజయము సాధించి రని చెప్పవచ్చును. కాని సంబంధములను పూర్తిగా కాదనుటచే, హేతువాదుల నిగమన ములు, అనుభవవాదుల నిగమనముల కన్న నెక్కువగ తప్పుత్రోవ పట్టించును.

సామాన్యముల యావశ్యకతను గ్రహించిన పిమ్మట, మనము వానియునికి కేవలము మాన సికము కాదని నిరూపింపవలసి యుండును అనగా నవి కేవల మాలోచనా విషయములును, మనోగ్రాహ్యములునగుటయేకాక వానికి విభిన్న మైన యునికిగూడ గలదు వెనుకటి యధ్యాయ ముచివఱ, మనమీ విషయ మిదివఱకే ముచ్చ టించితిమి. సామాన్యములకు నెట్టి ఉనికిగలదో యన్న విషయమై ప్రస్తుతము మనము సంపూర్ణ ముగా విచారింపవలయును.

ఎడంబరో లండనుకు ఉత్తరముగా నున్నదను వాక్యమునే విచారింతము. ఇక్కడ రెండు ప్రదే ములకు నడుమ నొక సంబంధము గోచరమగు

చున్నది. మనకు దానిని గూర్చిన జ్ఞానమున్నను లేకపోయినను, సంబంధము ఉండి తీరుననుట స్పష్టము. ఎడింబరో లండన్‌కు ఉత్తరముగా నున్నదను విషయము మన తెలియకపడినప్పుడు, ఎడింబరో లండన్లతో సంబంధము గలిగిన యొక వస్తువునుగూర్చిన జ్ఞానము మనకు గలుగును. అనగా దాని నెరుగుటచేతనే యా వాక్యము లోని సత్యము నెఱుగజాలుదుమనిగాదు మరి మన మెఱుంగకపూర్వమే యథార్థమైయున్న విషయము నొకదానిని మనము తెలిసికొందుము ఎడింబరో ఉన్న భూభాగము, లండన్ ఉన్న భూభాగమున కుత్తరముగా నుండును ఉత్తర దక్షిణములను గూర్చి పరిజ్ఞానము గలిగిన వ్యక్తి యున్నను లేకపోయినను, ప్రపంచములో వానిని గుర్తించు మనస్సులున్నను లేకపోయినను, నీయునికికి క్షతిలేదు. దీనిని చాలమంది తత్త్వవేత్తలు వేర్వేరు కారణములచే నంగీకరింపరైరి. వారిలో కొందఱు కాంటు అనుయాయులు తక్కినవారు బెర్క్లీ అనుయాయులు కాని మన మీ హేతువులనీ వఱకే పర్యాలోచించి యవి యసమీచీనములని నిరూపించితిమి. కావున ఎడింబరో లండనుకు ఉత్తరముగా నున్నదన్న విషయములో మానసికమని చెప్పదగినదేదియు లేదనవచ్చును కాని యీ విషయములో - సామాన్యమగు ఉత్తరముగా అను సంబంధము గలదు ఆ విషయములో భాగమైన 'ఉత్తరముగా' అను సంబంధ వాచకశబ్దములో మనస్సునకు సంబంధించినదేమైన నున్నచో, దానిని విషయమునుండి వేఱుచేయుట సాధ్యముకాదు కావున నీ సంబంధము ఆలోచనపై నాధారపడక, ఆలోచన గ్రహించినను సృజింపలేని స్వచ్ఛందజగత్తునకు జెందినదై యున్నదని మన మంగీకరింపవలయును.

కాని 'ఉత్తరమున' అను సంబంధము ఉనికికిని ఎడింబరో లండన్ల ఉనికికిని భేదమున్నట్లు కన్పించుచున్నది ఈ సంబంధ మెచ్చటనున్నదియను ప్రశ్నకు - ఎచ్చటనుండియును, ఎప్పుడును లేదని సమాధానము వచ్చును. అనగా దాని యునికి యొక దేశములోగాని కాలములోగాని యుండక స్వతంత్రమై యెప్పును అది ఎడింబరోలోగాని లండనులోగాని ఉండదు ఏలన ఉత్తరమున అన్న పదమా రెండు ప్రదేశములను కలుపును. అంతియేకాక యదియొక ప్రత్యేక కాలములో నున్నదని చెప్పుటకు వీలులేదు. ఇంద్రియములకుగాని అను వ్యవసాయము (introspection) నకుగాని గ్రాహ్యమగు నదియైనను నొకానొక కాలమున నుండి తీరును. ఇచ్చట ఉత్తరమున అన్న పదము వానికి పూర్తిగా విభిన్నమైనది. అందుచే నది దేశగతమునుకాదు. కాలగతమునుకాదు; భౌతికముకాదు; మానసికముకాదు. కాని దానికొక ప్రత్యేకమైన సత్త కలదు.

సామాన్యములకు జెందిన యీ ప్రత్యేకమగు నునికి మానసికమని యనేకులు భావించుటకు నాస్కారమైనది. మనమొక సామాన్యమును గూర్చి యాలోచింపగలము. మరి యే యితర మానసికవ్యాపారమువలెనే, మన యాలోచనము సామాన్యార్థములో నుండును మనము తెలుపును గూర్చి యాలోచించుచున్నామనుకొందము. అప్పుడు ఒక యర్థములో తెలుపు మనోగతమని చెప్పవచ్చును. బెర్క్లీనిగురించి చర్చించుటలో మనము గమనించినట్లు ఇచ్చటగూడ నదే యస్పష్టత మనకు తారసిల్లును. కచ్చితముగా జెప్పవలెనన్న, మనోగతమైనది తెలుపుగాదు మరి తెలుపునుగూర్చిన యాలోచనా వ్యాపారము. భావమను పదములోని యస్పష్టతగూడ నిచ్చట చాల తికమకకు హేతువగుచున్నది. ఒక యర్థములో-అనగా నాలోచనా వ్యాపార విషయముగా, తెలుపు భావమే కావున నీ యస్పష్టత విషయమై మనమంత జాగ్రత్త పడకపోయినచో తెలుపు అనునది యొక యాలోచనా వ్యాపారమనియే మనము తుది నిర్ణయము చేయవలసి యుండును. అట్లు చేసినచో, 'తెలుపు'లో గల సర్వసాధారణత్వమును (సామాన్య లక్షణము) కొఱవడును ఆలోచనావ్యాపారమునగనే వైవిధ్యమునకు స్థానమేర్పడును ఒకని యాలోచనా వ్యాపారము మరియొకని యాలోచనావ్యాపారమునకును, సంబంధములేదు అంతియేకాక ఒకప్పుడొకని యాలోచనా వ్యాపార మెకరీతిగా నున్నచో మరియొకప్పు డతని యాలోచనా వ్యాపారము మరియొకతీరున నుండును కావున నీ తెలుపు అనునది యొక వస్తువుకాక కేవల మొక మానసికాలోచనమైనచో నే యిరువురు వేర్వేరు వ్యక్తులును దానినిగురించి యొకేవిధముగ నాలోచింపజాలరు ఏ యొక్కడును దానినిగురించి రెండుమారులాలోచింపజాలడు తెలుపునుగూర్చిన యనేకాలోచనలకు సాధారణమైనలక్షణము గలిగినదే యసలు వస్తువు. కావున సామాన్యములనునవి యాలోచనలు (భావములు) కావు. కాని కొంత యాలో

చించినపిమ్మట నవి నాలోచనకు నాశ్రయభూతములగు వస్తువులగును.

కాలగతములైన యునికిగల పదార్థములను, తామున్న కాలమిదమిత్థమని నిర్దేశించుటకు వీలైన పదార్థములను (సార్వకాలికములగు వస్తువులను గూడ) మనము నిస్సందేహముగా నంగీకరించుటకు తగిన సామగ్రికలదు. కావున నాలోచనములకును, హృదయానుభవములకును, మనస్సులకును, భౌతిక వస్తువులకునుగూడ నునికి కలదు కాని సామాన్యములకు వీనికి పూర్తిగా విభిన్నమైన యునికిగలదు సాధారణముగా నునికి యనునది కాలాధీనము. కాని వీని యునికి కాలాధీనముగాదు. ఈ సామాన్యముల ప్రపంచమునకొక విధమైన యస్తిత్వము గలదు ఆ ప్రపంచము మార్పులేనిది అది గణితశాస్త్రజ్ఞునకును, హేతుశాస్త్రజ్ఞునకును, తాత్త్వికసిద్ధాంత నిర్మాతకును చాల నానందదాయిగ నుండును కాని దేశ కాలాధీనమగు నునికిగల యీప్రపంచ మెప్పటికప్పుడు మారుచుండును దీనినిగురించి స్పష్టమగు జ్ఞానమును గడించుట అసంభవము దీనికొక ప్రణాళికగాని ఒక వ్యవస్థగాని యేమియునులేదు. కాని అదియే సర్వభావములకును, సర్వావేశములకును నాటపట్టు సర్వభౌతికవస్తువులకును నిలయము దానివలన మనకు మంచి చెడుగులు సంభవించును మన యిష్టానిష్టములననుసరించి యది మన జిజ్ఞాసాపదములో నుండుటయో లేకపోవుటయో సంభవించును. ఏది యెట్లున్నను, రెండును మనము జిజ్ఞాసతో పరిశోధింపవలసినదే రెండును వాస్తవములే రెండును తత్త్వజిజ్ఞాసువునకు నావశ్యకములే ఈ రెండు ప్రపంచములను వేర్వేరుగా గురుతింపగల్గినపుడే, వాని నడుమగల సంబంధములను పర్యాలోచించు నావశ్యకతను గమనింపగల్గుదుము

కాని తొలుత సామాన్యములను గూర్చిన మన జ్ఞానమును పరిశీలింపవలయును. దీనిని తరువాతి యధ్యాయమున పర్యాలోచన చేయుదము ఇచ్చటనే సామాన్యములను గూర్చిన యాలోచనకు ప్రోవతీసిన పూర్వసిద్ధ జ్ఞానమునకు సంబంధించిన సమస్య పరిష్కృతమగును

రాజయోగము - యోగప్రయోజనము

ప్రొఫెసర్, చోడవరపు కృష్ణారావు, ఎం ఏ.

అష్టకుంభకములు, లంబికాది హఠయోగాంతమువరకు నెగ్గిన తరువాతనే రాజయోగము పొందదగునని అందురు గాని ఆర్ష సాంప్రదాయములోకెల్ల రాజయోగమార్గము అందరికినీ ఒనగూడు విషయము వేదప్రోక్తమైన మతమందలి పరమార్ధము జీవబ్రహ్మైక్య సంధానము రాజయోగమువలన ఎల్లరూ అట్టి అనుభూతిని అనందమునుపొందదగునని అందురు ఆధునిక సమాజములోగూడ యీరాజయోగము పలురకములైన శ్రేయస్సును కలిగించగలదు మన యీనాటి నాగరికతలో భౌతిక మానసిక స్థిమితములతోపాటు, అంత స్థిమితమైనటువంటిన్నీ, నిత్యమూ నిశ్చలమైనట్టిన్నీ, ఆధ్యాత్మిక, లోతుపాతులను ఎరుకచేయునది యోగశాస్త్రము.

ఆధునిక మానసిక తత్వవేత్తలగు యూంగ్ మహాశయుడుకూడా యీనాటి మానవునిలోని మన స్తత్వములు వివరించుచూ అంతఃకరణ ప్రవృత్తులు ప్రకోపించినపుడు మానసమునందు కలిగెడి విఘాతములను సూచించిరి. దైనందిన చర్యలలో మనుజుడు చేయు పనులన్నియు ఆ కారణముగనే కన్పట్టుననియు, కాని వాటినన్నింటికి నిగూఢమైన అనూహ్యమైన కారణాంతరములు అంతఃకరణములందుండుననియు, దానిని విపులీకరించుటకు యీనాటి శాస్త్రవేత్తలు, శాస్త్రరీత్యా సంపాదింపదగు అతీతమైన సైకిక్ శక్తులనుగురించి విచారణ చేయుచుండిరి ఆర్షవిజ్ఞానమందు యోగము, కాడివంటిదని ఉదహరించబడినది తద్వారా దేహము మనస్సునకు, మనస్సు ఆత్మకును, అందింపబడును, మనో నిబ్బరమును తెచ్చుకొనుటకు యోగ ముపకరించును. కామ క్రోధాదిమోహ సమన్వితమైన మనస్సును స్వాధీనపర్చుకొని మొదటిమెట్టుగా మన స్వాధీనములో లేని కరడరములను మనస్సుయొక్క స్వాధీనముచేసి తదుపరి మనస్సును బుద్ధియందు లగ్నపరచి తద్వారా మనస్సును కామక్రోధాది అరిషడ్వర్గముల బాధల నుండి విముక్తిచేయుటకు ప్రయత్నింపనగును తరువాత మనస్సున కతీతమైనటువంటిన్నీ, అనూహ్యమైనటువంటిన్నీ చరమస్థాయిమీద సాధన మేళవింపనగును

ఆధునిక శాస్త్రవేత్తలలో చైతన్యము కరిగించిన 'ఫ్రూడ్, యూంగ్', మహాశయులకు మున్ను యోగమనగా యింద్రజాలము లేక టక్కుటమారము అని తోసివేయుటకు బహు సులభముగా నుండెడిది తదనుగుణముగానే యోగులనిపించుకొనెడివారు కూడా రోజుల తరబడి భూమిలో పాతివేయించుకొనుటయో, తలక్రిందులుగా నీళ్ళలో తేలుటయో తప్ప అసలైన యోగసాధనా ఫలితములను తామెరుగక, యితరులకు చెప్పజాలక రాజయోగమునకే చెడ్డపేరు తెచ్చిపెట్టిరి స్వయముగా మంత్రసిద్ధి పొందిన గురువుదగ్గర నుంచి పొందిన గాని ఎవరికీ ఫలితము దక్కదని వివేకానంద స్వామి నొక్కిచెప్పెను ఈనాటి మానసిక శాస్త్రములు కూడా మనస్సంతయు తెరలు పొరలుగా నున్నదని అనేకమైన చెట్లుచేమలు మీదుగా, గట్టుపుట్టలమీదుగా మనస్సు తిరుగుచున్నదని అటువంటి చపలచిత్తము నిగ్రహించుటయే పరమార్ధమని సూచించుచున్నవి

జీవునకు సంచితప్రారబ్ధ కర్మవిశేషమువలన అనేక స్థితిగతులు కలుగుచున్నట్లు చెప్పబడుచున్న తత్త్వశాస్త్రమునకున్నూ, యూంగ్ మహాశయుని మానసిక శాస్త్రము ననుసరించి సాముదాయక స్మృతి విశేషమువలన మానవుని ప్రవృత్తికి కలిగెడి వైపరీత్యముల వివరణకున్నూ సమన్వయము చెప్పనగును సాముదాయక స్మృతియనగా మానవజాతియొక్క సృష్ట్యాది విశేషమువలన సర్వకాల సర్వావస్థలయందు కలిగిన క్రియాకారణ జనితస్మృతి విశేషములు తద్వారా అంతఃకరణములలో

వెలరేగెడి అనేక ప్రకోపములవలన మానవుడనేక రాక్షసకృత్యములు చేయవచ్చునని మానసిక శాస్త్రవేత్తలుకూడా చెప్పుచున్నారు అట్టి దురితక్షయార్థము ఆర్షసాంప్రదాయములో కారణజన్ములైన జీవులకు యోగసాధన చెప్పబడినది యోగవిషయములు మానసిక శాస్త్రవిషయముల వలెనే యిదమిద్ధమని నిరూపించుట కలివియైనవికావు. కాలమానసులకు లొంగనిరీతిని మనోప్రకృతి విజృంభించుచుండును అట్టి వైపరీత్యములను వివరించుటకు పారిభాషిక పదములను వెతుకుకొనవలసి వచ్చుచున్నది. సంస్కృత, పాళీభాషలలో యిట్టి విషయములను వివరించుటకు కావలసినంత పదజాలమున్నదనియు, సునిశితమైన పారిభాషిక పదముల ప్రయోగములలో ప్రాచీన శాస్త్రవేత్తలగ్రగణ్యులనియు యీనాటి అన్ని భాషలలోని పదజాలములు కలసినను మానవాంతర్గత హాహాకారములు అసలు స్వరూపము అవగాహన చేసుకొనుటకుగాని, తన్నివృత్తిమార్గము చూపుటకుగాని చాలకున్నది.

వివేకానందుడు వివరించిన రీతిని యోగసాధన చేసినవారు గుర్వనుగ్రహముచేత సూక్ష్మదర్శనులై స్థూల సూక్ష్మములందలి తారతమ్యమునెరింగి మానవాంతర్గత శక్తులకున్న బాహ్యప్రపంచములలో నిబిడీకృతమైన శక్తులకున్నూ, వ్యత్యాసములుగాని, అడ్డంకులుగాని ఏమియు లేవని యెరిగి ప్రవర్తింతురు అట్టి గమనములో సిద్ధులు కలుగునెడ అపుడపుడు యిష్టదైవతములు వగైరా దురలవాట్లకు లోనై పతనమొందుట సంభవించును లేక జాగరూకులై యుండిన అటువంటి మూఢనమ్మకములు లేకుండ చిల్లరదైవతములనొల్లక, నేరుగా జీవన్ముక్తి సాధనకే జీవి రాజయోగమునే సాధించును అట్టి మార్గము రాజమార్గము అయ్యును అనేక శ్రమలతో కూడికొనియున్న మార్గమైయున్నది నైతికదృష్ట్యా మానవునికి భౌతిక దేహాత్మిక అధిఆత్మిక విషయానుగ్రహణములో గురుతరమగు పరిణామము సోపాన గతిరీతిని యుండునని చెప్పనగును.

సుఖదుఃఖాలలోను శౌర్యదంభములలోను మునిగి కర్మధర్మపరిపాలనకు వెరచి క్లేశసమన్వితులైన మనస్కులలో అర్జునుడు పురాణపురుషుడు. గీత అట్టివారికి మార్గదర్శినిగాను యోగదర్శినిగాను సాక్షాత్తు విశ్వరూపదర్శినిగాను వొప్పుచున్నది అలౌకికమైన జ్ఞానము సాధింపదగినదనిన్నీ, సాధించువాడు తన నిజధర్మమును అనగా తన ఆత్మస్వరూపమును ఎరిగి సాధనచేసినయెడల కలిగెడి ఉచ్చగతిని గీతయందు సూచించబడినది

అందు శ్రీకృష్ణుడిట్లనియె - భావాతీతమైనట్టిన్నీ మనస్సును అతిక్రమించినవానికే చెప్పతగినదిన్నీ అతిగూఢమైన ఏవిద్యను తెలుసుకొనిన సంసార విముక్తుం డగుదువో అట్టి యోగరాజమును ఓ అర్జునా నీకు ఎరుక చేయుచుంటిని. అటువంటి చరమదశలో మనోప్రవృత్తులు అతిముఖ్యమైన మలుపులు తిరిగి పరమపద సోపానములను అధిగమించుటకు ఉద్యుక్తుడైన జీవుడు తపించుతరి ఆదిగురుడే సాక్షాత్కరించి రహస్యజ్ఞానమును తెలియజెప్పుటకుగాను మున్ను సర్వసందేహనివృత్తిజేసి పిదప బుద్ధిసూక్ష్మతను ప్రసాదించి అట్టి బుద్ధ్యాత్మను జీవాత్మయందు లగ్నపరచి నిజధర్మమును ఎరుకచేయుటకు బాహ్యాంతర్గత శక్తి లక్షణ స్వరూపనిరూపణముతో సనాతనుడైనట్టిన్నీ ఆది మధ్యాంతరహితుడైనట్టిన్నీ ప్రకాశాత్మను దర్శించుటకు అర్హతనొసంగు విద్యను ఉపదేశించును అట్టి విద్యాపారంగతుడైన పిమ్మటనే అర్జునునికికూడా దైవనిర్ణయమును ఎరింగి దాని నాచరించుటకుగాను దేవదత్తమును పూరించుటకు అర్హతనేర్పడెను

సంస్కార రహితమైన స్మృతి విశేషములచే కలుగు భ్రాంతివలన చేసిన కర్మకు కర్మగాను, లేక స్వధర్మమైనట్టిన్నీ, సత్యమైనట్టిన్నీ నిత్యమైనట్టిన్నీ ఆ పరమపురుషునియొక్క అంశముగనే తన్నెరింగిచేసిన కర్మ నిర్దుష్టమై పాపరహితమై దైవతేజస్సుతోను సాక్షాత్తు దైవప్రేరితముగనే నొప్పారును కాక సుఖాలలో మునుగుదామంటే ఫలప్రాప్తియే లక్ష్య

మనుకుంటే దుఃఖసాగరమనే సంసారసాగరమే ప్రాప్తిస్తుంది. కనుకనే అనేక పురాణేతిహాసములలో వేదనిక్షిప్తమైన పరమ సత్యమును వెదజల్లుటకో యనంగ రాజాధిరాజుల కృత్యాకృత్యములను అతిరధుల మహారధుల ప్రయోజకత్వాలను తెలియజేయు కట్టుకథల లోనే అలౌకికమైన విషయాలను ఉటంకించిరి. నైతిక సామాజిక ధర్మములనుకూడా ఎరుక జేసి నీ ధర్మము నిన్నధోగతి పాలుచేయునని తలంచితివేని అతీంద్రియమైనట్టి స్వధర్మమును ధర్మస్వరూపము నిజముగా చూచి సద్గతిని పొందుమని గీత నుడివెను.

అదృష్టవశాత్తు బ్రహ్మవిద్యకు సంబంధించిన వాక్కులు చెవిని పడినంతనే కొంత పుణ్యము లభించునేమోగాని జరగవలసిన కర్మ కాండ అంతా జరుపవలసియే యుండును. అనగా మసిబొగ్గు, మణిపూస రసాయనిక శాస్త్రరీత్యా ఒక జాతివే అయినా, ఆ పరిణామము జరుగుటకుగాను భూగర్భమందు ప్రళయాగ్నియో అనబడే చైతన్య విశేషమువలన గదా బొగ్గు వజ్రమవుతున్నది! కనుక మృత్యు తుల్యులయిన జీవులు స్వతహా సత్ పదార్థమునకే చెందినవయ్యును ఆ పరమ సత్యమును దృష్టియందుంచుకొని జీవుడు నిరతము సాధన చేసి తపించినగాని సద్గతి లేదని యోగశాస్త్రములు ఘోషించుచున్నవి. కావున కాలము వృధాపుచ్చక క్రియాకారణ జనిత రూపభ్రాంతికి లోనుగాక నిరహంకారులై తురీయము నధిగమించే ఓంకారమునే పొందుటయే పరమ లక్ష్యమని చెప్పవచ్చును. ప్రణవోపాసనలో షడ్జపంచమగాంధార సు స్వ నా లు ద యి ంచు నందురు తద్వారా శాశ్వతకైవల్యమే సిద్ధించ నగును అనగా ము ం దు శబ్దబ్రహ్మము, తర్వాత రసబ్రహ్మము తర్వాత సాక్షాత్తు పర బ్రహ్మప్రాప్తి కైవల్యమే సిద్ధించును

అట్టి సాక్షాత్తు కైవల్యప్రాప్తికిగాను జరుగునట్టి అంతఃపరిణామము సాంఖ్యకారికలందు సూచింపబడినది గీతయందు బోధింపబడిన సాంఖ్యము వేదప్రోక్తమయినటువంటి జ్ఞానము నకున్నూ, సాంఖ్యమునకున్నూ సమన్వయమై ఒప్పుచున్నది. సాంఖ్య యోగమునకున్నూ, వేదాంత విషయములకున్నూ గల అవినాభావ సంబంధము అతిగూఢమైనది సాంఖ్యమనగా వేరు యోగమనగా మరొకటి అని ప్రతిపాదించే సాంఖ్యకారికలున్నూ పాతంజలి యోగ పరిణామసూత్రములున్నూగాక, గీతా బోధితమైన సత్యము రెంటినీ సమన్వయము చేయుచున్నది. ముందుగా పరమగురుడైన శ్రీకృష్ణ పరమాత్మ రెంటియందుగల భేదమును వివరించి తరువాత రెంటికిని సమన్వయము చెప్పెను. అసలు గీత వేదాంత సంబంధమైన స్మృతి యననగును సాంఖ్యపద్ధతి యోగమార్గములలోని సత్యములను ఉపమానములుగా తీసుకొని, సుబోధకరముగా తత్వజ్ఞానమునందించు యోగశాస్త్రముగా గీతను తీసుకొనినయెడల అందలి పరమార్థము కన్పట్టును. అట్టి యోగరాజమును పొందిన అర్జునునికి మాత్రమే దైవనిర్ణయము నెరుగు శక్తి, తదనుసారముగా ప్రవర్తించు శక్తి కలిగి సర్వసందేహ నివృత్తి కాబడినది అప్పటికిగాని, యుద్ధకాండయందలి హత్య కాండ దైవనిర్ణయమే అయి పాపభూయిష్టము గాక, దైవమంటే కర్తృత్వతా నిరూపణము చేయుటకు నలవియైనది. ఆ నాటికి ఆజాతి పొందిన సద్గతి మూలముగా నేమి, తాఖూరుని యందు దైవశక్తి ప్రేరేపింపబడుట వలన నేమి ఆ యుద్ధభూమియందట్టి ప్రసక్తి, అట్టి సంశయములు, తన్నివృత్తి జరుగుట, సాక్షాత్తు విశ్వరూపమే గోచరించుట, యనెడివి తటస్థించెను. అందలి పరమార్థము ఉపనిషత్పురాణములలోని సునిశితతత్వ విమర్శతోబాటు అతీంద్రియ విషయమును మాపించు తత్వదర్శినియే 'గీత'. అంతర్ముఖుడై శోధించు జీవునికి స్వధర్మమును చూపించి భీభత్సములను గొలుపు విశ్వరూపమును జూపి అదే యిది యనే పరమసత్యమును కన్గొనిన పిమ్మట కలుగు ఆనందాతిశయములను కలిగింపజేయునది గీత, సాంఖ్యము, వేదసంబంధమైన రాజయోగము,

వేర్వేరు గావనియు, ఒకదానికొకటి వ్యతిరేక మసలేగాదని, చూపులు చేతలు వేర్వేరుగా కన్పట్టవచ్చునని, లక్ష్యమొకటేనని గీత విపులీకరించుచున్నది అటువంటి జ్ఞానము అర్జునునకు సాంఖ్యమను యోగముద్వారా బోధింపబడినది. తద్వారా ఫలాపేక్షవలన అనేక తెరగుల కుకర్మలుచేయ నుద్యుక్తులైన భ్రాంతి మనస్కుల విషాదమును పోగొట్టి సర్వబంధ విముక్తులగుటకు నిష్కామ కర్మ నాచరించుటకుగాను కావలసిన భక్తిశ్రద్ధలు, వైరాగ్య ప్రవృత్తులు కల్గుటకుగాను నిస్సందేహాంతఃకరణ మగుటకు కావలసిన యోగము ఉపదేశింపబడినది

సాంప్రదాయ రీత్యా సాంఖ్యమనగా విశ్వమంతటిని విచ్ఛిన్నము చేయుటకో యనంగ సూక్ష్మాతి సూక్ష్మముగా పరిశీలనము చేయుట మట్టిబుర్రలకు తోచు, ప్రకృతిసిద్ధమని తోచు సత్యములకతీతమైన విషయములను పరికించుటకున్నూ, నిత్యానిత్య సత్యాసత్య పాంచభౌతికాత్మిక తత్వజ్ఞాన సమన్వితమైన దృష్టి కగపడు పరమసత్యనిరూపణము చేయు విద్యను సాంఖ్యమందురు. ఆవిధముగా సత్యాసత్య, నిత్యానిత్య విషయములను తుంచి, వేరుచేయుట పరికేగాని, సాంఖ్యములో తదన్వయమునకై ప్రయత్నములేదు. తార్కికదృష్ట్యా సాంఖ్యము ద్వైతమనవచ్చును. కాని వేదాంతదృష్ట్యా అది ద్వైతమనెడి పక్కికి చెందినదిగాదు. సాదృశ మానంగా ఉపమాలంకారమో యనంగ సాంఖ్యము ద్వైతమువలె కన్పట్టును. ఎందుకనగా విశ్వస్థితిని వివరించుటకు ఉదాహరణగా రెండు వస్తువులను ప్రతిపాదించి తద్వారా తత్వజ్ఞానము నుపదేశించును ఆరెంటియొక్క అనగా ప్రకృతి పురుషుల సంయోగముచేత సృష్టి నిలిచెనని ఎరుకచేయుచున్నది. పురుషుడనగా మూలపురుషుడు ఆదిమధ్యాంత రహితుడు సనాతనుడు ప్రకృతియనగా ఆదిశక్తి, పరాశక్తి, చైతన్యస్వరూపమే యననగును. మూలపురుషుడేమియు చేయనివాడుగను, పరాశక్తియే చిద్విలాసాన్ని చిందిస్తున్నట్లుగా సాంఖ్యమందు చిత్రింపబడెను. అట్టి చిద్విలాసమే అతిరూపముగా కలిగిన మాయానాటకమందలి సూత్రధారు డనదగిన మూలపురుషుడుమాత్రము అందు కన్పట్టు సృష్టి, స్థితి, లయములనెడి వాటికిన్ని పాంచజన్యములను పంచేంద్రియ వ్యాపారములకున్నూ అతీతముగా చలింపక స్థిరుడై సనాతనుడై సర్వము తానై ప్రకాశించుచున్నాడని గీతలోని సాంఖ్యయోగము సమన్వయించినది చిద్విలాసములోని భ్రాంతినికూడా చమత్కారముగా పురుషుడు కర్తృత్వమును తనకే ఆపాదించుకొనుమందునని సూచించెను ప్రకృతి త్రిగుణాత్మకమైనదగను, అట్టి త్రిగుణములున్నూ పురుషునందు లయమైనప్పుడు నిర్వికల్పమైనట్టిన్నీ, ఆభాస మాత్రమైనట్టిన్నీ మూలపురుషునిగానే తేజరిల్లుచుండునని గీత బోధించెను. గాక, వికల్పము సంభవించినపుడు త్రిగుణంబులును వేర్వేరు వికల్పావస్థలో త్రిగుణాత్మకమైనట్టి అనేక కర్మలు ప్రకోపించినవో యనంగ సతతము సృష్టి, స్థితి, లయములు జరుగుచున్నట్లుగా అవగత మగుచుండునని - ఆ సృష్టికి సత్వగుణము శక్తిని నిగ్రహించుననియు, రజోగుణము కర్మానువర్తియై శక్తిని క్రియాకారణ కర్మ జనితమైన విశ్వరూపమును చిత్రించుననియు, తమోగుణము సత్వరజోగుణముల లయకారకమగునని అట్టి యీ మాయానాటకమందు జరుగుచున్న విషయములు పురుషుని సంకల్ప వికల్పములు మాత్రముగనే సూచింపబడినవి. అట్టి నాటకమును చూచుట కిచ్ఛగించనియెడల సర్వేంద్రియ వ్యాపారముల నుపసంహరించుకొని, బుద్ధి నతిక్రమించి తత్వార్థము ననుభవించుచు నిర్వికల్ప నిత్యానంద స్థితియందు వుండవచ్చును అనగా స్థితప్రజ్ఞులై దగ్ధపటలము రీతి కర్మలాచరించుచున్నను, లేక నిర్వికల్ప సమాధి నిష్ఠాగరిష్ఠులై యున్నను, ఒకటే.

ఇది అది, అది యిది అని యనుకొనుచున్న యీ బుద్ధివిశేషము 24 తరహాలుగా చెప్పబడినది. అటువంటి కుబుద్ధి ప్రకృతి

లక్షణమో, పురుషలక్షణమోగా కన్పట్టక తికమకలు పడుట సహజము. అట్టి లక్షణములు జడాత్మకమైన ప్రకృతిసిద్ధమూలే ననియు, అట్టి జడాత్మకమైనవి ప్రకాశాత్మకమైన జ్ఞానస్వరూపమే ఎట్లగును అను విషయమును గ్రహింపవలెను. ఆధునిక విజ్ఞానవేత్తలు బుద్ధి సంకల్పాదులు జడాత్మకమైన మృత్తుయొక్క పరిణామములేయని ఎరింగియు, అవియే జ్ఞానాత్మకమైన ప్రకాశాత్మగా నెట్లు భాసించునో తెలియక తికమకలు పడుచున్నారని చెప్పనగును అనగా హైజన్‌బర్గు మహాశయుడు ప్రతిపాదించిన 'అనిశ్చయత్వ' సిద్ధాంతమున్నూ, 'స్రోడింగరు'యొక్క తత్వముమీద ఆధారపడి జడాత్మకమైన ప్రకృతిలోని లక్షణ పరిణామములను పరిశీలించు సందర్భములో ఆధునిక శాస్త్రవేత్తలు అతిసూక్ష్మ పరిణామము గల ఒక 'నలుసు'యొక్క స్థితిగతులను పరిశీలించవలసివచ్చినపుడు దానియొక్క 'స్థితి'ని (ఉనికి) ఖచ్చితముగా నిర్ణయించిన 'గతి'ని (గమనవైఖరిని) నిర్ణయించుటకు అలవికాదని, యీ తికమలు మన చర్మచక్షువులలోని దృష్టిలోపము కాదనియు, కాలమానములలోని లోపమువల్లనూ కాదనియు, ఆచమత్కారము, ఆ చిద్విలాసము, ఆ గమనములోని నిరంకుశత్వము, అందులోని నిగూఢ ప్రజ్ఞావిశేషములని తెలుసుకొనిన హైజన్‌బర్గుని తత్వము సర్వసంగతులకు అనగా అణు పరిణామ సంచలనములకేగాక, ప్రకృతి స్థితమైనట్టిన్నీ, అభేద్యమైనట్టిన్నీ అనూహ్యమైనటువంటిన్నీ ప్రవృత్తి విశేషములను ఆధునిక విజ్ఞానవేత్తలైన 'డిరాక్' మహాశయులంటివారు సూచించిరి. కాని, వారికి జడాత్మకమైన మృత్తు విశేషమే జ్ఞానస్వరూప మెట్లగునో అను విషయముగాని, పురుషప్రకృతులకున్న అవినాభావ సంబంధముగాని, అగమ్యగోచరముగానున్నది అట్టి అతి గూఢమైన విద్య గీతయందలి సాంఖ్యయోగమునందు నిక్షిప్తమైనది,

(Sri Aurobindo's books on Philosophy have been extensively consulted in preparing this article)

భూమినుంచి అధికోత్పత్తి

ఆహారధాన్యాలలో ఆంధ్రప్రదేశ్ మిగులురాష్ట్రం. మామూలు పరిస్థితులలో కూడ భారతదేశంలోని అనేక భాగాలకు ఆంధ్రప్రదేశ్ ఆహారధాన్యాలను అందిస్తుంటుంది. ఇక ఎక్కడైనా కరువుకాటకాలు సంభవిస్తే ఆంధ్రప్రదేశ్ సహాయం చేయకతప్పదు. వరదల ఇబ్బందులను తగ్గించి భూమినుంచి సాధ్యమైనంత పంటను తీయటంకోసం అనేకమైన నీటిపారుదల పథకాలు కొనసాగుతున్నవి. ఈ విధంగా అనేకలక్షల ఎకరాలభూమి కొత్తగా సాగులోకి వస్తున్నది.తనకు కావలసిన ఆహారధాన్యాలలో కొంతభాగం కోసం భారతప్రభుత్వంకూడ ఆధారపడగల ధాన్యాగారంగా ఆంధ్రప్రదేశ్ పెంపొందగలదని ఆశించటంలో అసహజమేమి ఉండదు.

రెండవ ప్రణాళిక ఆరంభంలో ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం ఆహారోత్పత్తి 54.21 లక్షలటన్నులు, రెండవప్రణాళిక పూర్తి అయ్యేసరికి రాష్ట్రంలో ఆహారోత్పత్తి 70.64 లక్షల టన్నులవరకు పెంచాలని ఉద్దేశించబడింది. అంటే నూటికి 30.3 వంతుల పెరుగుదల అన్నమాట. మొదటి ప్రణాళికకాలంలో నూటికి 35 వంతుల పంట అధికం చేయబడింది. మొత్తం దేశంలో పండే ఆహారధాన్యాలలో ఆంధ్రప్రదేశ్ 1/12 వంతులు ఉత్పత్తి చేస్తున్నది.

1957-58 స.లో ప్రణాళికలో ఉన్న పథకాలను ప్రణాళికలో లేని మరికొన్ని పథకాలను అమలు చేయటంవల్ల అదనంగా 2,36,584 టన్నుల ఆహారధాన్యాలు లభించినవి. 1958-59 సం.లో 3,36,208 టన్నుల అధికోత్పత్తి సాధ్యం కాగలదని భావించబడుతున్నది.

అధికోత్పత్తి సాధనకు ఉపయోగించిన ప్రధానసాధనం నీటిపారుదల సౌకర్యాలు. అనేకమైన నీటిపారుదల సౌకర్యాలు - పెద్దవి, మధ్యరకంవి, చిన్నచిన్నవి-అభివృద్ధి చేయబడినవి.

ఆంధ్రప్రదేశ్ చాలా నదులున్న రాష్ట్రం. పెద్దనదులైన గోదావరి, కృష్ణ, తుంగభద్ర, పెన్న, కాక మూసి, పెన్గంగ మొదలైన చిన్న చిన్న నదులుకూడ ఉన్నవి. ఇవన్నీ నీటిపారుదలకు ప్రధానాధారాలు. రాష్ట్రంలోని సాగుభూమిలో 24.7 వంతుల భూమికి ప్రధానంగా కాల్వలద్వారా, చెఱువులద్వారా నీటి సౌకర్యం లభింపచేయబడుతున్నది. అనేక ప్రాజెక్టుల క్రిందఉన్న ఆయకట్టును పెంచటంద్వారా ఈ సౌకర్యాలు నానాటికి అభివృద్ధి చేయబడుతున్నవి.

ఉత్పత్తిని అధికంచేయటానికి ఈక్రింది ఇతరమార్గాలుకూడ అనుసరించబడుతున్నవి. భూమిని అభివృద్ధి చేయటం, మంచి మంచి విత్తనాలు అందించటం, రసాయనిక ఎరువులు మంచి పరికరాలు సరఫరా చేయటం, పంటల రక్షణ, ఉత్తమ వ్యవసాయ విధానాలు, సమాజాభివృద్ధి పథకంక్రింద కార్యక్రమాలను కట్టుదిట్టం చేసి అధికం చేయటం, రైతులకు ఋణసౌకర్యాలు కలిగించటం, ఈ మొదలైన ఏర్పాట్లద్వారాకూడ ఉత్పత్తిని అధికంచేయటం జరుగుతున్నది.

1953-54నుంచి వ్యవసాయశాఖ ప్రత్యేక శ్రద్ధవహించటంవల్ల జపాన్‌పద్ధతి వరిసాగు నానాటికిబాగా ప్రచారంలోకి వస్తున్నది, 1958-59 సం.లో 10,09,069 ఎకరాలు ఈ జపాన్‌పద్ధతిని నాటటం జరిగింది.

వ్యవసాయదారులలో ఆరోగ్యవంతమైన చక్కనిపోటీని సృష్టించడంకోసం తద్వారా వ్యక్తుల భూకమతాల ఉత్పత్తిని అధికం చేయటంకోసం 1950-51 నుంచి వ్యవసాయశాఖ వరిపంటలో పోటీలు నిర్వహిస్తున్నది. ఈ పోటీ క్రమంగా చెఱకు, వేరుశనగ, జొన్న పంటలకుకూడ అనువర్తించబడింది. రాష్ట్రంలో పండ్ల ఉత్పత్తిని అధికం చేయాలన్న ఉద్దేశంతో కొత్తగా తోటలు వేసేటందుకు రైతులకు దీర్ఘకాలిక ఋణాలు మంజూరు చేయుటంజరిగింది. ఈ పథకంక్రింద 1958-59 సం.లో రు 150000 మంజూరు చేయటమైంది. ఇదే కాక విత్తనాలు, ఎరువులు, పరికరాలు కొనుక్కోవటానికి బావులు దించుకోవటానికి వ్యవసాయశాఖ మరికొన్ని ఋణాలుకూడ ఇస్తున్నది. వ్యవసాయశాఖ మార్కెటింగ్ విభాగం ఇంతవరకు 40 ఇండివిడ్యువల్ రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డులను, పది మార్కెట్‌కమిటీలను ఏర్పాటు చేసింది. పంటల అమ్మకం మధ్యమనుష్యులకు అవకాశం లేకుండా కొనుగోలుదారుతో రైతుకి ప్రత్యక్ష సంబంధం ఉండటానికే ఇవి ఏర్పాటుచేయటం జరిగింది.

సమాచార ప్రజాసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్

ఆంధ్రతర్క సంగ్రహదీపిక

శ్రీ కుప్పా బైరాగిశాస్త్రి

శ్లో॥ విశ్వేశ్వరం సాంబమూర్తిం
ప్రణిపత్య గిరాంగురుం
టీకాం శిశు హితాంకుర్వే
తర్కసంగ్రహ దీపికాం.

తర్కసంగ్రహమును రచించి కొంతవరకు తర్కశాస్త్రములో ప్రవేశమును కలుగజేసి దానిని వృద్ధిపరచుటకు స్వరచిత తర్కసంగ్రహమునకు వ్యాఖ్యానమును వ్రాయదలచి ప్రారంభములో గ్రంధము నిర్విఘ్నముగా పరిసమాప్తి అగుటకు భగవత్ప్రార్థనను చేయుచున్నారు అన్నంభట్ట మహాశయులు

విశ్వేశ్వరం అనగా విశ్వనిరూపిత నియామకతావంతుడైన అని, సాంబమూర్తిం-పార్వతీదేవిచే ఆలింగతుడైన శివుని, ఇచ్చట శివుని అనుచోట ద్వితీయావిభక్తికి కర్మత్వము అర్ధముగాన శివకర్మకమైన అని అర్ధము చెప్పకొనవలెను ప్రణిపత్య - నమస్కరించి, నమస్కారమనగా తనకంటె గొప్పవారు అనుజ్ఞానమునకు అనుకూలమైన వ్యాపారము. ల్యప్ప్రత్యయమునకు అనంతరకాలమందు అని అర్థము. గిరాం-వాక్కులకు, గురుం - గురువును అనగా బృహస్పతిని, ఇచ్చటగూడా ద్వితీయావిభక్తికి కర్మత్వము అర్ధము. టీకాం-వ్యాఖ్యానమును శిశుహితాం, శిశూనాం హితా - శిశుహితా, తాం. శిశుహితాం అని సమాసము శిశుశబ్దమునకు బాలులు, షష్ఠివిభక్తికి సమవేతత్వము అర్థము, హితశబ్దమునకు సుఖపూర్వకమైన బోధకు ప్రయోజకమైనది అని అర్థము ద్వితీయావిభక్తికి అభేదము. అర్ధము (విశేషణపదములకు ఉత్తరమునఉన్న విభక్తికి అభేదము అర్ధము) కుర్వే అనుచోట కృఞ్ ధాతువుకు కృతిఅర్ధము. దాని తరువాతఉన్న ప్రత్యయమునకు వర్తమానకాలీనత్వము అర్ధము- తర్కసంగ్రహదీపికాం.- తర్కసంగ్రహ దీపికా అను వ్యాఖ్యానమును. ద్వితీయావిభక్తికి విషయత్వము అర్థము. ఈ రకముగా ప్రతిపదమునకు అర్ధము చెప్పట ఖండబోధ అని అందురు. అఖండబోధ ఈ ప్రకారముగా చెప్పవలెను

విశ్వమనగా సకలజగత్తుగాన, సకలజగన్నిరూపిత నియామకవంతుడైన పార్వతీదేవిచే ఆలింగతుడైన యే శివుడుగలడో ఆ శివకర్మకమైన తనకంటె గొప్పవాడు అనుజ్ఞానమునకు అనుకూలమైన వ్యాపారము (నమస్కారము) తరువాతను, బృహస్పతి కర్మకమైన నమస్కారము తరువాతను, బాలసమవేతమైన సుఖపూర్వకమైన యేబోధగలదో ఆబోధకు ప్రయోజకమైన యే తర్కసంగ్రహదీపికా అను వ్యాఖ్యానముగలదో ఆ వ్యాఖ్యానవిషయకమైన వర్తమాన కాలికమైన కృతికి (ప్రయత్నము) ఆశ్రయమైనవాడు అన్నంభట్టు.

మూ॥ చికీర్షితస్య గ్రంధస్య నిర్విఘ్న పరిసమాప్త్యర్థం శిష్టాచారానుమితశ్రుతి బోధితకర్తవ్యతాకమిష్టదేవతా నమస్కారాత్మకం మంగళం శిష్య శిక్షాయై గ్రంధతో నిబధ్నం శ్చికీర్షితం ప్రతిజానీతే నిధాయేతి

చికీర్షితస్య - కర్తు మిచ్ఛావిషయీభూతస్య- చేయదలచినటువంటి, గ్రంధస్య-గ్రంధమునకు నిర్విఘ్నపరిసమాప్త్యర్థం - విఘ్నములు లేకుండగా పరిసమాప్తి కొరకైనటువంటిన్నీ, శిష్టాచారానుమిత శృతిబోధిత కర్తవ్యతాకం - శిష్టులయందలి ఆచారముచే ఊహించబడినయేశృతి (వేదము) గలదో ఆవేదముచేత బోధితమైన కర్తవ్యత కలిగినటువంటిన్నీ. ఇష్టమైన దేవతను నమస్కరించుట రూపమైన మంగళమును, శిష్యశిక్షాయై - శిష్యులయొక్క శిక్ష కొరకు, శిక్ష అనగా అనుమితి చతుర్థీవిభక్తికి ప్రయోజకత్వము అర్ధము శిష్యులయొక్క అనుచోట షష్ఠీవిభక్తికి సమవేతత్వము అర్ధము శిష్యసమవేతమైన యే అనుమితి గలదో ఆ అనుమితి ప్రయోజకమైన, గ్రంధతః - గ్రంధఘటమైన, నిబధ్నన్-నిబంధించుచూ, నిబంధనమనగా జ్ఞానజనక శబ్దఘటక వర్ణాభివ్యంజకరేఖోపలేఖనం జ్ఞానమునకు శబ్దము కారణము శబ్దములో ఘటకములు (ఇమిడిఉన్నవి) వర్ణములు వాటికి అభివ్యంజకములు యీ వ్రాయు

గీతలు, నిబధ్నన్ అనుచోట చివరి ప్రత్యయమునకు సమకాలీనత్వము అర్థము. చికీర్షితం-చేయదలచినటువంటి దానిని,(కర్తుమిచ్ఛాచికీర్షా తద్విషయీ భూతం చికీర్షితం) కృతివిషయత్వము ప్రకారమైన ఇచ్ఛయందు విషయమైన గ్రంథము, ద్వితీయావిభక్తికి విషయత్వము అర్థమురాగా ఆ గ్రంథము విషయమైన,ప్రతిజా నీతే ప్రతిపూర్వకమైన జా నా తి కి ప్రతిజ్ఞా అర్థము. దాని చివరఉన్న ప్రత్యయమునకు కృతి అర్థము. ప్రతిజ్ఞ అనుకూలతా సంబంధముచే కృతిలో అన్వయించును. కృతి ఆశ్రయత్వసంబంధముచే గ్రంథకారుడైన అన్నంభట్టు నియందు అన్వయించును. ప్రతిజ్ఞ అనగా అవ్యవహితోత్తరకాల కర్తవ్యత్వ ప్రకారక జ్ఞానానుకూల వ్యాపారము నిభాయేతి అను చోట ఇతి అను పదమునకు అభేదము అర్థము. ఇది ఖండబోధ. అఖండబోధప్రకారము చేయదలచినటువంటి గ్రంథము విఘ్నములు లేకుండగా పరిసమాప్తి అగుటకొరకై నటువంటిన్నీ శిష్టులయందు సమవేతమైన ఆచారముచే ఊహించబడిన శ్రుతిచే బోధించబడిన కర్తవ్యత కలిగినటువంటిన్నీ యే ఇష్టదేవతా నమస్కారాత్మకమైన మంగళముగలదో ఆ మంగళ విషయకమైనటువంటిన్నీ శిష్యులయందు అనుమితి ప్రయోజకమైనటువంటిన్నీ గ్రంథఘటకమైన యే నిబంధనగలదో ఆనిబంధన సమకాలీనమైన, కృతివిషయత్వ ప్రకారకమైన ఇచ్ఛలోవిషయమైన గ్రంథమువిషయముగాగల యే ప్రతిజ్ఞ కలదో ఆ ప్రతిజ్ఞా అనుకూలమైన కృతికి ఆశ్రయమైనవాడు అన్నంభట్టు.

శిష్యశిక్షాయై అను చోట శిక్షాపదమునకు అనుమితి అని అర్థము చెప్పినాము. ఆ అనుమితి ప్రకారము గ్రంథములు, మంగళాచరణముతరువాతదైన ఆరంభములో విషయములు. చేయబడిన మంగళములుగల గురువులు కర్తలగుటవలన తర్కసంగ్రహమువలె. విఘ్నమనగా సమాప్తికి ప్రతిబంధకమైన పాప విశేషము. సమాప్తి యనగా చరమవర్ణము యొక్క నాశము. వర్ణమందలి చరమత్వమనగా తనతో ఘటితమైన గ్రంథములో ఘటకమైన వర్ణప్రాగ భావముతో సమానకాలముగల వాట్లకంటె భిన్నమగుట శిష్టులనగా వేదముచే చెప్పబడినదని తెలుసుకొని వేదముచే విధించబడిన కర్మలు చేయువారు.

మూ॥ నను మంగళస్యసమాప్తి సాధనత్వంనాస్తి మంగళే కృతేపికిరణావళ్యా దౌసమాప్త్యదర్శనాత్, మంగళాభావేపి కాదంబర్యాదౌ సమాప్తిదర్శనాచ్చ అన్వయవ్యతిరేకాభ్యాం వ్యభిచారన్ ఇతిచేన్న, కిరణావళ్యాదౌవిఘ్న బాహుళ్యాత్ సమాప్త్యభావః కాదంబర్యాదౌగ్రంథాత్ బహిరేవమంగళం కృతం అతో నవ్యభిచారః.

మంగళమునకు సమాప్తి సాధనత్వము సిద్ధించినచో సమాప్తికొరకు మంగళము చేయవచ్చును. అటుల సమాప్తిసాధనత్వమే సిద్ధించదే అని ప్రశ్నించుచున్నారు అని, లోకములో అన్వయవ్యతిరేకముల సాహచర్యము వలన కారణత్వ నిశ్చయముకలుగును అన్వయమనగా కారణము ఉంటే కార్యము ఉండుట. వ్యతిరేకమనగా కారణము లేకపోతే కార్యము లేకపోవుట. అన్వయవ్యభిచారమనగా కారణము ఉన్నప్పంటికి కార్యము లేకపోవుట వ్యతిరేక వ్యభిచారమనగా కారణము లేకపోయినప్పంటికీ కార్యము పుట్టుట. కిరణావళి గ్రంథమందు మంగళరూపకారణము ఉన్నది గాని పరిసమాప్తి రూపకార్యములేదు గాన అన్వయ వ్యభిచారరూపదోషమున్నూ కాదంబరీ గ్రంథమందు మంగళరూప కారణము లేకపోయినప్పంటికీ సమాప్తి రూపకార్యముండుట చేత వ్యతిరేక వ్యభిచార రూపదోషమున్నూ కనబడుటచేత మంగళము సమాప్తికి కారణము కానందున సమాప్తికొరకు మంగళాచరణము అనవసరము అని పూర్వపక్షము రాగా సమాధానము చెప్పుచున్నారు, కిరణావళి గ్రంథమందు మంగళము చేసినప్పంటికీ విఘ్నములు ఎక్కువగా ఉండుటచేత పరిసమాప్తి లేకపోయినది. కాదంబరీగ్రంథమందు మంగళాచరణము లేనప్పంటికీ గ్రంథమునకు వెలుపలనే అనగా జన్మాంతరమందయిననూ మంగళాచర

ణముచేసి యుండవచ్చును గనుక పరిసమాప్తి కలిగినదని చెప్పవలయును. గాన దోషము లేదు. అనగా మంగళము సమాప్తినిగురించి విఘ్నములను నశింపజేయుచూ కారణమగును. అందుచే విఘ్నములతో సమానమైన సంఖ్య గల మంగళముగాని బలవత్తరమైన మంగళముగాని సమాప్తిని గురించి కారణమని చెప్పికొని యుంటచేత దోషములేదు. గ్రంధకర్త నాస్తికుడై మంగళాచరణమే చేయునిచో వాని గ్రంథ పరిసమాప్తిగూడా జన్మాంతరమందు చేసిన మంగళమువలన కలిగినదని చెప్పుకొనవలెను.

'మంగళము క్రియాత్మకమని శబ్దాత్మకమని, జ్ఞానాత్మకమనియు మూడరకములు. ఈ మూడు రకములలో యే విధమైన మంగళము ఉన్నప్పంటికి సమాప్తిరూపకార్యము కలుగును. కార్యకారణభావము ఎటులననగా సమాప్తి అనగా చివరవర్ణముయొక్క ధ్వంస, ఇటువంటి సమాప్తినిగురించి క్రియాత్మకమైన (నమస్కారరూపమైన) మంగళము స్వప్రతియోగియైన చరమవర్ణమునకు కారణమైన కృతిమత్తుకు అవచ్ఛేదకమగుటఅను సంబంధముచే కలుగు సమాప్తినిగురించి సమవాయ సంబంధముచే మంగళము కారణము. స్వపదముచే సమాప్తిని తీసికొనిన యడల,స్వ అనగా చరమవర్ణ ధ్వంసరూపసమాప్తి. దానికి ప్రతియోగి చరమవర్ణము. ఆ చరమవర్ణమునకు కారణము కృతి (పయత్నము) కృతిమత్ (పయత్నము కలవాడు)ఆత్మ. ఆత్మకు అవచ్ఛేదము శరీరము అవచ్ఛేదకమగుట అను సంబంధము శరీరమందు ఉండును. అందుచేత స్వప్రతియోగి చరమవర్ణానుకూల కృతిమదవచ్ఛేదకత్వ సంబంధముచే స్వపదార్థమైన సమాప్తి శరీరమందు ఉండెను. కారణమైన క్రియాత్మక మంగళముగూడా శరీరమందు సమవాయ సంబంధముచేఉండెను గాన శరీరాంతర్భావేన కార్యకారణభావము చెప్పవలెను.

జ్ఞానాత్మక మంగళమునకు సమాప్తికి కార్యకారణభావము ఆత్మాంతర్భావేన చెప్పవలయును. జ్ఞానము ఆత్మయందు సమవాయసంధముచే ఉండును సమాప్తి, స్వప్రతియోగి చరమవర్ణాను కూలకృతిమత్వ సంబంధముచే ఉండును. స్వప్రతియోగియైన చరమవర్ణమునకు అనుకూలమై కృతిమత్తా సంబంధముచే పుట్టు సమాప్తినిగురించి సమవాయు సంబంధముచే జ్ఞానాత్మకమైన మంగళము కారణము. శబ్దాత్మకమైన మంగళమునకు సమాప్తికి ఆకాశాంతర్భావేనా కార్యకారణభావము చెప్పుకొనవలయును.

శబ్దము ఆకాశగుణము గనుక ఆకాశమందు శబ్దము సమవాయసంబందముచే ఉండును. సమాప్తి అనగా చరమవర్ణధ్వంస గాన ధ్వంస స్వప్రతియోగి సమవాయి కారణమందు స్వరూపసంబంధముచే ఉండును, స్వ అనగా చరమ వర్ణ ద్వంస. దానికి ప్రతియోగి చరమవర్ణము (అంతిమ అక్షరము) ఆ అక్షరమునకు సమవాయికారణము ఆకాశము. ఆకాశాంతర్భావేన సామానాధికరణ్యము. స్వరూపసంబంధముచే కలుగు సమాప్తిని గురించి సమవాయ సంబంధేన శబ్దము కారణము, ఈ విధముగా మూడు రకముల కార్యకారణభావము.

స్వప్రతియోగి చరమవర్ణములకు కారణమైన యే కృతిగలదో ఆ కృతి మత్తాసంబంధముచే కలుగు సమాప్తినిగురించి స్వజన్యవిఘ్నధ్వంసవత్తా సంబంధేన మంగళము కారణము అనిగూడా చెప్పవచ్చును. ఇప్పుడు ఆత్మఅంతర్భావేన కార్యకారణభావము చెప్పవలెను. స్వజన్య విఘ్నధ్వంసవత్తా సంబంధము అన్నచోట స్వపదము కారణమైన మంగళము దాని వల్ల పుట్టినది విఘ్నధ్వంస. ఆ విఘ్నధ్వంస ఆత్మయందు ఉండును. ధ్వంస స్వప్రతియోగి సమవాయి కారణమందు ఉండునుగాన స్వ మనగా విఘ్నధ్వంస, దానికి ప్రతియోగి విఘ్నములు అనగా అధర్మవిశేషము. దానికి సమవాయి కారణము ఆత్మ. ద్రవ్యము స్వగతగుణమును గురించి సమవాయి కారణమగును.

మూ॥ నను మంగళస్య కర్తవ్యత్వే కింప్రమాణ మితిచేన్న.శిష్టాచారాను మితశ్రుతే రేవప్రమా

ణత్వాత్, తథాహి, మంగళం వేదబోధిత కర్తవ్యతాకం అలౌకిక అవిగతశిష్టాచార విషయత్వాత్ । దర్శాదివత్ । భోజనాదౌవ్యభిచారవారణాయ అలౌకికేతి రాత్రి శ్రాద్ధాదౌ వ్యభిచారవారణాయఅవిగతేతి।శిష్టపదంస్పష్టార్థం। నకుర్యాన్నిష్ఫలంకర్మేతి జలతాడనాదేరపినిషిద్ధత్వాత్

మంగళమునకు వేద (శృతి) బోధిత కర్తవ్యతాకత్వమును సాధించుటకొరకు శంకించుచున్నాడునను అని, మంగళము చేయదగినది, అని చెప్పుటకు ప్రమాణము ఏదిఅన శిష్టుల యొక్క ఆచారముచే ఊహించబడిన శృతియే ప్రమాణము అని చెప్పవలయును. శిష్టులు గ్రంథ పరిసమాప్తికొరకు ఆదిలో మంగళము చేయుచున్నారు, అదివారల ఆచారము ఆ ఆచారము వేదమూలకము "సమాప్తికామో మంగళమాచరేత" అను శృతి లేనిచో వారు గ్రంథాదియందు మంగళముచేసి యుండరు. మంగళము చేసినారు గనుక దానిచే పైన చెప్పిన శృతి ఊహించబడును దానినే శిష్టాచారానుమిత శృతేరేవ ప్రమాణత్వాత్ అని చెప్పెను తదాహి - దానినే నిరూపణ చేయుచున్నాడు.

మంగళము, వేదబోధితమైన కర్తవ్యత కలది. అలౌకికమై అవిగతమైన యే శిష్టాచారముగలదో ఆ ఆచారములో విషయమగుట వలన. మంగళము పక్షము, వేదబోధితమైన కర్తవ్యము, సాధ్యము, అవిగతమై అలౌకికమైన యే శిష్టాచారము గలదో ఆ ఆచారములో విషయమగువలన అనునది, హేతువు ఎచట ఎచట హేతువు ఉండునో అచట సాధ్యము ఉండును దృష్టాంతము ధర్మశ్రాద్ధము ఈ ధర్మశ్రాద్ధమందు శిష్టాచారవిషయత్వమను హేతువు ఉన్నది. సాధ్యమైన వేదబోధిత కర్తవ్యత్వమను సాధ్యముగూడా ఉన్నది గనుక యీ హేతువు సద్ధేతువే ఇచ్చట హేతువులలో అలౌకికమై అను విశేషణము తీసి అవిగతశిష్టాచారవిషయత్వత్ అని మాత్రమే చెప్పిన భోజనమందు అతివ్యాప్తి ఏచ్చును అనగా హేతువు వ్యభచారరూపదోష గ్రస్తమైనది. సాధ్యము లేనిచోట హేతువు ఉండుట(సాధ్యాభావవద్వృత్తిత్వం) వ్యభిచారము ప్రస్తుతము సాధ్యము వేదబోధితమైన కర్తవ్యముగాన, యీ సాధ్యము భోజనమందులేదు మనము వేదము చెప్పినదిగదా అని భోజనము చెయ్యము. కోరిక వలన భోజనము చేయుచున్నాము సాధ్యము లేని భోజనమందు అవిగతమైన శిష్టుల ఆచారము ఉండుటచే హేతువు వ్యభిచారరూపదోష గ్రస్తమగును అందుకొరకు, అలౌకిక అను విశేషణము అవసరమే. ఆ విశేషణము వేసినచో అలౌకికమనగా విధిలేకుండగా రాగాదుల వల్ల కలిగినవి ఏవికలవో వాట్లకంటె వేరయినది భోజనమందు విధిలేకయే అనగా వేదము చెప్పకయే రాగమువలన కర్తవ్యత్వము సిద్ధించును గనుక వాట్లకంటె వేరయినదికాలేదు గనుక అలౌకికమైనఆచారవిషయత్వము భోజనమందు లేదు గనుక అతివ్యాప్తి వారించినది అటులనే అవిగత అని లేనిచో రాత్రి శ్రాద్ధమందు వేదబోధిత కర్తవ్యత్వ రూపసాధ్యము లేనప్పంటికి అలౌకికమైన శిష్టాచారవిషయత్వము ఉండుటచేత మరల హేతువు దుష్టమగుచున్నది అందువలన అవిగతమైన అను విశేషణముగూడా ఉండవలయును. అవిగతమనగా ధర్మశాస్త్రనిషిద్ధము కానటువంటిదిఅని అర్థము "నకుర్యాత్ నక్తంశ్రాద్ధం"అని నిషేధము ఉండుటచేత రాత్రి శ్రాద్ధము నిషిద్ధమైనదే గాన అవిగతముకాలేదు, అలౌకిక అవిగత పదములకు యీ పై అర్థము చెప్పిన తరువాత శిష్టపదముయొక్క ఆవశ్యకతలేదు "నకుర్యాత్ నిష్ఫలంకర్మ" అని జలతాడనముగూడా శాస్త్రనిషిద్ధమైనదగుటచేత, అందువలన విధిలేకయే రాగాదులవలన ప్రాప్తించినవాటికంటె భిన్నమై శాస్త్రనిషిద్ధముగాని ఆచారవిషయమగుటవలన అనునది హేతువు, వేదబోధితమైన కర్తవ్యత అనునదిసాధ్యము, మంగళము పక్షము అని చెప్పగలెను

(సశేషము)

మాసఫలములు

7-12-59 — 7-1-60

శ్రీ 'బుధ'

సాముదాయక ఫలం- సర్వభూతాత్మ యగు, రవి, సంచరించు రాశి శీలమును బట్టి సామాన్యముగ, ప్రతి వ్యక్తియందు నొక నూతన చైతన్యమగుపించును ఉత్సాహశక్తి, చురుకుదనము అధికమగును వారివారి శక్తిసామర్థ్యములను, బహిర్గతమొనర్చి బుజువుపరచుకొన ప్రయత్నింతురు కొందరు, విజ్ఞానచింతన- ఆధ్యాత్మిక వికాసముతో అంతర్ముఖానందమును- మరికొందరు క్రీడా, వినోదములతో బాహ్యానందమును పొందుచుందురు నిర్లక్ష్యము, అమితత్వము- వ్యాకులత, కలహప్రియత్వము- ఎదుర్కొనుట మొదలగునవి, ఈ రాశి స్వాభావిక దుర్గుణములు, హానికరములు, నగుచున్నవి.

ప్రత్యేకఫలం:- ఏ సంవత్సరమందైనను జనవరి **21** ఫిబ్రవరి **20** లోపుగా జన్మించిన వారికి, లేక, శ్రవణ, ధనిష్ఠా నక్షత్రజనితులకు ఈ మాసమందు గ్రహస్థితి మిగుల అనుకూలం ఇష్టసిద్ధి, పదవియందాధిక్యత, ధనధాన్య వస్తు వాహన లాభము, వ్యాపారమందధిక లాభము, శుభకార్యనిర్వహణ, మొదలగు శుభఫలితములు జరుగును.

మేషము

(అశ్వ. భర, కృత్తి 1 పా,)

ఇబ్బందులకు గురికాకుండా కాపాడగలంతములకు శుక్రుడొకడే శుభుడు. మిగిలిన గ్రహములన్నియు దుష్టస్థానములందే సంచరించుచున్నవి అందు అష్టమ అంగారకుడు మిగుల దోషి. అశుభపర్యవసానమే ఎక్కువగ కన్పట్టుచుండును.

ప్రస్తుత సమస్యలే బాధాకరంగా యుండ, అదనంగా మరికొన్ని సమస్య లుత్పన్నమగుచుండును ముందెప్పుడో రాగల కార్యావసరములు ఇప్పుడే వచ్చి కూర్చుండును వీటినన్నిటి సవరించుకొన జాలక సతమతమగుచుందురు చిత్తశాంతత యుండదు. మానసిక, శారీరక, శ్రమ లధికమగుటచే అనారోగ్యమునకు కారణమగును ఆగ్రహావేశములు పనికిరావు నిగ్రహముతో కార్యసాధన జేసికొనవలయును పరుల నమ్మి బాధ్యతలు అప్పగించుట తగదు. ధనవ్యయమేతప్ప వారివల్ల ఏ కార్యము నెరవేరదు ఉద్యోగ, వ్యాపారములు సక్రమంగా సాగక నిస్పృహ, విసుగుదలను కలిగించును. అయినప్పటికి, శుభుడైన శుక్రవీక్షణ జన్మరాశికి కలిగియున్నందున తలవనితలంపుగా ద్రవ్యలాభము సమకూరును ఇది దైవికము ఇందువలన అభాసుపాలుగాక పై చిక్కుల సమర్థించుకొన జాలుదురు సప్తమ శుక్రస్థితివలన, భోగములందపేక్ష- కళత్ర, పుత్రుల సౌఖ్యము- వ్యాపార వ్యవహారిక విషయములలో దూరదేశప్రయాణము- ఆరోగ్యము కాపాడుకొనుటలో శ్రద్ధ వహించవలెను. ఉద్యోగస్తులు తమవిధి నిర్వహణలో అప్రమత్తులై యుండజనదు పై అధికారుల ఆగ్రహావేశములకు గురియగు నవకాశము కలదు

వృషభము

(కృత్తి 2 3, 4, రోహిణి, మృగ 1, 2 పా)

జన్మరాశికి సమసప్తకంలో, నాలుగు గ్రహములు సంచరిస్తూ వుండును-ఎక్కువ శుభదాయకముకాదు ఉద్యోగ వ్యాపారధర్మములు ప్రోత్సాహకరంగా సాగవు ప్రయత్నములందే విముఖత, నిస్పృహ, జనించును-స్వల్ప విషయములందును మిగుల శ్రమపడవలసివచ్చును. ఆడంబరము ప్రదర్శించిన, ప్రయోజనము శూన్యము. సహనశక్తితో కార్యసాధన గావించుకొనవలయును వృత్తి వ్యాపారాదుల మార్పును గూర్చి ఆలోచనలు జరుగును - స్వయంకృషి కన్ననూ పరులసహాయ మపేక్షించుటవలననే ఫలితము సమకూరగలదు- మిత్రులు, భాగస్థులు మీకృషికిని కృషిసాఫల్యతకు దోహదమిచ్చెదరు-డిసెంబరు **1** నుండి రాశ్యాధిపతి శుక్రుడు స్వస్థానగతుడగుటచే, మీ విజ్ఞానాత్మకమైనకృషి ఫలించి ఆర్థికలాభము చేకూర్చును. నృత్య, నాట్య, సంగీత సాహిత్యమార్గములలో కృషి చేయువారికి మిగుల అనుకూలం ప్రేమయందు విజయం-నూతన స్నేహితులు వివాహము-మొదలగు శుభఫలములు జరుగును. డిసెంబరు నుండి వక్రించిన, బుధుడు పురోగమించుటచే వర్తక వ్యాపారాదులు సక్రమంగా సాగిపోవుచూ ధనలాభము కలుగుచుండును రహస్యవ్యాపారము- స్పెక్యులేషన్ వలన లాభము, సప్తమరాశి

యందు రవి, కుజ సంచారము వలన గృహస్థ జీవితమందశాంతి - పురుషులకు భార్య, భార్యకు భర్త వ్యాధిపీడితులగుదురు ఆర్థికపరిస్థితి సహితము అసంతృప్తికరముగనే యుండును బంధు కలహము తప్పదు

మి థు న ము

(మృగ 3, 4, ఆర్ద్ర, పున 1, 2, 3 పా)

ఈ రాశివారికి డిసెంబరు 16 వరకు గ్రహస్థితి మిగుల అనుకూలము ఆరవయింట రవి యుండి, ఇష్టకార్యసిద్ధిని వ్యవహార జయమును, గొప్పవారి సహాయసంపత్తిని, శుక్రుడు పంచమస్థితిని బొంది స్థాన, అర్థ, మాన, లాభములను, సంప్రాప్తింపజేయుదురు మీ సంకల్పములు నూటికి నూరుపాళ్ళు జయప్రదమై ఆర్థిక లాభము చేకూర్చును శక్తికిమించిన సాహస కార్యములలో ప్రవేశించుట, నిర్లక్ష్యము ఈ గ్రహకూటమిలోనున్న దుర్గుణము, గమనించు దురుగాక. బుద్ధిసూక్ష్మతతో శాస్త్రసమీక్ష, విమర్శనలు చేయుదురు మాటలు. వ్రాతలు సామర్థ్యముకలిగి ఆకర్షణీయముగా యుండును. ఉద్యోగ, వ్యాపారధర్మములు ప్రోత్సాహకరంగా యుండి ధనలాభము కలిగించును. వ్యాపారస్థులు అధికలాభములపొందు నవకాశముకలదు లౌకిక వ్యాపారములు కలసి రాగలవు బంధుమిత్రాదులతో, మృష్టాన్నభోజనములతో గృహస్థజీవితము సుఖప్రదంగా యుండును శుభకార్యయత్నము అనుకూలించును ప్రేమికులవాంఛలు ఫలించును నూతనమైత్రి, వ్యవహారజయము

క ర్కా ట క ము

(పున 4, పుష్య, ఆశ్రే)

పంచమకోణములో భాగ్య, రాజ్యాధిపతుల సమాగమము చతుర్థ శుక్రుడు కొంతమేలు చేయుదురు అప్రయత్నముగనే యత్నకార్యానుకూలత ఉద్యోగాభివృద్ధి, స్థితిగతులభివృద్ధి, గౌరవము కార్యనిర్వాహణలో గోప్యము దక్షత అవసరము కార్యసిద్ధి యగువరకు, ఆప్తులతోడనైన ఆంతర్యము విప్పి చెప్పకూడదు మంత్ర తంత్ర రహస్యముల తెలిసికొన నభిలషింతురు. బంధుమిత్రుల రాకవలన శుభవార్తలందును సాంఘిక, గృహస్థ, జీవితము సుఖప్రదంగా గడచిపోవుచుండును శుభకార్యములు కలసి రాగలవు చతుర్థ శుక్రస్థితివలన నూతనవస్త్రాభరణప్రాప్తి, డిసెంబరు 3 నుండి పంచమస్థానమందు బుధుడు వక్రత్యాగిమైనందున వ్యాపారాదికృషులు లాభదాయకంగా జరుగుటా 16 తదుపరి విశేషలాభమును పొందు నవకాశము కలదు. స్పెక్యులేషన్ లాభించును స్నేహితుల వలన మేలు సమకూరును మధ్యవర్తిత్వము, కమీషన్ వ్యాపారమందు ధనలాభము

సిం హ ము

(మఖ, పుబ్బ, ఉత్త 1 పా)

గ్రహస్థితి ననుసరించి. మీ ఉద్యోగ వ్యాపారములలో మార్పుకనిపించదు పరిస్థితులన్నియు యథాప్రకారంగా జరిగిపోవుచుండును పరుల బాధల పైనవేసికొని శ్రమ పడుచుందురు అట్టివారు తుదకు తమ విశ్వాసమునైననూ తెలుపక పోవటంలో మానసికంగా చింతపడుదురు. నిరర్థకకార్యకలాపములతో, వృథావ్యాసంగములతో ఎక్కువగా కాలమును వ్యయపరచుచుందురు. ఊహాప్రపంచములో విహరించుచుందురు విషయవాంఛలందును, భోగలాలసత్వముందును, ప్రీతి కలుగును సాంఘిక, రాజకీయ వ్యవహారములలో, మీ పరపతిని వినియోగించి, విజయమొంది గౌరవింపబడుదురు డిసెంబరు 1 నుండి తృతీయ శుక్రస్థితివలన, క్రమక్రమంగా విఘ్నములు తొలగి కార్యానుకూలత ఏర్పడును. ఉద్యోగ వ్యాపారములలో స్వల్పలాభము సంగీత, నృత్య, నాట్యవృత్తులుగలవారికిని కల్పిత కథలు వ్రాయువారికిని మంచికాలము, ఆర్థికపరిస్థితులు తృప్తికరంగా యుండవు తరచు అనారోగ్యములతో గృహస్థ జీవితమందశాంతి,మాతాపితురులకు మంచిరోజులుకావు ఉత్తరప్రత్యుత్తరములద్వారా వ్యాపారఅనుకూలత ఏర్పడును

క న్యా

(ఉఫ 2 3,4, హస్త, చిత్త 1, 2 పా)

డిసెంబరు 3 వరకు తృతీయమందు జన్మరాశ్యాధిపతికి వక్రగతి యత్నకార్యవిలంబన, నిరుత్సాహము 16 తరువాత రవి అశుభుడు స్థానచలనము. బంధుకలహము. కావున డిసెంబరు 3-16 వరకు మాత్రమే మంచికాలము ఇందు మీ యత్నకార్యములపెట్టి ఆటంకములు లేకయే నెరవేరగలవు ఉద్యోగవ్యాపారములలో సామాన్యలాభము మిత్రులవలన ధనప్రాప్తి, శుభవార్తలు విందురు సాంఘిక వ్యవహారములు సుఖము నివ్వవు తృతీయ అంగారకస్థితివలన, అపుడపుడు నిగ్రహమును కోలుపోవుట సంభవ

మగును. మీమాటలు, వ్రాతలు తీవ్రతజెంది ఇతరుల మనస్సును నొప్పించునట్లుగా యుండును వైరాగ్య అసూయదృష్టితోగాక వాస్తవిక దృష్టితో మిమ్ముల మీరే విమర్శించుకొనుట, గతమునుగూర్చి పశ్చాత్తాపపడుట, సంభవమగును ఉద్యోగ వ్యాపారాదికృషులు క్రమబద్ధముగా నడుపుటకు పట్టుదలతో పనులు చేయుదురు ఇదివరకెన్నడు చేయని సాహసకృత్యములు చేయుటకు సంకల్పింతురు. తరచు దగ్గరప్రయాణములు చేయుచుందురు.వ్యవహారిక విజయము నూతనమైత్రి డిసెంబరు 1 నుండి ధనస్థానమందు శుభుడైన శుక్రస్థితివలన ఏదో విధంగా ద్రవ్యము సమకూరుచు ఆర్థికావసరములు తీరిపోవుచుండును నూతన స్నేహితులతో మృష్టాన్నభోజనములతో గృహస్థజీవితము సుఖప్రదంగా యుండును. ఆప్తమిత్రునకు ఏదోనొక ఆపద వాటిల్లుట, ఆదుకొనవలసిన అవసరం సూచించుచున్నది.

తుల

(చిత్త 3, 4 స్వాతి, విశా 1, 2 3 పా)

జన్మరాశియందు శుభుడగు శుక్రస్థితివలన పదవియందాధిక్యత, ప్రజాదరణ, సాంఘికగౌరవము. నూతనమైత్రి భూషణప్రాప్తి, శుభకార్యములు కలసిరాగలవు అగోచరమైన ప్రేమసంబంధములు నిగూఢమైన శాస్త్రరహస్యముల తెలిసికొను నభిలాష అట్టిపరిశ్రమ డిసెంబరు 16 నుండి ఉద్యోగ వ్యాపారాభివృద్ధి నూతన ప్రయత్నానుకూలత ధనస్థానములో పాపులైన రవి కుజస్థితివలన ఆదాయమునకుమించిన వ్యయము ఆర్థికపరిస్థితులు తృప్తికరంగా యుండవు తరచు అనారోగ్యములతో కుటుంబ పరిస్థితులును సుఖమునివ్వవు. ఉష్ణాధిక్యత, నేత్రబాధ, తలనొప్పి మొదలగువాటిచే మీ ఆరోగ్యము సహితము చెడును

వృశ్చికము

(విశా 4, అనూ, జ్యేష్ట)

జన్మరాశియందు చాతుర్గ్రహకూటమి మంచి, చెడులు ఇచ్చుటలో తీవ్రతగలది ఏదోనొక నిశ్చయమునకొచ్చి పరిష్కరించుకొనవలసియుండుటలో మీ నిర్ణయశక్తి లోపించును. బహువ్యాపకంతో విశ్రాంతియుండదు భౌతికవిషయాభినివేశము అధికారవాంఛ, నిగూఢరహస్యముల తెలిసికొను తలంపు. శాస్త్రపరిశోధన, ధనలాభమునకుపకరించు నూతనకృషి, ప్రభుత్వోద్యోగుల సహకారము, పదవియందాధిక్యత, ఆర్థికపరిస్థితులు సామాన్యము - వ్యాపారమునందు స్వల్పలాభములు, దానధర్మములకు, శుభకార్యములకు ఖర్చు, భోగవిలాసములకు సహితము ధనవ్యయమధికము సుఖప్రదమైన గృహస్థజీవితం రవి, కుజ, జన్మస్థితివలన, ఆరోగ్యమునుగూర్చి జాగ్రత్త అవసరము - ఉష్ణాధిక్యత, విషజ్వరములు, ప్రయాణములలో గాయపడుట, మొదలగు ప్రమాదములకు గురియగుటను తెలుపుచున్నది,

ధనుస్సు

(మూల, పూషా, ఉషా 1 పా)

జన్మరాశియందు శని సంచారమేగాక, రవి, కుజులు వ్యయస్థితియు మంచిదికాదు. కష్టములకు తోడు మరికొన్ని కష్టముల నెదుర్కొనవలసి వచ్చును స్థితిగతులు మిగుల అస్థిరంగా వుండును ఉద్యోగ వ్యాపారాదులకు ఆటంకములు స్థానచలనము శత్రు, రోగ, ఋణబాధలు. విజ్ఞానాత్మకంగా కృషిచేయువారికి భౌతిక,ఆధ్యాత్మిక, సమన్వయ పరచుటలో వేదాంతమునకు, మతమునకు ముడివేయుటలో చిక్కులు పడుచుందురు. వివేకరహితమైన కార్యాచరణ, ఆగ్రహావేశములవలన కార్యహాని ఇంత చెడ్డకాలమునందును ఏకాదశ శుక్రస్థితివలన, తలవనితలంపుగా మేలు సమకూరును స్నేహితులవల్లనూ. స్త్రీలవల్లనూ ప్రయాణములవల్లనూ ధనప్రాప్తి కలుగుచూ పైచిక్కులు తొలగించుకొనుచుందురు తరచు అనారోగ్యములతో గృహస్థజీవితము సుఖమునివ్వదు. కళత్ర-సుతులలో నొకరికి మిగుల జబ్బుచేయుటను తెలుపుచున్నది.

మకరము

(ఉషా 2, 3 4 శ్రవణ, ధని 1, 2 పా)

గ్రహస్థితి మిగుల అనుకూలం, శని వ్యయమందున్ననూ తదితర గ్రహములన్నియు శుభస్థానములలో నుండుట శుభదాయకము. ఆశాజనకమగు అవకాశములు శ్రమ లేకయే యత్నకార్యానుకూలత కాని అధికఫలాపేక్షతో అతిగా ప్రవర్తించుటమాత్రము తగదు. ఉద్యోగ, అధికార, అభివృద్ధి సాహసించి, ఎక్కువ పెట్టుబడులతో, అధికలాభముల పొందగలస్థితి వ్యాపారస్థులకు గలదు ఉద్యోగ వ్యాపారముల ననుసరించి దీర్ఘ ప్రయాణములు ఇతరపట్టణవాసము.

విద్యార్థులకు-సాహితీమార్గములలో కృషిచేయు వారికి, విజయం - భూ గృహ, నూతన నిర్మాణ ప్రయత్నములు అనుకూలించును గృహమందు శుభ శోభనకార్యములు, సంతానప్రాప్తి మొదలగు శుభఫలితములు-జరుగును సోమరితనము మాని, చురుకుగా పనిజేసి, మనోభీష్టముల నెరవేర్చుకొనండి.

కుంభము

(ధని 3, 4 శత, పూభా 1, 2, 3)

గ్రహస్థితి మిగుల అనుకూలము యత్నకార్యానుకూలత, అత్యుత్తమపదవి, అధికారము, గౌరవము - ప్రభుత్వాదరణ, ఉద్యోగస్థులకు ప్రమోషన్-వ్యాపారాది కృషులు లాభదాయకంగా యుండును వర్తకులు సాహసించి పురోగమింపవచ్చు. డిసెంబరు 16 పిదప అధిక లాభము. భారీవ్యాపార ప్రవేశము, సాంఘిక గౌరవము, లౌకిక వ్యవహారములు, కంట్రాక్టు పనులు కలసివచ్చును. ఆర్థిక పరిస్థితులు అనుకూలం. నూతన వస్తువాహనప్రాప్తి, నూతన బంధుమిత్రాదులతో మృష్టాన్న భోజనములతో గృహస్థజీవితము సుఖప్రదంగా జరిగిపోవుచుండును శుభశోభనకార్యములు కలసిరాగలవు.

మీనము

(పూభా 4. ఉభా, రేవ)

గ్రహస్థితి. మంచిచెడులు సమంగా నడుచును యత్నకార్యవిలంబన - ఆవశ్యకత అవసరము ఎక్కువగును, తగినట్లుగా ఆర్థికపరిస్థితులు అనుకూలించవు ఆందోళన, విశ్రాంతి. సుఖములేకపోవుట. ఉద్యోగ వ్యాపార పరిస్థితులయందు మార్పు కనిపించదు ఉన్నదున్నట్లుగా పరిస్థితులు జరిగిపోవుచుండును. డిసెంబరు 16 నుండి పనులు వెంటవెంటనే అనుకూలమగును. సంతతిని గూర్చిన శుభసంతోషములు స్నేహితుల వలన మేలు వేద,శాస్త్ర,పురాణపఠన,గురుపూజ, యాత్రాఫలసిద్ధి. ఈ రాశిలో జన్మించిన కొందరికి భోగలాలసత్వము. నూతనప్రియుల సాంగత్యము. స్థిరచరాస్థుల నష్టము, ఋణముచేయుట మొదలగు చెడు ఫలములు జరుగును.

చందాదారులకు వినతి

"నవభారతి" పత్రికకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియజేస్తున్నాము,

ఇంతవరకూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యధాతధంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మేనేజరు, నవభారతి

గ్రంథస్వీకారము

ఈ క్రింద పేర్కొనిన గ్రంథములు మా కార్యాలయమునకు అందినవి.

శ్రీరామకృష్ణుని జీవితచరిత్ర
శ్రీ చిరంతనానందస్వామి
వెల. 2-75
ప్రతులకు, భీమవరము, ప. గో. జిల్లా

చకోర సందేశము
శ్రీ మోటూరి వేంకటరావు, బి ఏ.
వెల. 2-00
ప్రతులకు · శోభా ప్రచురణలు
విజయనగరం.

శ్రీ దేవీగానసుధ
శ్రీ ఓగిరాల వీరరాఘవశర్మ
వెల ప్రథమ సంపుటి 2-00
వెల : ద్వితీయ సంపుటి 3-00
ప్రతులకు · గోష్పదీక్షేత్రము
కొవ్వూరు, ప. గో. జిల్లా

గాంధీగీత
శ్రీ గొట్టిపాటి సుబ్బరాయుడు
వెల: 1-00
ప్రతులకు · వికాస ప్రచురణ
అనంతపురం.

రాగవాసిష్ఠం
(పౌరాణిక సాంఘికనాటకం)
శ్రీ బోయి భీమన్న
వెల : 2-25
ప్రతులకు : సంస్కృతీ సంవర్ధక సమితి
విజయనగరకాలనీ (మల్లేపల్లి)
హైద్రాబాద్

తెలుగురాజు
పండిత, శ్రీ సత్యనారాయణరాజు
వెల. తెలియదు
ప్రతులకు : శ్రీ విక్రమ విలాసము
తణుకు

ఆంధ్రాభ్యుదయము
(వ్యాససంపుటి)
శ్రీమతి త్రిపురనేని జయప్రదాదేవి
వెల : 1-25
ప్రతులకు · రచయిత్రి
97, Mc, మలక్‌పేట
హైద్రాబాద్

నవోదయము
శ్రీ పడ్లపట్ల రామచంద్రయ్యచౌదరి
వెల : తెలియదు
ప్రతులకు : గ్రంథకర్త
కొవ్వలి, ఏలూరు తాలూకా.

జర్నలిజం
శ్రీ నర్రావుల సుబ్బారావు
వెల. 1-75
ప్రతులకు · కిసాన్ పబ్లికేషన్సు
బుర్రిపాలెం పోస్టు
తెనాలి

కల్పవల్లి
శ్రీ వింజమూరి శివరామారావు
వెల: 2-00
ప్రతులకు వేంకట్రామ అండ్ కో
విజయవాడ

దీనవీణ
శ్రీ వేలేటి అంబదాస్‌శర్మ
వెల: 1-00

ప్రతులకు టి బాలరాజం
సర్వోదయ గ్రంధాలయం
దుబ్బాక, మెదక్ జిల్లా

గౌతమ
శ్రీ పి. వి. సుబ్బారావు
వెల 0-75
ప్రతులకు ప్రగతీ ప్రచురణ
తెనాలి

బాలగీత
శ్రీ మాధవపురి వేంకటరత్నకవి
వెల 0-6-0
ప్రతులకు ప్రజాసాహిత్య కళాపీఠం
విజయవాడ

శ్రీ పురాణపండ రామమూర్తిగారి
గ్రంధములు
విశ్వశాంతి
వెల 0-50

వ్యాసగాకుంతలం
వెల 0-25

శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యం
వెల 0-75

శ్రీ శివస్తోత్రాలు
వెల 0-25

గణాధిపతి
వెల 0-25
ప్రతులకు ఆధ్యాత్మ ప్రచారక సంఘం
ఆలమూరు

ప్రమాణపద్ధతిపై ప్రసంగము
రెనెకార్ట్
ఆంధ్రానువాదము
డాక్టర్, శ్రీ కె. సచ్చిదానందమూర్తి
డాక్టర్, శ్రీ కె. వి ఆర్ నరసింహము
వెల 8-00
ప్రతులకు, ఆంధ్ర విశ్వకళాపరిషత్
వాల్తేరు

ఆంధ్ర మహాభారతము
(సాంస్కృతిక మాసపత్రిక)
వ్యాఖ్యాత ·
శ్రీ పురాణపండ రామమూర్తి
వెల 2-25
ప్రతులకు
కార్యదర్శి
మహాభారత ప్రచారక సంఘము
కాకినాడ

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy, Vijayawada 2
Printed at Nava Bharathi Press, Vijayawada-2